ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 29.06.2026 | సంపుటి : 12 సంచిక : 340 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## నాకు చావంటే భయం లేదు

- ఈ ఏడాదే బంగ్లాదేశ్‌కు వెళ్తాను
- అవామీ లీగ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తేయాలి
- మాజీ ప్రధాని షేక్ హసీనా
- బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులను ఖండించిన మాజీ ప్రధాని

న్యూఢిల్లీ(జనంసాక్షి): తీవ్ర రాజకీయ సంక్షోభం ఏర్పడి తన స్వదేశాన్ని వీడి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాదే తాను బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోతానని ప్రకటించారు. తమ పార్టీ అవామీ లీగ్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక శక్తి అని పేర్కొన్నారు. మైనారిటీలపై జరిగిన ఎలాంటి దాడి అయినా బంగ్లాదేశ్

మిగతా 2లో..

# మూసీ ప్రక్షాళన ఆగదు

## కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు
## బీఆర్ఎస్ హయాంలో పేదల ఇళ్ల గురించి ఆలోచించలేదు



"కేసీఆర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు. ఎంతోమంది త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధిస్తే పదవులు మాత్రం కేసీఆర్ కుటుంబం అనుభవించింది. పదేళ్లు పదవులు అనుభవించి రాష్ట్రాన్ని దోచుకున్నందుకు ప్రజలు బహిష్కరించారు. కేసీఆర్ కుటుంబానికి మళ్లీ పదవులు ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరు. కేసీఆర్ తన మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా ఇవ్వలేదు" - సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణ సాధిస్తే ఆ త్యాగాన్ని బీఆర్ఎస్ వాళ్లు తమ ఖాతాలో వేసుకున్నారు
- రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత
- ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాం
- రూ.13,006 కోట్ల విలువైన హ్యామ్ రోడ్లకు ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన
- రూ.83 కోట్ల తాగునీటి పథకానికి శ్రీకారం
- నిన్న టీఆర్ఎస్.. నేడు బీఆర్ఎస్.. రేపు హెచ్ఆర్ఎస్ ( హరీశ్ రాష్ట్ర సమితి)
- భారాసను ఉద్దేశిస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా



నల్లగొండ ప్రతినిధి, జూన్ 28,(జనంసాక్షి): రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు సమీపంలో నల్గొండ–దేవరకొండ ప్రధాన రహదారిపై రూ.13,006.27 కోట్ల భారీ వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 6,092.37 కిలోమీటర్ల మేర చేపట్టనున్న 441 హెచ్ఏఎం (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రహదారుల విస్తరణ, పటిష్టీకరణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం నల్గొండ జిల్లా కేంద్రంలో టీయూఎఫ్ఐడీసీ ఆధ్వర్యంలో నగర తాగునీటి సరఫరా మెరుగుదలకు తొలి దశలో రూ.83 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నల్లగొండలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం, తెలంగాణ ఉద్యమం, బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృతంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13 వేల కోట్లకు పైగా వ్యయంతో దాదాపు 6,300 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం, విస్తరణకు

మిగతా 2లో..



## హే రామ్..

### మర్యాద పురుషుడి సొమ్ముతో జల్సాలు!!

### అయోధ్య ఆలయ విరాళాల చోరీ కేసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): అయోధ్య విరాళాల చోరీ కేసులో విస్మయపరిచే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ కేసులో 8 మందిని అరెస్టు చేయగా వారిలో ఇద్దరు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. వారి సొంతూరికి వెళ్లి దర్యాప్తు చేయగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. దాతల విరాళాలు, విలువైన వస్తువులను లెక్కించేందుకు తొలుత అక్కడ పనికి కుదిరిన అనుకల్ప్ మిశ్రా.. అధికారులను బతిమాలి తన బావ లవ్‌కుశ్ మిశ్రాను పనిలోకి రప్పించాడు. తన బృందంలో

మిగతా 2లో..

## తెలంగాణ అస్తిత్వంపై మళ్లీ కుట్రలు

- బీఆర్ఎస్‌లోని గుంటనక్కే ఆ శక్తులను పెంచుతోంది
- టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఉద్యమాన్ని ఒకప్పుడు అడ్డుకున్న శక్తులకు ప్రస్తుతం బీఆరఎస్‌లో ఉన్న గుంటనక్కే పాలుపోసి పెంచుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణ అస్తిత్వం పై దాడులు జరుగుతున్నప్పటికీ బీఆరఎస్ స్పందించకపోవడం వెనుక అదే కారణమని ఆరోపించారు. ఆదివారం ఉప్పల్ పిస్తా





## తెలంగాణలో పాగా వేయాలి

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పనిచేయాలి
- పశ్చిమ బెంగాల్ స్ఫూర్తితో తెలంగాణలోనూ పోరాడాలి
- భాజపా నేతలు, కార్యకర్తలకు భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపు

హైదరాబాద్(జనంసాక్షి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా తెలంగాణలోని పార్టీ శ్రేణులు పోరాడాలని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. ప్రజాపోరాటాలు చేయాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు. ఏక్ భారత్–శ్రేష్ఠ్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, సిద్దిపేట,



## సౌదీ అరేబియాలో కుప్పకూలిన హెలికాప్టర్

### ఘోర దుర్ఘటనలో 14 మంది మృతి

### ఫ్రాన్స్‌లో కూలిన విమానం..11 మంది మృతి

రియాద్(జనంసాక్షి): హెలికాప్టర్ కుప్పకూలడంతో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సౌదీ అరేబియాలోని రాస్ తానూరాలో చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ సౌదీ చమురు దిగ్గజం అరామ్‌కోకి చెందినదిగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. కాగా ఫ్రాన్స్‌లోనూ ఇదే తరహా ప్రమాదం

మిగతా 2లో..

## పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వాడండి

- బంగారం కొనుగోళ్లు తగ్గించినందుకు సంతోషంగా ఉంది
- యువత క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి
- ఈ విషయంలో నాగాలాండ్ రాష్ట్రం స్ఫూర్తిగా నిలుస్తోంది
- మన్‌కీ బాత్‌లో మోదీ



ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' ప్రదానం చేసిన ఆదేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ

2లో..

న్యూఢిల్లీ(జనంసాక్షి): పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో బంగారం కొనుగోళ్లు తగ్గడం సంతోషంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. తాను ఇచ్చిన పిలుపునకు స్పందించి బంగారం కొనుగోళ్లు తగ్గించడంపై ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. మనకీ బాత్ 135వ ఎపిసోడ్‌లో భాగంగా ఆదివారం ప్రధాని పలు అంశాలను ప్రస్తావించారు నాగాలాండ్ విమెన్ ఫుట్‌సల్ లీగ్ గురించి వివరించారు. "పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల దేశ ప్రజలకు కొన్ని విజ్ఞప్తి చేశాను. సాధ్యమైన మేర కొంత కాలం పాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని చెప్పాను. నా పిలుపునకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. సందేశాల ద్వారా వారి అనుభవాలను పంచుకున్నారు. ఇంతకాలం సొంతవాహనాల్లో వెళ్లినవారు.. ఇప్పుడు ఇతరులతో కలిసి వెళ్తున్నారు. ఈసారి విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకున్నామని పలువురు సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తున్నారు" అని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. అలాగే యువత క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ విషయంలో నాగాలాండ్ రాష్ట్రం స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. "ఆ రాష్ట్రంలో 'నాగాలాండ్ బేబీ లీగ్' నడుస్తోంది. 5 నుంచి 12 ఏళ్ల మధ్య వయసులో

మిగతా 2లో..

## తెలంగాణ అప్పులపై స్పీకర్‌వి పచ్చి అబద్ధాలు

- గౌరవప్రదమైన స్థానంలో ఉండి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదు
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కేటీఆర్ ఆగ్రహం

వికారాబాద్(జనంసాక్షి): జిల్లా కేంద్రంలోని గౌలికర్ ఫంక్షన్ హాల్ లో వికారాబాద్ నియోజకవర్గ కార్యకర్తల జనరల్ బాడీ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ తెలంగాణలో అప్పులపై స్పీకర్ అబద్ధాలు ఆడటంపై ఫైర్ అయ్యారు. స్పీకర్ మీ ఎమ్మెల్యేగా ఉన్నారు. గడ్డం ప్రసాద్ గారు గౌరవప్రదమైన స్పీకర్ స్థానంలో ఉండి.. కేసీఆర్ మొత్తం అప్పులు చేసి పోయాడు.. మాకు ప్రభుత్వం నడుపొస్తలేదని అబద్ధాలు చెబుతున్నారన్నారు.

మిగతా 2లో..





## తెలంగాణకు భారీ వర్ష సూచన

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో శనివారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 8 సెం.మీ కురిసింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి 6.6, కరీంనగర్ జిల్లా కరీంనగర్ గ్రామీణం 5.8, సూర్యాపేట జిల్లా ముకుందాపురం 5.6, మెదక్ జిల్లా రామాయంపేటలో 5.3 సెం.మీ వర్షం నమోదైంది. ఆది, సోమవారాల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మెదక్,

మిగతా 2లో..



## కేంద్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం!

- మోదీ కేబినెట్‌లో కీలక మార్పులు
- పునర్వ్యవస్థీకరణపై పెరుగుతున్న ఊహాగానాలు
- యువ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం
- బంగాల్‌లో ఎంపీలకు మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు ప్రచారం

న్యూఢిల్లీ(జనంసాక్షి): త్వరలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే మంత్రివర్గంలో మార్పులు ఉండొచ్చని ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ఈనెల 23న ప్రధాని నరేంద్రమోదీ, 25న హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో సమావేశం కావడంతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై ఊహాగానాలు జోరందుకున్నాయి.

మిగతా 9లో..

నిరాధార ఆరోపణలు మానుకుని

## ఆత్మపరిశీలన చేసుకోవాలి

### కరాచీ దాడిలో భారత్ హస్తం ఉందన్న పాక్ ఆరోపణలను ఖండించిన భారత్

### ఉగ్రవాద స్థావరాలపై చర్యలు తీసుకోవాలని సూచన

న్యూఢిల్లీ(జనంసాక్షి): పాకిస్థాన్‌లోని కరాచీలో జరిగిన ఉగ్రదాడి వెనుక భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని భారత విదేశాంగ శాఖ అధికార

మిగతా 9లో..





## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ భయాలు



### పరస్పరం దాడులు చేసుకుంటున్న అమెరికా-ఇరాన్

- హర్మూజ్ జలసంధి వద్ద టెహ్రాన్ లక్ష్యాలపై యూఎస్ దాడులు
- ప్రతిగా యూఎస్ స్థావరాలపై ఇరాన్ ఆపరేషన్
- ఇరాన్ మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది
- అందుకే అమెరికా వైమానిక దళం దాడులు చేసింది: ట్రంప్

వాషింగ్టన్,టెహ్రాన్(జనంసాక్షి): పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ భయాలు మొదలయ్యాయి. అమెరికా-ఇరాన్ రెండురోజులుగా పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి ఇరాన్ క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు లక్ష్యంగా అమెరికా దాడి చేయగా.. అగ్రరాజ్య సైనిక స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేసింది. కువైట్, బహ్రెయిన్‌లోని స్థావరాలపై నౌక, వైమానిక దళాలు మిస్సైల్, డ్రోన్ ఆపరేషన్ ప్రారంభించాయని ఐఆర్‌జీసీ ఆదివారం తెల్లవారుజామున ప్రకటించింది. రెండు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని తొలుత ఇరాన్ ఉల్లంఘించిందని, కార్గో షిప్‌పై దాడులు చేసిందని అమెరికా ఆరోపించింది. దానికి

మిగతా 2లో..



## మళ్లీ రంగంలోకి పాకిస్థాన్

### అమెరికా-ఇరాన్‌లతో దాయాది సంప్రదింపులు

ఇస్లామాబాద్(జనంసాక్షి): పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. గత రెండు రోజుల నుంచి పరిస్థితులు మళ్లీ మొదటికే వస్తున్నాయి. చమురుతో పనామా జెండాతో వెళుతున్న ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేసినట్లు ఆరోపించినఅమెరికా బలగాలు..

మిగతా 2లో..

## సౌదీ అరేబియాలో కుప్పకూలిన హెలికాప్టర్..

చోటు చేసుకుంది. స్కైడైవర్స్‌తో వెళ్తున్న చిన్నపాటి విమానం కూలిపోయి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. టామ్‌బ్లెయిన్ నగరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. పారాచూట్ జంపింగ్ కోసం ఔత్సాహికుల్ని తీసుకెళ్తున్న విమానం ప్రమాదవశాత్తు కూలిపోయింది. అందులో ఉన్నవారంతా మృత్యువాత పడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. సదరు సంస్థపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ అస్తిత్వంపై మళ్లీ కుట్రలు

హౌస్ చౌరస్తాలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అవాకులు, చేవాకులు పేలిన వారే ఇప్పుడు మళ్లీ తెలంగాణ అస్తిత్వంపై కుట్రలు చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ విద్యాసంస్థలు, ఇతర సంస్థలకు ప్రోత్సాహం అందిస్తున్నది బీఆరఎస్‌లోని గుంటనక్కే అని ఆరోపించిన కవిత.. అందుకే తెలంగాణపై అవమానకర వ్యాఖ్యలు వచ్చినా ఆ పార్టీ మౌనంగా ఉంటోందన్నారు. బీఆరఎస్‌కు తెలంగాణతో ఉన్న పేగు బంధం తెగిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు.తెలంగాణ అస్తిత్వంపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ కూడా తెలంగాణ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణలోని ప్రభుత్వ డెయిరీల నుంచి పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలకు పాల సరఫరా జరిగేలా ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే ఆ సంస్థల్లో ధోబీలు, హెయిర్ కటింగ్, ఫర్నిచర్ సరఫరా, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది నియామకాల్లో స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు.ఇడుపు కాగితం అర్థం ఏంటో ఆయనకు తెలుసుఇడుపు కాగితం సినిమా టైటిల్ వివాదంపై స్పందించిన కవిత.. ఆ పదానికి అర్థం ఏమిటో పవన్ కళ్యాణ్ బాగా చెప్పగలరని వ్యాఖ్యానించారు. తెలంగాణ భాష, యాసను అవమానించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు. ఒకరి భాషను మరొకరు గౌరవించుకోవాలని సూచించారు.జూలై 2న భూపోరాటంతెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన 250 గజాల స్థలం కోసం జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో పెద్ద ఎత్తున భూపోరాటం చేపడతామని కవిత ప్రకటించారు. ఉద్యమకారులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ హక్కులు, అస్తిత్వ పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## నాకు చావంటే భయం లేదు

స్వాతంత్ర్యంపై దాడితో సమానమని స్పష్టం చేశారు. ఓ జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఈ మేరకు వ్యాఖ్యానించారు.తాను బంగ్లాకు తిరిగి వెళ్లడమనేది వ్యక్తిగత ఆశయానికి సంబంధించిన విషయం కాదన్నారు షేక్ హసీనా. అధికారం కోసం తాను రాజకీయాలు చేయలేదని చెప్పారు. బంగ్లాదేశ్ ప్రజల సంక్షేమం కోసమే రాజకీయాలు చేస్తానని స్పష్టం చేశారు. చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన, రాజకీయ ప్రేరేపిత ప్రక్రియలో భాగంగా తనపై న్యాయవ్యవస్థను రాజకీయ ప్రతీకార సాధనంగా వాడుకున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలు గతంలోనూ జరిగాయని అప్పుడు అవి విఫలమయ్యాయని అన్నారు. ఇప్పుడు కూడా విఫలమవుతాయని వెల్లడించారు.బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన లేదని షేక్ హసీనా ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థ బలహీనపడిందని, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వేధింపులను ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. అవామీ లీగ్ రాజకీయాలు ప్రతీకారం కోసం కావని హక్కులు, భద్రత, గౌరవం, అభివృద్ధికి సంబంధించినన్నారు. అవామీ లీగ్ రాజకీయ పునరుజ్జీవనం ఏ ప్రభుత్వం దయపైనో ఆధారపడి లేదన్నారు. అది ప్రజలపై ఆధారపడి ఉందని చెప్పారు. అవామీ లీగ్ సంస్థాగత బలానికి ప్రస్తుత బంగ్లా సర్కార్ భయపడుతోందని అన్నారు. అందుకే అవామీ లీగ్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాలను అడ్డుకోవడానికి ప్రభుత్వం సైన్యం, బీజీబీ (బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్), పోలీసులను రంగంలోకి దించిందని గుర్తు చేశారు. ఇది ప్రభుత్వ బలహీనతకు నిదర్శనమని ఆరోపించారు. బలప్రయోగంతో అవామీ లీగ్‌ను అణచివేయలేరని పేర్కొన్నారు.

రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి : షేక్ హసీనా

"బంగ్లాదేశ్‌లో సరైన ప్రజాస్వామ్య వాతావరణం, స్థిరత్వం నెలకొనాలంటే అవామీ లీగ్‌పై ఉన్న అక్రమ నిషేధాన్ని ఎత్తివేయాలి. తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలి. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి. శాంతియుత రాజకీయ కార్యకలాపాలను అనుమతించాలి. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న సర్కార్ ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుంటూనే ఉంది. ప్రజల్లో పేరుకుపోతున్న ఆగ్రహం, బాధ, ప్రజాస్వామ్య ఆకాంక్షలు అవామీ లీగ్‌కు ఒక కొత్త మార్గాన్ని సృష్టిస్తాయి. సైనిక పాలన, వివక్ష, అణచివేత, మతతత్వ రాజకీయాలు, ప్రజాస్వామ్య నిరాకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ద్వారా బంగ్లాదేశ్ ఆవిర్భవించింది. 2024 ఆగస్టు 5 తర్వాత బంగ్లా విమోచన యుద్ధ స్ఫూర్తిపై దాడి జరిగింది. స్వాతంత్ర్య సమరయోధులను చెప్పుల దండలతో అవమానించారు. దేశవ్యాప్తంగా విమోచన యుద్ధవీరుల స్మారక చిహ్నాలను ధ్వంసం చేశారు. జై బంగ్లా నినాదాన్ని ఒక నేరంగా పరిగణించారు. జాతిపిత నివాసంపై పదేపదే దాడులు జరిగాయి. మైనారిటీ వర్గాలపై దాడులు జరిగాయి. దేవాలయాలను ధ్వంసం చేశారు. సూఫీ మందిరాలు, సాంస్కృతిక సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. తీవ్రవాదం వ్యాప్తి చెందడానికి ఆస్కారం కల్పించారు" అని షేక్ హసీనా పేర్కొన్నారు.

అవామీ లీగ్ ప్రభుత్వ హయాంలో 2023లో బంగ్లాదేశ్ 7.25 శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేసిందని, తలసరి ఆదాయం 2,793 డాలర్లకు చేరుకుందని షేక్ హసీనా వెల్లడించారు. బంగ్లాదేశ్ ఏకంగా 29 స్థానాలు ఎగబాకి ప్రపంచంలోనే 35వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గుర్తు చేశారు. విదేశీ మారక నిల్వలు 36 రెట్లు పెరిగాయని, జీడీపీలో పెట్టుబడుల వాటా 32.05 శాతానికి చేరిందన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఐదు రెట్లు పెరిగి 3.48 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని వివరించారు. పేదరికాన్ని 18.7 శాతానికి, తీవ్ర పేదరికాన్ని 5.6 శాతానికి తగ్గించామని పేర్కొన్నారు.

మైనారిటీలపై దాడులను ఖండించిన హసీనా

బంగ్లాదేశ్‌లో హిందువులు సహా మైనారిటీ వర్గాలపై జరిగిన దాడులను షేక్ హసీనా ఖండించారు. బంగ్లాదేశ్‌లో మతతత్వ శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్నప్పుడల్లా మైనారిటీ వర్గాలపై భయంకరమైన హింస జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనారిటీల ఇళ్లు, ప్రార్థనా స్థలాలు, వ్యాపారాలు, జీవితాలు, గౌరవం అన్నీ ప్రమాదంలో పడ్డాయని అన్నారు. మైనారిటీ హక్కుల కోసం మాట్లాడిన చిన్మోయ్ కృష్ణదాస్ ఒక తప్పుడు కేసులో ఇప్పటికీ జైలులోనే మగ్గిపోతున్నారని విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినప్పటికీ బంగ్లాదేశ్‌లో మైనారిటీల తలరాత మారలేదని ఇదే రుజువు చేస్తోందన్నారు.

## తెలంగాణలో పాగా వేయాలి

మెదక్, వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లా భాజపా కార్యాలయాలను నితిన్ నబీన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "ప్రజాసేవ, పోరాటాల ద్వారానే రాష్ట్రంలో అధికారంలోకి రాగలం. పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని ప్రతి కార్యకర్త సంకల్పం తీసుకోవాలి. పశ్చిమ బెంగాల్‌లో కార్యకర్తల కృషితోనే భాజపా ఘన విజయం సాధించింది. అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ పోరాడాలి. త్వరలో ఈ రాష్ట్రంలోనూ కాషాయ జెండా ఎగరాలి. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుంది. లోక్‌సభలో రెండు సీట్లతో ప్రారంభమైన భాజపా.. ఇప్పుడు అప్రతిహతంగా సాగుతోంది. తెలంగాణ ఏర్పాటు కోసం సుష్మాస్వరాజ్ ఎంతో పోరాడారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న భాజపా వల్లే తెలంగాణ కల సాకారమైంది" అని నితిన్ నబీన్ అన్నారు.

# మూసీ ప్రక్షాళన ఆగదు

శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ రహదారులు రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపుతాయని, ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమలు, వ్యవసాయం, వ్యాపార రంగాలకు కూడా ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ తొలి దశలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటానికి నాయకత్వం వహించారని, మలిదశ ఉద్యమంలో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉద్యమానికి బలాన్ని చేకూర్చిన నాయకుడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అని కొనియాడారు. త్యాగాల గురించి మాట్లాడే బీఆర్‌ఎస్ నాయకులు అసలు త్యాగం అంటే ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల్లో పోటీ చేయడం, అధికారంలో ఉండి డబ్బులు సంపాదించడం త్యాగం కాదని, ప్రజల కోసం పదవిని వదులుకోవడమే నిజమైన త్యాగమని అన్నారు.బీఆర్‌ఎస్ నాయకులపై తీవ్ర విమర్శలు చేసిన ముఖ్యమంత్రి, పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని ఆరోపించారు. ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన వారు మళ్లీ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌కు ఇక రాజకీయ భవిష్యత్తు లేదని, ప్రజలు ఇప్పటికే వారిని తిరస్కరించారని అన్నారు.మాజీ మంత్రి హరీశ్ రావును ఉద్దేశించి విమర్శలు చేస్తూ, రూ.100 విలువైన పెట్రోల్ తీసుకొచ్చి రూ.1 అగ్గిపెట్టె దొరకని హరీష్ రావు గొప్పవాడా అంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తప్పుడు ప్రచారాలతో ప్రజలను మోసం చేయలేరన్నారు.2014, 2018 ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీల అమలుపై బహిరంగ చర్చకు బీఆర్‌ఎస్ సిద్ధమా అని సవాల్ విసిరారు. పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ఒక్క మహిళకు మంత్రి పదవి కల్పించలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందని, రాష్ట్రంలోని 3 కోట్ల 85 లక్షల మంది ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. పేదవాడి కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఫామ్ హౌస్‌లో ఉన్న కేసీఆర్ కూడా ఇప్పుడు ప్రజలకు అందిస్తున్న అదే సన్నబియ్యం తింటున్నారని వ్యాఖ్యానించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు గౌరవప్రదమైన నివాసాలు కల్పిస్తున్నామని చెప్పారు. పేదలకు ఇళ్లు ఇస్తుంటే కొందరికి కడుపుమంట కలుగుతోందని విమర్శించారు. తాము వందల ఎకరాల్లో ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నా పేదల ఇళ్ల గురించి



ఆలోచించలేదని బీఆర్‌ఎస్‌పై విమర్శలు గుప్పించారు.రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఉచిత విద్యుత్, మహిళలు, రైతులు, పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.వ్యవసాయం దండగ కాదని, రైతుకు లాభదాయకంగా ఉండేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ ఏడాది 80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపామని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై మరోసారి విమర్శలు చేస్తూ, అది కాళేశ్వరం కాదు కులేశ్వరంగా మారిందని ఆరోపించారు.విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. అరుట్ల ప్రభుత్వ పబ్లిక్ పాఠశాలలో ఈ కార్యక్రమం అమలవుతున్న తీరును పరిశీలించామని, విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు.ప్రజల సంక్షేమం కోసం జనగణన నిర్వహించిన తొలి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. గొర్రెలు, పశువులకు లెక్క పెట్టిన గత ప్రభుత్వం ప్రజలకు లెక్క పెట్టలేదని విమర్శించారు.ఫ్లోరైడ్ సమస్యతో దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న నల్లగొండ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పనులను తాము పూర్తి చేస్తున్నామని, వచ్చే ఎన్నికల నాటికి ఎస్‌ఎల్‌బీసీని వంద శాతం పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని హామీ ఇచ్చారు.మూసీ నది ప్రక్షాళన తన జీవిత లక్ష్యమని పేర్కొన్న ముఖ్యమంత్రి, నల్లగొండ ప్రజలు కాలుష్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చామల కిరణ్ కోరుకున్న విధంగానే మూసీ ప్రక్షాళన పూర్తి చేస్తానని సభా వేదికపై ఒట్టు వేసి హామీ ఇచ్చారు.ఫోన్ ట్యాపింగ్ చేసి ప్రజల వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకున్నవారు, రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను ఇబ్బంది పెట్టినవారు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను వేధించినవారు మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం లేదన్నారు.సింగరేణి టెండర్ల విషయంలో బీఆర్‌ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని, ఎన్ని అబద్ధాలు చెప్పినా తెలంగాణ సమాజం వాటిని నమ్మదని స్పష్టం చేశారు. గ్రామాల్లో, కల్లు దుకాణాల దగ్గర, గ్రామ కూడళ్లలో కూడా గత పదేళ్ల పాలనపై చర్చ జరిగితే ప్రజలే తీర్పు చెబుతారని అన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరిన ముఖ్యమంత్రి, 2024 నుంచి 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని పేర్కొన్నారు.

**బీఆర్‌ఎస్.. హెచ్‌ఆర్‌ఎస్ అవుతుంది: మంత్రి కోమటిరెడ్డి**

ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల మూసీ కష్టాలు త్వరలోనే తొలగుతాయని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మూసీ పునరుజ్జీవంతో జిల్లాలో కాలుష్యాన్ని తగ్గిస్తామని చెప్పారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్, అంతకుముందు కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ జిల్లాకు నిధులు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ఇప్పుడిప్పుడే నిధులు వస్తున్నాయన్నారు. నల్గొండ జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన సందర్భంగా నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో కోమటిరెడ్డి మాట్లాడారు. "హ్యామ్ రోడ్లకు టెండర్లు పిలవకముందే అవినీతి జరుగుతోందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. పూటకో పేరు మార్చుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తోంది. నిన్న టీఆర్‌ఎస్, ఇవాళ బీఆర్‌ఎస్.. రేపు హెచ్‌ఆర్‌ఎస్ అవుతుంది. హెచ్‌ఆర్‌ఎస్ అంటే హరీశ్‌రావు రాష్ట్ర సమితి. కేసీఆర్ పదేళ్లపాటు నల్గొండ జిల్లాను మోసం చేశారు. కుర్చీ వేసుకుని ప్రాజెక్టులు కట్టిస్తానన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదు. కేసీఆర్ పదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తోంది. రేషన్‌కార్డుపై సన్నబియ్యం ఇచ్చే ప్రభుత్వం మరొకటి లేదు. ప్రతి గ్రామంలో 30-40 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం. ఆయా ఇళ్లకు రూ.5లక్షల చొప్పున అందిస్తున్నాం. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 సీట్లనూ గెలుస్తాం" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ అప్పులపై స్పీకర్‌వి పచ్చి అబద్ధాలు

దయచేసి నేను వికారాబాద్ వేదికగా అడుగుతున్నా. స్పీకర్ మీరు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో మీ నోటి నుంచి ఇలాంటి సత్యదూరమైన మాటలు, అబద్ధాలు, అసత్యాలు, అర్ధసత్యాలు మీ గౌరవాన్ని తగ్గిస్తయి తప్ప పెంచయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇలాంటి అబద్ధాలు ఆడితే మీ గౌరవం తగ్గుతుంది తప్ప పెరగదని కేటీఆర్ హితవు పలికారు. మీరేమో శాసనసభలో స్పీకర్‌గా ఉన్నరు.. ఆర్‌బీఐ, కాగ్ వద్ద నుండి లెక్కలు తీసుకొని మీలాగే అనుమానమొచ్చి తెలంగాణలో కేసీఆర్ చేసిన అప్పు ఎంత..? అని నిండు పార్లమెంట్‌లో ఒక బీజేపీ ఎంపీ అడిగిండు. 2014 జూన్ 2 నాడు తెలంగాణ రాష్ట్రం నెత్తిమీదున్న అప్పు 72 వేల కోట్లు.. కేసీఆర్ దిగిపోయిన్నాడు డిసెంబర్ 03, 2023 నాడు తెలంగాణపై ఉన్న అప్పుడు 3 లక్షల 52 వేల కోట్లు.. అంటే కేసీఆర్ 10 ఏండ్లలో చేసిన అప్పు రూ.2.80 వేల కోట్లని కేంద్ర ప్రభుత్వమే చెప్పింది.. అంటే సంవత్సరానికి సగటున 28 వేల కోట్లు కానీ స్పీకర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని చెబుతున్నాడు, డిప్యూటీ సీఎం రూ. 9 లక్షల కోట్లు అంటాడు.. ఇంకొకైన 10 లక్షలు అంటడు.. నోటికి ఎంత వస్తే అంత చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

**అమరవీరుల త్యాగాలను బీఆర్‌ఎస్ పార్టీ ఎప్పటికీ మరువదు : కేటీఆర్**

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఢిల్లీ వేదికగా పార్లమెంట్ సాక్షిగా ఆత్మబలిదానం చేసుకున్న పెద్ద మంగళారం గ్రామానికి చెందిన సోదరుడు యాదిరెడ్డి త్యాగం వెలకట్టలేనిదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నేడు కేటీఆర్ వికారాబాద్ నుండి తిరిగి వచ్చే క్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నేతలతో కలిసి యాదిరెడ్డి ఇంటికి వెళ్లారు. యాదిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.యాదిరెడ్డి కూతురుకు మైనర్ ఆపరేషన్ ఉందని తెలుసుకున్న కేటీఆర్ చిన్న ఆపరేషన్ అని భయపడేది ఏం లేదని ధైర్యం చెప్పారు. దగ్గరుండి అమ్మాయికి ఆపరేషన్ చేయించాలని పార్టీ నేతలను కేటీఆర్ ఆదేశించారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. నాడు కేసీఆర్ ప్రభుత్వంలో యాదిరెడ్డి సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం, 500 గజాల స్థలం, రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించి ఆదుకున్నాం. నేడు వారి కుటుంబంలో ఉన్న ఆరోగ్య సమస్యల గురించి ఆ తల్లి ఆవేదన వ్యక్తం చేయగా.. పార్టీ పరంగా పూర్తి వైద్య ఖర్చులు, బాధ్యతలను మేమే తీసుకుంటామని భరోసా ఇచ్చామన్నారు. సబితమ్మ కూడా తన వ్యక్తిగత నెంబర్ ఇచ్చి ఏ అవసరమున్నా అండగా ఉంటానని ధైర్యం చెప్పారన్నారు.చరిత్ర ఉన్నంత కాలం, తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం యాదిరెడ్డి లాంటి అమరవీరుల త్యాగాలను ఈ సమాజం, మన పార్టీ ఎప్పటికీ మరువదు. ఆ కుటుంబానికి మేము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

## తెలంగాణకు భారీ వర్ష సూచన

కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది.

## హే రామ్..

సభ్యుడిగా చేసుకున్నాడు. ఈ చోరీల ప్రధానసూత్రధారి అనుకల్ప్ మిశ్రాగానే సిట్ అధికారులు చెబుతున్నారు. విచారణలో భాగంగా సిట్ అధికారులు అయోధ్యలోని అనుకల్ప్ సొంతూరికి వెళ్లి గ్రామస్థులను ప్రశ్నించగా.. మొన్నమొన్నటి వరకు సాదాసీదాగా ఉన్న మిశ్రా కుటుంబ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందని చెప్పారు. ఇల్లు, స్కార్పియో వాహనం కొనుగోలు చేసినట్లు తెలిసింది. అతడి జీవన విధానం కూడా మారిపోయిందని అక్కడున్నవారు తెలిపారు. సొంతూరికి దగ్గర్లో విలాసవంతమైన ఓ ప్రాపర్టీని కూడా కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఊరి చివరన ఓ ఫాంహౌస్ కూడా నిర్మించినట్లు పేర్కొన్నారు.ఇటీవల గ్రామంలో ఏడు రోజుల పాటు పండగ నిర్వహించినట్టు అనుకల్ప్ మిశ్రా తాత రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. మతగురువులను రప్పించి ఉపన్యాసాలు కూడా ఇప్పించినట్లు చెప్పారు. అయితే, ఈ కేసు గురించి తనకు తెలియదన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు కూడా హాజరైనట్లు చెప్పారు.. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా వచ్చారన్నారు. ఇంత భారీ స్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు డబ్బు ఎలా వచ్చిందన్న దానిపై సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు.బ్యాంక్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేసిన అనుకల్ప్ మిశ్రా.. మూడేళ్ల క్రితం విరాళాలను లెక్కించే బృందంలో ఉద్యోగిగా చేరాడు. ఆ తర్వాత తన బావ లవ్‌కుశ్ మిశ్రాను అక్కడికి తెచ్చుకున్నాడు. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి.. నిధులను చోరీ చేసినట్లు అనుమానాలున్నాయి. లవ్‌కుశ్ మిశ్రా సొంత గ్రామానికి కూడా అధికారులు వెళ్లగా.. ఇటీవలే రూ.లక్షతో కొత్త బైక్ కొనుగోలు చేసినట్లు తెలిసింది.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ భయాలు

ప్రతిస్పందనగానే ఇరాన్ స్థావరాలు, నిల్వ కేంద్రాలపై దాడులు చేశామని చెప్తోంది. అయితే కార్గో షిప్‌పై దాడిని అమెరికా ఒక సాకుగా చూపి, పశ్చిమాసియాలో పరిస్థితులను దిగజార్చుతోందని ఐఆర్‌జీసీ నిందిస్తోంది. కాల్పుల విరమణను అమెరికానే ఉల్లంఘిస్తోందని ఆరోపించింది. ఇదే కొనసాగితే.. పూర్తిస్థాయి ఒప్పందం కోసం జరుగుతోన్న దౌత్య ప్రయత్నాలు అన్నీ నిలిచిపోతాయని హెచ్చరించింది. ఎలాంటి దురాక్రమణకైనా తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని తన ప్రకటనలో పేర్కొంది.

ఇరాన్‌పై మళ్లీ దాడులు చేసిన అమెరికా

పశ్చిమాసియాలో ఇటీవల చల్లారినట్లే కనిపించిన ఉద్రిక్తతలు మళ్లీ మొదటికి వచ్చేలా కనిపిస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా వరుసగా రెండో రోజు దాడులకు దిగింది. ఇరాన్ దాడులు ఆపకపోవడంతో బదులుగా హర్మూజ్ జలసంధి సమీపంలోని టెహ్రాన్ లక్ష్యాలపై యూఎస్ బలగాలు దాడులకు దిగాయి. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' ద్వారా తెలిపింది. అధ్యక్షుడు ట్రంప్ డైరెక్షన్‌లో దాడులు దిగినట్లు పేర్కొంది. ఇరాన్ నిఘా సదుపాయాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్ల నిల్వల కేంద్రాలపై తమ యుద్ధ విమానాలు బాంబులు కురిపించినట్లు వెల్లడించింది. తొలుత ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కార్గో షిప్ ఎవర్ లవ్లీపై ఇరాన్ డ్రోన్ దాడి చేసిందని, దీంతో తాము నిన్న బదులు తీర్చుకున్నట్లు సెంట్‌కామ్ తెలిపింది.అయితే కాల్పుల విరమణ ఉల్లంఘించకుండా ఉండేందుకు ఇరాన్‌కు అవకాశం ఇచ్చినా మళ్లీ ఆ దేశం దాడులు చేస్తోందని పేర్కొంది. రెండు మిలియన్ల బ్యారెళ్ల చమురుతో పనామా జెండాతో వెళుతున్న కికు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్ దాడి చేసినట్లు అమెరికా బలగాలు వెల్లడించాయి. దీంతో తాము తాజాగా దాడులు చేసినట్లు పేర్కొంది. దీనికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇరాన్ దాడులు ఇలాగే కొనసాగితే తీవ్రంగా విరుచుకుపడుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని అన్నారు. మరోవైపు దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ డ్రోన్లను ప్రయోగించింది.

అప్పుడు సైన్యమే పనిపూర్తి చేస్తుంది: ట్రంప్ పోస్ట్

ఇరాన్ క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన విషయాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ వేదికగా వెల్లడించారు. "వారు మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో అమెరికా వైమానిక దళం దాడులు చేసింది. వారు ఎప్పటికీ నేర్చుకోకపోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో విజయవంతంగా ప్రారంభించిన పనిని సైనిక పద్ధతిలో పూర్తి చేయాల్సి రావొచ్చు. అదే జరిగితే.. ఇరాన్ ఉనికే ప్రమాదంలో పడిపోతుంది" అని తీవ్ర హెచ్చరికలు చేశారు.

ఎవరిని రక్షించగలిగినా అద్భుతమే!

అరవై రోజుల్లో శాశ్వత శాంతి ఒప్పందాన్ని ఖరారు చేసుకునేలా అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల సురక్షిత ప్రయాణ హామీ, ఇరాన్ వద్ద ఉన్న శుద్ధిచేసిన యురేనియం నిల్వలు, ఆ దేశ అణుకార్యక్రమం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు అమెరికా మధ్యవర్తిత్వంతో లెబనాన్-ఇజ్రాయెల్ మధ్య డీల్ కుదిరింది. ఇది ఇరాన్, హెజ్‌బొల్లా గ్రూప్‌నకు గట్టి ఎదురుదెబ్బ అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అభివర్ణించారు. అలాగే ఇప్పటికిప్పుడే తమ దళాలు దక్షిణ లెబనాన్‌ను వీడవని స్పష్టం చేశారు. లెబనాన్ విషయంలో ఇజ్రాయెల్ ఏమేరకు మాట మీద నిల్చుంటుందనేది అనుమానమే. ఏదో ఒకసాకు చూపి హెజ్‌బొల్లాపై దాడులు చేస్తుందనే భయాలు ఉన్నాయి. అవగాహన ఒప్పందం కుదిరినా.. ఈ కారణాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న నమ్మకం లేని పరిస్థితి నెలకొంది.

## మళ్లీ రంగంలోకి పాకిస్థాన్

ప్రతిదాడికి దిగడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఇరాన్ కూడా దాడులు ఆపకపోవడంతో.. బదులుగా హర్మూజ్ జలసంధి సమీపంలోని టెహ్రాన్ లక్ష్యాలపై యూఎస్ బలగాలు బాంబులు పేల్చాయి. ఈ తరుణంలో ఇరాన్- అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదర్చడంలో కీలకంగా వ్యవహరించిన పాకిస్థాన్ మళ్లీ రంగంలోకి దిగింది.పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులపై పాకిస్థాన్ డిప్యూటీ ప్రధాని ఇషాక్ దార్, బహ్రెయిన్ విదేశాంగశాఖ మంత్రి రషీద్ అల్ జయాని ఫోన్‌లో మాట్లాడుకున్నారు. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించినట్లు పాకిస్థాన్ విదేశాంగశాఖ కార్యాలయం

## పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వాడండి

ఉన్న చిన్నారుల్లో స్ఫూర్తి నింపి.. వారు క్రీడలవైపు మొగ్గుచూపేలా చేస్తోన్న అసాధారణ లీగ్ అది. అదే రాష్ట్రంలో నాగాలాండ్ విమెన్ ఫుట్‌సల్ లీగ్‌ను నిర్వహిస్తున్నారు. ఫుట్‌సల్ పదం చాలామందికి కొత్తగా ఉంటుంది. ఇండోర్ ఫుట్‌బాల్‌ను అలా పిలుస్తారు. ప్రతి జట్టులో కేవలం ఐదుగురు ఆటగాళ్లు మాత్రమే ఉంటారు. సాధారణ ఫుట్‌బాల్ మైదానంతో పోలిస్తే.. వారు ఆడే స్థలం చాలా చిన్నగా ఉంటుంది. దీంతో ఆటగాళ్లు చాలావేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆడబిడ్డల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఇది అద్భుతమైన వేదికగా నిలుస్తోంది" అని మోదీ కొనియాడారు.

హర్గిలా ఆర్మీని కొనియాడిన ప్రధాని..

అంతరించిపోతున్న హర్గిలా పక్షిని రక్షించడంలో అస్సాం 'హర్గిలా ఆర్మీ' చేస్తోన్న కృషిని ప్రధాని మోదీ కొనియాడారు. ఒకప్పుడు ఈ పక్షిని అశుభంగా భావించేవారు. కానీ, ఇప్పుడు అది ఆ రాష్ట్రంలోని గ్రామాలకు ఒక గుర్తింపుగా మారిపోయింది. " ప్రకృతిని శుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించిన ఈ పక్షిని ఒకప్పుడు చూడటానికి కూడా ఇష్టపడలేదు. దాని గూడులున్న చెట్లను కూడా కొట్టివేసేవారు" అని ప్రధాని వెల్లడించారు. ఆ మూఢనమ్మకాన్ని జీవశాస్త్రవేత్త పూర్ణిమా దేవి బర్మన్ మార్చివేశారన్నారు. దాంతో ఇప్పుడు ఆ పక్షిని కాపాడేందుకు హర్గిలా ఆర్మీనే సిద్ధమైందని చెప్పారు.

దేశ భద్రత, స్వయం సమృద్ధిపై ప్రధాని మోదీ ప్రశంసలు

దేశ భద్రత స్వయం సమృద్ధి దిశగా భారత్? వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ తెలిపారు. 2026 తొలి ఆరు నెలలు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, ఈ కాలంలో భారత్ అనేక రంగాల్లో గొప్ప విజయాలు సాధించిందని గుర్తు చేశారు. ముఖ్యంగా రక్షణ రంగంలో వచ్చిన పురోగతి దేశ ప్రజలందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. స్వదేశీ ఉత్పత్తులు, ఆధునిక సాంకేతికత, బలమైన రక్షణ వ్యవస్థలతో భారత్ త్వరితగతిన ఆత్మనిర్భరత వైపు దూసుకుపోతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. దేశంలో తయారైన సైనిక సాంకేతికత, స్వదేశీ ఉత్పత్తుల పెరుగుదలతో భారత్ మరింత శక్తివంతంగా మారుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. విమానయాన రంగంలోనూ భారత్ కీలక విజయాన్ని సాధించిందని తెలిపారు. స్వదేశీ సి-295 సైనిక రవాణా విమానం తొలి విజయవంతమైన ప్రయాణం పూర్తి చేసిందని ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశంలోనే 40 విమానాలు తయారవుతున్నాయని, ఇది ఎంఎస్‌ఎంఈలు, ఏరోస్పేస్ రంగాలకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోందని ఆయన వివరించారు. అలాగే ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యం మరింత బలపడుతోందని చెప్పారు.ఇక ఇటీవల జరిగి అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా 2,500కు పైగా ప్రదేశాల్లో వివిధ యోగా కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. వీటిలో కోట్లాది మంది ప్రజలు పాల్గొన్నారని చెప్పారు.

నలంద విశ్వవిద్యాలయంపై ప్రశంసలు

నలంద విశ్వవిద్యాలయం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ప్రధాని మోదీ ప్రశంసించారు. భారతదేశ ప్రాచీన జ్ఞాన సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన నలంద విశ్వవిద్యాలయం, ఆధునిక విద్యా వ్యవస్థతో పాటు పురాతన భారతీయ విలువలను సమన్వయం చేస్తూ కొత్త తరానికి మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. రెండేళ్ల క్రితం నలంద విశ్వవిద్యాలయం నూతన ప్రాంగణాన్ని ప్రారంభించే అవకాశం తనకు లభించిందని గుర్తుచేసుకున్న ప్రధాని, ఈ సంస్థ భారతీయ ప్రాచీన 'శాస్త్రార్థ' సంప్రదాయాన్ని తిరిగి తీసుకొచ్చిందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం సాంకేతిక విప్లవం దిశగా వేగంగా పయనిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. రోజూ కొత్త పరిశోధనలు, ఏఐ ఆవిష్కరణలు వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. అయితే కొత్త సాంకేతికతను స్వీకరిస్తూనే మానవ సృజనాత్మకతను ఎలా కాపాడుకోవాలి? ఆధునికతతో ముందుకు సాగుతూనే మన మూలాలతో ఎలా అనుసంధానమై ఉండాలి? అనే ప్రశ్నలు ఈ కాలంలో అత్యంత ముఖ్యమైనవని ఆయన అన్నారు. దేశంలోని ఇతర ఉన్నత విద్యా సంస్థలు కూడా నాలందా విశ్వవిద్యాలయం తరహాలో ఇలాంటి కార్యక్రమాలను అమలు చేయాలని ప్రధాని సూచించారు.

## ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

**'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' ప్రదానం చేసిన ఆ దేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ**

విక్టోరియా(జనంసాక్షి):ప్రధాని మోదీకి మరో అరుదైన గౌరవ పురస్కారం లభించింది. సీషెల్స్ దేశ అత్యున్నత 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ ఆయనకు అవార్డు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, సుస్థిర అభివృద్ధి సాధించడంలో ప్రపంచ దేశాలకు నాయకత్వం వహిస్తున్నందుకుగానూ సీషెల్స్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది.దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ సీషెల్స్ దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న భారత ప్రజలందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఈ అవార్డును అత్యంత గౌరవంగా స్వీకరిస్తున్నా. వాతావరణ మార్పులతో సతమతమవుతూ, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న అన్ని దేశాల ప్రజలకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నా. అందరూ ఏకమై పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. మన గ్రహాన్ని మరింత పచ్చగా, సుస్థిరంగా మార్చేందుకు భారత్ సిద్ధంగా ఉంది. కానీ, అందుకు అన్ని దేశాలూ ముందుకు రావాలి. అప్పుడే అది సాధ్యపడుతుంది" అని మోదీ పేర్కొన్నారు.వాతావరణ పరిరక్షణ అంశంలో ప్రధాని మోదీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఇదే తొలిసారి కాదు. ఆహార భద్రత, వ్యవసాయంలో తీసుకొస్తున్న మార్పులు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాల్లో ఆయన చేసిన కృషికి గానూ మే 2026లో ప్రపంచ వ్యవసాయ, ఆహార సంస్థ (ఎఫ్‌ఏఓ) ఆయనకు 'అగ్రికోలా మెడల్'ను బహూకరించింది. 2018లో సుస్థిర ఆర్థికాభివృద్ధి, ప్రపంచ సహకారం, సమ్మిళిత అభివృద్ధి రంగాల్లో ఆయన సేవలకుగానూ సియోల్ శాంతి బహుమతి వరించింది. అదే ఏడాది ఐక్యరాజ్యసమితి.. 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' అవార్డుతో సత్కరించింది.

## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి

- అర్హుల ఓట్లు తొలగించొద్దు
- పార్టీ శ్రేణుల సమస్యలను సీఎం, ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్తా
- మంత్రి జూపల్లి కృష్ణారావు




**నిర్మల్ బ్యూరో, జూన్ 28 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యా గార్డెన్స్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వాటిని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కార్యకర్తల కోసం అవసరమైతే తన గళం కూడా వినిపిస్తానని చెప్పారు. కొంతమంది అధికారుల వ్యవహారశైలిపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి ఉందని, ఆ అంశాలను క్యాబినెట్ సమావేశంలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఎవరూ నిరాశ చెందవద్దని, సమిష్టిగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పేరుతో చోటుచేసుకున్న పరిణామాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని పేర్కొన్న మంత్రి, ఓట్ల ప్రక్షాళన పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు చేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని అన్నారు. ఈ నెల రోజుల పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా తొలగించకుండా చూడాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థ ఉనికికే ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలపై క్షేత్రస్థాయిలో సమీక్షలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

## భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలు



**హనుమకొండ ప్రతినిధి జూన్ 28 (జనంసాక్షి) :** భారత మాజీ ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు, సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ముద్దుబిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావు 105వ జయంతి సందర్భంగా హనుమకొండలోని కొత్త బస్టాండ్ కూడలి వద్ద ఆ మహానియుని విగ్రహానికి వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామి రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ శాసనసభ్యులు సతీష్, రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈ. వి శ్రీనివాస్, పివి మదన్ మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అభిమానులు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఆరు గ్రామాల రైతుల కన్నీటిగాథ

- వడ్లు మొక్కజొన్నలు కొట్టేసి ఉడాయించిన దళారీ వ్యాపారులు
- అయోమయంలో రైతన్నలు, పరారీలో దళారీలు



**నాగర్ కర్నూల్, జూన్ 27 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పరిధిలోని ఆరు గ్రామాల నంది వడ్డేమాన్, అల్లిపురం, మమ్మాయపల్లి, వెలుగొండ, గుడ్లనర్వ, మంగనూరు ప్రజలను మభ్యపెట్టి వడ్ల ధాన్యాన్ని మరియు మొక్కజొన్నలను ఖరీదు చేసి రైతులను నిండా ముంచిన వైనం, 200 మంది రైతుల నుండి దళారీ వ్యాపారులు సుమారుగా ఐదు కోట్ల వరకు పుచ్చుటోపి పెట్టారు. మండల కేంద్రానికి చెందిన దళారి వ్యాపారులు శివాజీ, అరవింద్ రైతుల దగ్గర నుండి వందల కొద్ది క్వింటాలను కొనుగోలు చేసి సుమారు వీటి విలువ రెండున్నర కోట్ల పైనేనని రైతులు వివరించారు. రైతులకు 15 రోజులలో డబ్బులు ఇస్తామని నమ్మబలికి బురిడీ కొట్టించి రైతులు ఫోన్లు చేసి డబ్బులు అడగగా ఫోన్ ఎత్తకపోవడం మరియు మొఖం చాటేయడం జరిగింది. అధికార యంత్రాంగం సరిగ్గా లేకపోవడం వలన కొనుగోలు కేంద్రాలు ఆలస్యం కావడమే గాక తాలు, తేమా పేరుతో వారాల తరబడి కల్లాలలో రైతులు నిరీక్షించలేకనే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో రైతుల దగ్గర నుండి కొనుగోలు చేసి ఉంటే రైతులకు ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదని రైతులు అన్నారు. రైతన్నలుబి ఆరుగాలం రోజూ కష్టపడి పండించిన పంటను ఇలాంటి దళారి దారులకు ప్రోత్సహించడం సరికాదని అన్నారు. రైతుల దగ్గర నుండి సకాలంలో వ్యవసాయ శాఖ వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి ఉంటే ఇటువంటి పరిస్థితులు రాకుండా ఉండేదని రైతులు లబోదిబో అంటున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జయరాములు, సురేందర్, రాములు, మధు, శేఖర్, గుంటి రాములు, కొండయ్య, ఆంజనేయులు, రామచంద్రయ్య, శ్రీశైలం, వెంకటస్వామి, లక్ష్మి, మైబూస్, వెంకటయ్య, శ్రీను, తిరుపతయ్య, రాజు, శాంతయ్య మరియు రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేట్ వీడియోలతో యువతికి బ్లాక్‌మెయిల్

### గచ్చిబౌలిలో యువకుడు అరెస్ట్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఓ యువతిని వ్యక్తిగత వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ నగదు వసూలు చేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలి నుంచి సుమారు రూ.1.10 లక్షలు వసూలు చేసిన నిందితుడిని కె. నాగతేజ అలియాస్ నాని (24)గా గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు శనివారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగతేజ స్నాప్‌చాట్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా యువతులతో పరిచయం పెంచుకునేవాడు. వారి నమ్మకాన్ని చూరగొని వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించేవాడు. ఈ క్రమంలో ఈ నెలలో ఓ యువతిని గచ్చిబౌలి డీఎల్ఎఫ్ సమీపంలోని ఒక హోటల్ గదికి పిలిచి, కత్తితో బెదిరించి అభ్యంతరకర వీడియోలు చిత్రీకరించాడు. అనంతరం ఆ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించి, బాధితురాలి నుంచి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. బాధితు రాలు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి నిందితుడిని అరెస్ట్ చేశారు.

## తాండూరు యువకుడికి అంతర్జాతీయ సెయిలింగ్‌లో కాంస్యం



**తాండూరు జూన్ 28(జనంసాక్షి) :** మలేషియాలో జరిగిన అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లో భారతదేశానికి కాంస్య పతకం అందించి తాండూరు ఖ్యాతిని విశ్వవేదికపై నిలిపాడు గాజీపూర్ గ్రామానికి చెందిన ఎర్రా హర్షవర్ధన్. ఈ సందర్భంగా ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి హర్షవర్ధన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన రూ.1,50,000 ఆర్థిక సహాయాన్ని బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అందించి ప్రోత్సహించారు. కాంస్య పతక విజేత హర్షవర్ధన్ మాట్లాడుతూ థ్యాంకు బుయ్యని శ్రీనన్న. మీ ప్రోత్సాహం మరువలేనిది" అంటూ శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. తాండూరు ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయి సెయిలింగ్‌లో పతకం సాధించడం ఇదే తొలిసారి కావడంతో స్థానికంగా హర్షం వ్యక్తంచేశారు.

## రాష్ట్రంలో విజయవంతంగా తొలి రోజు పల్స్ పోలియో

- 38.95 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ
- 95.1 శాతం లక్ష్య సాధన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. రాష్ట్రంలో 0-5 సంవత్సరాల లోపు పిల్లలు 40,97,749 మంది ఉంటారని అంచనా వేయగా, ఇందులో 38,95,550 మంది (95.1 శాతం) చిన్నారులకు తొలి రోజే పోలియో చుక్కల పంపిణీ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పల్స్ పోలియో బూత్‌లకు పెద్ద ఎత్తున తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించడం పట్ల హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సహకారం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా సాగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించామని కమిషనర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా 99 శాతం కవరేజ్‌తో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవగా, భద్రాద్రి కొత్తగూడెం 98.9 శాతం, మెదక్ 98.6 శాతం, ములుగు, వనపర్తి జిల్లాలు 98.2 శాతం, జయశంకర్ భూపాలపల్లి 98.1 శాతం కవరేజ్ సాధించాయి. హైదరాబాద్ జిల్లాలో 93.1 శాతం కవరేజ్ నమోదైంది. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశాఖ బృందాలు పోలియో చుక్కలు వేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆరోగ్యశాఖ మిత్ర దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించుకుందాం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మత్తు పదార్థాల వినియోగం పై యువతలో అవగాహన పెంచేందుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) బాచుపల్లి డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారం బాచుపల్లి ఎక్స్‌రోడ్స్‌లో నిర్వహించిన 'సే నో టు డ్రగ్స్--5కే రన్' కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, అలాంటి యువత డ్రగ్స్ బారిన పడితే కుటుంబంతో పాటు సమాజం కూడా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. మత్తు పదార్థాలు ఆరోగ్యంతో పాటు విద్య, ఉపాధి, కుటుంబ బంధాలు, భవిష్యత్తును దెబ్బతీస్తాయని పేర్కొంటూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో జీవించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ లక్ష్యానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. యువతలో చైతన్యం కల్పించే ఇటువంటి కార్యక్రమాలు గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ 5కే రన్‌లో సుమారు 2,000 మంది యువత, మహిళలు, విద్యార్థులు, వైశ్య సంఘ సభ్యులు, క్రీడాకారులు, స్థానికులు పాల్గొని సే నో టు డ్రగ్స్, హెల్తీ యూత్ – హెల్తీ నేషన్, డ్రగ్ ఫ్రీ సొసైటీ నినాదాలతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వంగపల్లి నవీన్ కుమార్, కట్టా రవి కుమార్, కాలువ సుజాత, నరేష్ గుప్తా, సూర్యప్రకాశ్, సురేష్, వినయ్, నాగరాజు, రఘువంశీ తదితరులు పాల్గొన్నారు.



## పిడుగు పడి 15 మేకలు మృతి

- రైతుకు రూ.1.70 లక్షల నష్టం

**ధారూర్ జూన్ 28(జనంసాక్షి):** మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పిడుగు పడటంతో రైతు కంది ఆశయ్యకు చెందిన 15 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనలో రైతుకు సుమారు రూ.1.70 లక్షల మేర ఆర్థిక నష్టం జరిగింది. సంఘటన విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఉలేందర్. గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యుడు వెంకటయ్య ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బాధిత రైతుకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు. మేకల పెంపకమే జీవనాధారంగా ఉన్న కంది ఆశయ్య ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ప్రభుత్వం స్పందించి తగిన నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### సంఘటన స్థలాన్ని సందర్శించిన డాక్టర్ భాబ్జి రామ్

మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడటంతో 15 మేకలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న నగాసముందర్ మెటర్నిటీ వైద్యుడు డాక్టర్ భాబ్జి రామ్ సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఈ ఘటనతో మేకల యజమానికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 28(జనంసాక్షి):** పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజంపేట, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు కాపువాడలో గల అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొమరం భీమ్ ఆసిఫాబాద్ ను పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని తెలిపారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు వేయాలన్నారు. 0-5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లాలో ఉన్న చిన్నారులు, పోలియో కేంద్రాల ఏర్పాటు, అందుబాటులో ఉన్న వాక్సిన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సర్పంచ్ బుర్సా పోచయ్య అసిఫాబాద్ చైర్మన్ ఆకాష్ కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి-65పై ఘోర రోడ్డు ప్రమాదం



**చిట్యాల (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారి-65పై ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తెలిసిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నార్కట్‌పల్లి వైపు వెళ్తున్న డి-మ్యాక్స్ వి-క్రాస్ వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న ఇన్నోవా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో డి-మ్యాక్స్ వాహనం టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి డివైడర్ దాటి హైదరాబాద్ వైపు వెళ్తున్న రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో చిట్యాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కియా కారు, షిఫ్ట్ డిజైర్ కార్లను ఢీకొట్టింది. ప్రమాదంలో డిజైర్ కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అలాగే కియా కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంతో హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న చిట్యాల పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది, నేషనల్ హైవే ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

## తెలంగాణలో కమలం వికసింపజేయాలి

- అధికారమే లక్ష్యంగా పనిచేయాలి
- భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్
- పశ్చిమ బెంగాల్ తరహాలోనే తెలంగాణాలో తమిళం వికసింపజేసే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలి
- ఇంకా తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు అది భాజపాతోని సాధ్యం



**శంషాబాద్, జూన్ 28 (జనంసాక్షి) :** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ కార్యకర్తల కృషితో పార్టీ విజయాలు సాధించినట్లే, అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ ప్రతి కార్యకర్త పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే సంకల్పంతో పనిచేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. ఆదివారం శంషాబాద్‌లో రాష్ట్ర భాజపా అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు, ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా భాజపా అధ్యక్షుడు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ భాజపా శ్రేణులతో కలిసి నూతన బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన ఆసిఫాబాద్, నిర్మల్, సిద్దిపేట, కామారెడ్డి, మెదక్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పార్టీ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1980 నుంచి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని చూడాలనే ఆకాంక్షతో పార్టీ కార్యకర్తలు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని అన్నారు. దేశంలో బీజేపీ బలోపేతానికి తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రజలు నిజాయితీ, అవినీతి రహిత పాలనకు మద్దతుగా బీజేపీ వైపు దృఢంగా నిలుస్తున్నారని అన్నారు. తెలంగాణలో భాజపా ప్రతిపక్షంలో ఉండి ప్రముఖ పాత్ర పోషించడంతోనే గత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించడంతో కాంగ్రెస్ లాభపడి అధికారంలోకి వచ్చిందని, అయితే కాంగ్రెస్ దేశ ప్రజల ప్రయోజనాలతో సౌదా (వ్యాపారం) చేసిందని ఆరోపించారు. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్ నాయకత్వంలో పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసించినట్లే, తెలంగాణలో కూడా కమలం వికసించే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లుల ఆశీర్వాదంతో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలలుగన్న "ఏక్ భారత్--శ్రేష్ఠ భారత్", దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆకాంక్షించిన అంత్యోదయ స్ఫూర్తిని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆచరణలో చూపిస్తోందన్నారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధన కోసం 140 కోట్ల మంది భారతీయులను అభివృద్ధి పథంలో నడిపించడమే బీజేపీ సంకల్పమని చెప్పారు. దేశంలో కేవలం రెండు లోక్‌సభ స్థానాలతో ప్రారంభమైన బీజేపీ, నేడు దేశ నిర్మాణంలో కీలక శక్తిగా ఎదిగిందని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో నూతన పార్టీ కార్యాలయ నిర్మాణానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, వారికి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సుష్మా స్వరాజ్‌తో పాటు బీజేపీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ప్రజల ఆకాంక్షలు ఇంకా పూర్తిగా నెరవేరలేదని, వాటిని నెరవేర్చగలిగేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. రానున్న అసెంబ్లీ, జీహెచ్ఎంసీ, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడాలని, తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్. కృష్ణయ్య , అంజన్ కుమార్ గౌడ్, పొన్నమోని మల్లేష్ యాదవ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, నందకిషోర్, బుక్క వేణుగోపాల్, నారగూడెం మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, సదా మల్లారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హే రామ్.. నీ సొమ్ము
# నిలువు దోపిడీ

సంపాదకీయం

అయోధ్య రామజన్మభూమి దేవాలయం కోటానుకోట్ల మంది హిందువుల ఆరాధనా స్థలం. దశాబ్దాల పోరాటం తరువాత నిర్మించిన ఆ పవిత్రమైన మందిరానికి భక్తులు కానుకలుగా సమర్పించిన విరాళాలు, విలువైన వస్తువులు దేవుని సొత్తు. కానీ ఆ సొత్తునే కొందరు నీచులు కొల్లగొట్టారని తేలడం మతపరమైన నేరం మాత్రమే కాదు, నైతికంగా క్షమించలేని పాపం కూడా.

అయోధ్య విరాళాల చోరీ కేసులో ఇప్పటివరకు 8 మంది అరెస్టయ్యారు. వారిలో ఇద్దరు ఒకే కుటుంబానికి చెందినవారు కావడం విశేషం. ముద్దాయి అనుకల్ప్ మిశ్రా ఈ దొంగతనానికి ప్రధాన సూత్రధారిగా సిట్ అధికారులు చెబుతున్నారు. అతను బ్యాంక్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తూ విరాళాలు లెక్కించే బృందంలో చేరాడు. అక్కడే అవకాశం చూసుకుని అధికారులను బతిమాలి తన బావ లవ్‌కుశ్ మిశ్రాను కూడా ఆ బృందంలో సభ్యుడిగా చేర్పించాడు. ఇద్దరూ కలిసి దేవుని నిధులు కాజేశారు.

దొంగిలించిన సొమ్ముతో వీరు చేసిన పని మరింత దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. నిన్నమొన్నటి వరకు సాదాసీదాగా జీవించిన మిశ్రా కుటుంబం ఒక్కసారిగా జీవన విధానం మార్చుకుంది. ఇల్లు కొన్నారు, స్కార్పియో వాహనం కొన్నారు, జీవన శైలి విలాసవంతంగా మారింది. సొంతూరికి సమీపంలో విలాసవంతమైన ఒక ప్రాపర్టీ కూడా కొనుగోలు చేశారు. ఊరి చివర ఒక ఫామ్‌హౌస్ నిర్మించారు. గ్రామస్తులను సిట్ అధికారులు ప్రశ్నించగా, ఈ మార్పు ఎంత అకస్మాత్తుగా జరిగిందో వారే వివరించారు.

అంతటితో ఆగలేదు. ఇటీవల గ్రామంలో ఏడు రోజుల పాటు పండగ నిర్వహించారు. మతగురువులను రప్పించి ఉపన్యాసాలు కూడా ఇప్పించారు. ఈ మహా కార్యక్రమానికి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా హాజరయ్యారని తెలుస్తోంది. రాములోరి సొమ్ముతో రాముని పేరు మీద పండగ చేయడం విచిత్రమైన వ్యంగ్యం. ఈ ఖర్చులకు డబ్బు ఎక్కడ నుండి వచ్చిందని సిట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇది కేవలం ఒక వ్యక్తి చేసిన నేరం కాదు. ఇది వ్యవస్థలోని లోపాన్ని బహిర్గతం చేస్తుంది. కోట్ల మంది భక్తులు అర్పించిన విరాళాలను నిర్వహించే బాధ్యత ఎంత జాగ్రత్తగా ఉండాలో, పర్యవేక్షణ ఎంత పటిష్టంగా ఉండాలో ఈ కేసు కళ్ళకు కట్టినట్టు చూపిస్తోంది. ట్రస్ట్ నిర్వహణలో జవాబుదారీతనం లేకపోవడమే ఇలాంటి నేరాలకు అవకాశం ఇచ్చింది. న్యాయం జరగాలంటే కేవలం అరెస్టులు సరిపోవు. సిట్ దర్యాప్తు మూలాల వరకు వెళ్ళాలి. దొంగిలించిన సొత్తు ఎంత, అది ఎక్కడ మళ్ళించబడింది, ఇంకా ఎవరైనా ఈ కుట్రలో భాగస్వాములున్నారా అన్న విషయాలు స్పష్టమవ్వాలి. భక్తుల విశ్వాసాన్ని వమ్ము చేసిన వారికి కఠినమైన శిక్ష పడాలి. రాముని పేరు మీద దోపిడీ చేసిన వారిని చట్టం వదిలిపెట్టకూడదు.




# మందు సీసాలో మరణ శాసనం?

## దగ్గు సిరప్‌ల వెనుక దాగున్న చేదు నిజాలు!

దేశవ్యాప్తంగా దగ్గు సిరప్‌ల వినియోగం విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో, వాటి నాణ్యత, నియంత్రణ మరియు దుర్వినియోగంపై సమాజంలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు, చలికాలంలోనో లేదా కాస్త గొంతు గరగరలాడితేనో దగ్గు సిరప్ వాడకం ఒక సర్వసాధారణ విషయంగా మారిపోయింది. కానీ, ఈ సాధారణ అలవాటు వెనక దాగి ఉన్న ప్రాణాంతక ప్రమాదాలు, నియంత్రణ లోపాలు, మరియు వ్యవస్థల బాధ్యతల గురించి మనం లోతుగా అర్థం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. చిన్న జలుబు, దగ్గు వస్తే చాలు డాక్టర్‌తో పనిలేకుండా నేరుగా మెడికల్ షాపునకు వెళ్లి సిరప్ బాటిల్ తెచ్చుకోవడం మన ఇళ్లలో ఒక సంప్రదాయంగా మారిపోయింది. అయితే, ఉపశమనం కలిగిస్తుందని మనం భావించే ఆ తీపి ద్రవం వెనుక ఎంతటి విషాదాలు దాగి ఉన్నాయో ఇటీవలి అంతర్జాతీయ సంఘటనలు నిరూపించాయి. భారతదేశంలో ఓవర్-ది-కౌంటర్ మందుల విక్రయాల్లో దగ్గు సిరప్‌లది అగ్రస్థానం. ఏటా వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్న ఈ రంగంలో, వందలాది బ్రాండ్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అయితే, ఈ బ్రాండ్లన్నీ సమాన నాణ్యత కలిగి ఉంటాయా? అన్నీ సురక్షితంగా ఉంటాయా? అన్న ప్రశ్నకు జవాబు కచ్చితంగా అవును అని చెప్పలేని భయాందోళనకర పరిస్థితి నేడు దేశంలో నెలకొని ఉంది. 2022--2023 సంవత్సరాల మధ్య గాంబియా, ఉజ్బెకిస్తాన్ మరియు ఇండోనేషియా దేశాలలో భారతీయ తయారీ దగ్గు సిరప్‌ల వల్ల పదుల సంఖ్యలో అమాయక పిల్లలు మరణించారని అంతర్జాతీయంగా నిరూపించబడింది. మందులలో వాడే 'డైఇథిలిన్ గ్లైకాల్', 'ఇథిలిన్ గ్లైకాల్' వంటి రసాయనాల మోతాదు పరిమితి దాటడం వల్లే ఈ మరణాలు సంభవించాయి. ఇది ప్రపంచ ఔషధ మార్కెట్‌లో ప్రపంచానికి ఫార్మసీగా పేరుగాంచిన మన దేశ ప్రతిష్టకు తీవ్రమైన మచ్చ వేసిన సంఘటన. కేవలం విదేశాల్లో మాత్రమే కాదు, మన దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కూడా నకిలీ మరియు నాసిరకమైన దగ్గు సిరప్‌ల వాడకం వల్ల అంతర్గతంగా ప్రజల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి.

భారతదేశంలో ఔషధాల నాణ్యతను పర్యవేక్షించడానికి కేంద్ర స్థాయిలో సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ అనే సంస్థ ఉంది. అలాగే ప్రతి రాష్ట్రంలోనూ ప్రత్యేకంగా డ్రగ్ కంట్రోల్ అధికారులు ఉంటారు. కానీ ఈ వ్యవస్థలు ఆశించిన స్థాయిలో సమర్థంగా పనిచేస్తున్నాయా అంటే, క్షేత్రస్థాయి వాస్తవాలు మరింత విచారకరంగా ఉన్నాయి. తనిఖీ అధికారులు తక్కువ ఉండటం వలన దేశంలో నమోదైన ఔషధ తయారీ కంపెనీలు, ల్యాబొరేటరీలు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ, వాటిని తనిఖీ చేసే అధికారుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఒక్కో అధికారి వందలాది కంపెనీలను పర్యవేక్షించాల్సి రావడం వల్ల నాణ్యత పరిశీలన గాలికి వదిలేసినట్లవుతోంది. లైసెన్సింగ్ అక్రమాలు కొన్ని చిన్న మరియు మధ్యతరహా తయారీ సంస్థలు కనీస ప్రమాణాలు పాటించకుండా, కొన్నిసార్లు నకిలీ లైసెన్సులతో దగ్గు సిరప్‌లు తయారు చేసి మార్కెట్‌లోకి వదులుతున్నాయి.

*నకిలీ సిరప్‌ల ముప్పు పేరున్న బ్రాండ్ల పేరు మీద నకిలీ ప్యాకేజింగ్ మరియు రంగులతో తక్కువ ధరకే లభించే సిరప్‌లు ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా అమ్ముడుపోతున్నాయి. దగ్గు సిరప్ నియంత్రణలో అత్యంత సంక్లిష్టమైన మరియు ప్రమాదకరమైన అంశం కోడీన్ (జశీవఱఅవ) ఆధారిత సిరప్‌ల దుర్వినియోగం. కోడీన్ అనేది ఒక ఓపియాయిడ్ (నల్లమందు) లాంటి పదార్థం. దీనికి కేంద్ర నరాల వ్యవస్థను నెమ్మదింపజేసే మరియు వ్యసనానికి గురిచేసే లక్షణాలు ఉన్నాయి. వైద్యుడి సూచన మేరకు నిర్దిష్ట పరిమితిలో వాడినప్పుడు ఇది పొడి దగ్గును సమర్థంగా నివారిస్తుంది. కానీ అదే దగ్గు సిరప్‌ను మత్తు కోసం బాటిళ్లకు బాటిళ్లు తాగినప్పుడు అది మానసిక స్థితిని దెబ్బతీసి, ప్రాణాంతకంగా మారుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో దగ్గు సిరప్ అడిక్షన్ (వ్యసనం) ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా పరిణమించింది.*

ముఖ్యంగా 15 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్న పాఠశాల, కళాశాల యువతలో ఈ మత్తు సిరప్ వాడకం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు కేవలం వైద్యుని ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఇచ్చే ఈ సిరప్‌లు, నేడు కొన్ని ప్రాంతాలలో మారుమూల మందుల షాపుల్లో ఎటువంటి నిబంధనలు లేకుండా అమ్ముడుపోతున్నాయి. ప్రభుత్వం రాఎ్ట్రవఒబ్రీవ ఎ1 కింద కోడీన్ కలిగిన సిరప్‌లకు నిర్బంధ ప్రిస్క్రిప్షన్ నిబంధన అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దీని అమలు చాలా చోట్ల పేలవంగా ఉంది. దగ్గు సిరప్ నియంత్రణలో మరియు నాణ్యతలో విప్లవాత్మక మార్పు తీసుకురావాలంటే బహుముఖ వ్యూహం అవసరం. +వీూ (+శీశీ మీఅబఱఖ్రీబతీఱఅస్త్ర ూతీaష్‌ఱషవం) నిబంధనలు కేవలం కాగితాలపై నివేదికలకే పరిమితం కాకుండా, ప్రతి ఫ్యాక్టరీలో ఆచరణలో అమలవ్వాలి. ఔషధ నియంత్రణ అధికారుల సంఖ్యను తక్షణమే పెంచి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. ప్రతి దగ్గు సిరప్ బాటిల్‌పై ఒక ప్రత్యేకమైన ూ= కోడ్ ముద్రించడం తప్పనిసరి చేయాలి. దీనివల్ల వినియోగదారులు ఆ మందు ఎక్కడ తయారైంది, అందులోని రసాయనాల నాణ్యత ఏమిటి అనే వివరాలను ఫోన్ ద్వారానే తెలుసుకోవచ్చు. కోడీన్ ఆధారిత సిరప్‌లను ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మే ఫార్మసీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఒకే తప్పు రెండోసారి జరిగితే లైసెన్సును శాశ్వతంగా రద్దు చేయాలి. రోగుల ప్రిస్క్రిప్షన్‌లను డిజిటైజ్ చేసి ఆన్‌లైన్ నెట్‌వర్క్‌కు అనుసంధానించాలి. దీనివల్ల ఒకే ప్రిస్క్రిప్షన్ చూపించి వివిధ షాపుల్లో బల్క్‌గా మందులు కొనడాన్ని నిరోధించవచ్చు. పాఠశాలలు, కళాశాలల స్థాయిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేస్తూ "డ్రగ్ అబ్యూస్" పై విస్తృత ప్రచారం నిర్వహించాలి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గత కొన్నేళ్లలో దగ్గు సిరప్ నియంత్రణపై కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 2023లో కేంద్రం నూతన ఔషధ నాణ్యత నిబంధనలను జారీ చేసింది. అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట దెబ్బతిన్న నేపథ్యంలో, ఎగుమతి చేసే ప్రతి సిరప్ బ్యాచ్‌ను ప్రభుత్వ ల్యాబ్‌లో పరీక్షించడం తప్పనిసరి చేశారు. అనేక నకిలీ కంపెనీల లైసెన్సులు రద్దు చేయబడ్డాయి. అయినప్పటికీ, నిపుణులు మరియు ఆరోగ్య కార్యకర్తలు చెప్తున్నదేమంటే ఈ చర్యలు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తాయే తప్ప, సమస్యను మూలం నుంచి పరిష్కరించలేవు. సిబ్బంది కొరతను తీర్చకుండా, అవినీతిని అరికట్టకుండా కేవలం కొత్త చట్టాలు తెస్తే ఫలితం శూన్యం. వ్యవస్థ మారే వరకు ప్రజలుగా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలి. దగ్గు సిరప్ కొనుగోలు చేసేటప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి. చిన్నపాటి దగ్గుకు సొంత వైద్యం వద్దు; ఎల్లప్పుడూ అర్హత కలిగిన వైద్యుని సలహా మాత్రమే తీసుకోండి. నమ్మకమైన, లైసెన్స్ కలిగిన ప్రసిద్ధ మందుల దుకాణాల నుంచే మందులు కొనండి మరియు తప్పకుండా బిల్లు అడగండి. బాటిల్ ప్యాకేజింగ్ సీల్ సరిగ్గా ఉందో లేదో, ఎక్స్‌పైరీ డేట్ (గడువు తేదీ) ఉందో లేదో గమనించండి. పిల్లలకు ఇచ్చేటప్పుడు పెద్దల మోతాదును అంచనాగా వేయకండి. దగ్గు సిరప్ నియంత్రణ అనేది కేవలం ప్రభుత్వానికో లేదా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకో సంబంధించిన విషయం కాదు. ఇది ప్రజలు, వైద్యులు, ఫార్మా రంగానికి చెందిన వ్యాపారులు అందరూ కలిసి పంచుకోవాల్సిన నైతిక బాధ్యత. మనం నిర్లక్ష్యంగా కొనే ఒక్క నకిలీ బాటిల్ లేదా ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మే ఒక్క సిరప్ బాటిల్ చివరకు ఒక నిర్దోషి ప్రాణాన్ని బలితీసుకునే ప్రమాదం ఉంది. ప్రభుత్వం కఠినమైన నిబంధనలతో వ్యవహరించాలి, ఫార్మా పరిశ్రమ నైతికతను పాటించాలి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అప్పుడే మన సమాజానికి, మన పిల్లలకు సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించగలం. సమాజ ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది . కాబట్టి నిర్లక్ష్యం వద్దు, అప్రమత్తతే మన రక్ష!

**డా .సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

### మనిషివైతే!

పార్టీల్లోచేరి
రాజకీయాల్లో
సేవచేస్తావా?
అదేవద్దు!
రాజకీయాల్లో
సేవ లేదు!
ఒకరినొకరు
తిట్టుకోవటమే!
మతరాజకీయం
బూర్జువరాజకీయం
స్వార్థ రాజకీయం
తట్టుకోలేవు!
వాగ్దానాలుచేసి
నెరవేర్చలేవు!
జనం వ్యతిరేకమై
ఓడిపోతావ్!
ప్రతిపక్షం
తక్కువోళ్లుకాదు!
నిన్నుఖచ్చితంగా
ఓడిస్తారు!
మళ్ళీఐదేళ్లు
రూట్ మార్చి
అబద్ధాలకు
అలవాటై!
ఖర్చుపెట్టింది
పోగేసుకుంటూ
అవినీతిలో
రారాజువు!
ఓపెన్ సీక్రెట్
అందరికీతెలిసి
ఈ బతుకుని
భరించగలవా?
ఓ తెల్లారగట్ల
గుండె ఆగి
చచ్చిపోతావ్!
మనిషివైతే!
మనిషివి కావా?
ఐతే నీఇష్టం
ప్రజాసేవతో
దున్నేసుకో!
వెనక్కితిరిగి
చూసుకో!
ఏమీ ఉండదు!
తిట్లురాట్లుతప్ప!
లోపాలన్నీ
వ్యవస్థవి!
లోపభూయిష్టమైన
వ్యవస్థఇది!
ఒక ప్రక్క
దిక్కులేనిప్రజలు!
మరోప్రక్క
ఆగర్భశ్రీమంతులు!



ప్రజలఅజ్ఞానమే
తమఆనందమని
నిరక్షరుల్నిచేసిన
మనువాదవ్యవస్థ!
మూఢనమ్మకాలు
దుర్వ్యసనాలు
కులపిచ్చితో
కుళ్ళినవ్యవస్థ!
బుర్జువానాయకులు
వీటినివాడుకుని
ఇంకాఎగదోసి
బ్రతికే వ్యవస్థ!
దోపిడీ వ్యవస్థ!
కార్పొరేట్ వ్యవస్థ!
ఫాసిస్ట్ వ్యవస్థ!
మతపిచ్చి వ్యవస్థ!
నువ్వుమనిషివైతే
నీ 'ప్రజాసేవ'
ఇక్కడకావాలి!
వ్యవస్థనుమార్చు!

**-తమ్మినేని అక్కిరాజు**
**హైదరాబాద్**

### రాతి పనిముట్టు నుండి రోబోట్ వరకు...

రాయితో రాయిని ఢీకొట్టి – నాడు
సృష్టించాడు తొలి ఆయుధం!
అదే నింపింది మానవజాతిలో
మహత్తర సాంకేతిక ఇంధనం!
భయపెట్టే నిప్పును బంధించి,
చీకటి గుహల్లో వెలుగులు నింపాడు;
వండిన ఆహారపు బలముతో,
మేధో వికాసపు శిఖరం చేరాడు!
నోట పలికిన శబ్దమే భాషైంది,
గోడలపై గీసిన చిత్రమే తొలి సమాచారమైంది!
కదిలిన చక్రం వేగపు పరుగున,
నాగరికతకు కొత్త బాటలు వేసింది!
మట్టిని తవ్వి విత్తనం నాటి,
పండించాడు హరిత విప్లవం;
లోహపు కాంతుల అంచులలో,
రూపుదిద్దుకుంది ఆధునిక విశ్వం!
నాడు రాయిని చెక్కిన ఆలోచనే,
నేడు కృత్రిమ మేధస్సుగా మారింది!
నాడు నిప్పును రాజేసిన జ్ఞానమే,
నేడు అంతరిక్ష నౌకలై ఎగిరింది!
రాజకోటలు కావు, రణరంగాలు కావు,
ఆదిమానవుని సృజనే ప్రగతికి పునాది!
అడవి బాటలో సాగిన ఆ జిజ్ఞాసే,
నేటి డిజిటల్ యుగానికి నిఖరమైన జీవనాడి!

**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
పౌర సంబంధాల అధికారి యుపిఎస్‌సి

# మనిషి మారకపోతే మార్క్స్ ఏంచేస్తాడు?

### ఒక మనో తాత్విక విశ్లేషణ

ఈ దేశంలో ఒక విచిత్రమైన అలవాటు ఉంది. సమాజంలో సమస్యలు కనిపించినప్పుడల్లా మనం పరిష్కారం కోసం ఒక మహానుభావుడిని వెతుకుతాం. ఒకరు బుద్ధుడిని తీసుకొస్తారు. మరొకరు అంబేద్కరును చూపిస్తారు. ఇంకొకరు మార్క్స్ ను ముందుకు తెస్తారు. వారందరూ గొప్పవారే. వారి ఆలోచనలు మానవ చరిత్రను ప్రభావితం చేశాయి. కానీ ఒక ప్రశ్న మాత్రం ఎప్పుడూ అడగబడదు. "బుద్ధుడు ఉన్నాడు. అంబేద్కర్ ఉన్నాడు. మార్క్స్ ఉన్నాడు. మరి మనం ఇంకా ఎందుకు మారలేదు"?. ఈ ప్రశ్నకు సమాధానం వెతకకుండా మరొక మహానుభావుడి కోసం ఎదురు చూడడం అనేది చీకట్లో పోగొట్టుకున్న తాళం చెవిని వెలుతురు ఉన్నచోట వెతకడంలాంటిది.

మన దేశంలో సిద్ధాంతాల కొరత కాదు. ప్రపంచంలో మరేదేశానికి లేనంత సిద్ధాంత సంపద మనదగ్గర ఉంది. మతాలు ఉన్నాయి. తత్వాలు ఉన్నాయి. విప్లవ గ్రంథాలు ఉన్నాయి. రాజ్యాంగం ఉంది. ఉద్యమాల చరిత్ర ఉంది. అయినప్పటికీ అన్యాయం ఉంది. అసమానత ఉంది. ద్వేషం ఉంది. దోపిడీ ఉంది. కులం ఉంది. మత వివక్షకు కూడా ఉంది. అంటే సమస్య ఎక్కడో వేరేచోట ఉంది.

మనిషి ఒక ఆశ్చర్యకరమైన జీవి. అతడు స్వేచ్ఛ గురించి మాట్లాడుతాడు. కానీ తనకు అవకాశం దొరికితే ఇతరులను నియంత్రించాలని చూస్తాడు. సమానత్వం గురించి ఉపన్యాసాలు ఇస్తాడు. కానీ తనకు ఉన్న ప్రత్యేక హక్కులను వదులుకోవడానికి సిద్ధపడడు. న్యాయం గురించి గట్టిగా మాట్లాడతాడు. కానీ తనకు లాభం కలిగించే అన్యాయాన్ని మాత్రం మౌనంగా సమర్థిస్తాడు. ఇదే మానవ వైరుధ్యం. (Human paradox).

బుద్ధుడు మనిషిలోని దుఃఖాన్ని చూశాడు అంబేద్కర్ కుల ఆధిపత్యాన్ని చూశాడు. మార్క్స్ ఆర్థిక దోపిడిని చూశాడు. కానీ ఈ ముగ్గురి ఆలోచనలు కూడా తమ స్వార్థానికి అనుగుణంగా మార్చుకునే మనిషి "మనస్తత్వాన్ని" (విప్లవం ఓడిపోయే చోటు) మనం ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేదు. అధ్యయనం చేసే ప్రయత్నమూ చేయడం లేదు.

అందుకే చరిత్రలో ఒక విచిత్రమైన దృశ్యం కనిపిస్తుంది. విప్లవం కోసం పోరాడిన వ్యక్తి అధికారంలోకి వచ్చిన తరువాత అధికార భాషనే మాట్లాడుతాడు. సమానత్వం కోసం పోరాడిన నాయకుడు తన అనుచరుల మధ్య అసమానతలను సహజంగా స్వీకరిస్తాడు. తన శత్రువును సులభంగా గుర్తిస్తాడు కానీ తనలోని అహంకారాన్ని గుర్తించలేడు. తనకు జరిగిన అన్యాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాడు కానీ తాను చేసిన అన్యాయాన్ని మరుసటిరోజే మర్చిపోతాడు. తనను అణిచివేసే వ్యవస్థను విమర్శిస్తాడు. కానీ తాను ఇంకొకరిపై చూపుతున్న ఆధిపత్యాన్ని చూడలేడు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమమే కొన్నిసార్లు తనలోనీ భిన్నాభిప్రాయాలను అణచి వేస్తుంది. అంటే సమస్య సిద్ధాంతంలో లేదు సమస్య సిద్ధాంతాన్ని ఉపయోగిస్తున్న మనసులో ఉంది. అందుకే సమాజ మార్పు గురించి మాట్లాడేటప్పుడు మనం కేవలం రాజకీయాలను, కులాన్ని,



ఆర్థిక వ్యవస్థను మాత్రమే చర్చిస్తున్నాం. కానీ అన్నింటిని నడిపిస్తున్న మనస్తత్వాన్ని గురించి తక్కువగా మాట్లాడుతున్నాం. ప్రపంచ చరిత్రలో జరిగిన అనేక ఘర్షణలు కేవలం ఆర్థిక, మత కారణాల వల్ల మాత్రమే జరగలేదు. మనిషి తన గుర్తింపును కాపాడుకోవాలనే భయం, తన గుంపును గొప్పదిగా భావించాలనే కోరిక, ఇతరుల కంటే పై చేయిగా ఉండాలనే మనస్తత్వం కూడా వాటికి కారణమయ్యాయి. ఈ సత్యాన్ని గుర్తించకుండా కేవలం సిద్ధాంతాలను అమలు పరచడం ద్వారా సమాజాన్ని మార్చగలమని భావించడం ఒక భ్రమ. ఈ దేశంలో చాలామంది మహానుభావులను చదువరు. వారిని పూజిస్తారు. ఆలోచనలను విశ్లేషించరు. వాటిని నినాదాలుగా మార్చుకుంటారు. ప్రశ్నించరు. విశ్వసిస్తారు. ఫలితంగా సిద్ధాంతం ఒక మతంగా మారుతుంది. నాయకుడు ఒక దేవుడిగా మారుతాడు. అనుచరుడు ఒక భక్తుడిగా మారుతాడు. ఏ సిద్ధాంతమైన విమర్శనాత్మక అధ్యయనం నుంచి ఆరాధన దశలోకి వెళ్ళినప్పుడు అది తన విముక్తి శక్తిని కోల్పోతుంది. తద్వారా ఆలోచన ఆగినచోట మార్పు కూడా ఆగిపోతుంది.

అందుకే ఈ దేశానికి కావలసింది మరో బుద్ధుడు కాదు. మరో అంబేద్కర్ కాదు. మరో మార్క్స్ కాదు. వారందరి నుండి నేర్చుకుంటూనే వారందరినీ ప్రశ్నించగలిగే ఒక కొత్త మేధో సంస్కృతి. తన కులాన్ని, తన మతాన్ని, తన రాజకీయ నాయకుడిని, అవసరమైతే తనను తాను కూడా ప్రశ్నించగలిగే వ్యక్తి. ఎందుకంటే రాజకీయ, ఆర్థిక, సామాజిక విప్లవాలు అనేవి ప్రభుత్వాలను, సంపద పంపిణీని, సంబంధాలను మార్చవచ్చునేమోగాని మనిషి తనను తాను "పరిశీలించడం" (కమ్యూనిస్టులు చెప్పే ఆత్మ విమర్శ కన్నా లోతైనది) ప్రారంభించిన రోజే అసలు విప్లవం మొదలవుతుంది.



**ఆయిరబోయిన బిక్షపతి**
**(అగల్ జోయా)**
సెల్ : 79932 48717

# విశ్వాసానికి గాయం

అయోధ్య రామమందిరం కేవలం ఒక ఆలయం కాదు. కోట్లాది హిందువుల ఆధ్యాత్మిక విశ్వాసానికి, దశాబ్దాల ఉద్యమానికి, సాంస్కృతిక భావోద్వేగానికి ప్రతీక. అలాంటి పవిత్ర స్థలంలో భక్తులు సమర్పించిన హుండీ నగదు, బంగారం, వెండి, ఆభరణాల దుర్వినియోగం లేదా దొంగతనం జరిగిందనే ఆరోపణలు వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఇది కేవలం ఒక క్రిమినల్ కేసు కాదు; ప్రజల విశ్వాసం, మత సంస్థల పారదర్శకత, అధికార వ్యవస్థల జవాబుదారీతనంపై నిలిచిన ప్రశ్న. ఇటీవల నమోదైన కేసుల ప్రకారం, ఆలయ విరాళాల నిర్వహణలో భాగమైన ఎనిమిది మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు వార్తలు వెల్లడించాయి. కొంత నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దర్యాప్తులో నగదు లెక్కింపు విధానాలు, సీసీటీవీ పర్యవేక్షణ, ఉద్యోగుల నియామకాలు, హుండీల భద్రత వంటి అంశాల్లో తీవ్రమైన లోపాలు బయటపడ్డాయని పలు జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి.

అయితే ప్రజల్లో ఎక్కువ చర్చకు దారి తీసింది దొంగతనం ఆరోపణల కంటే దర్యాప్తు దిశ. అత్యంత భద్రతా వలయంలో ఉండే రామమందిరంలో, వందలాది సీసీటీవీ కెమెరాలు, కఠిన నియంత్రణలు, బహుళస్థాయి పర్యవేక్షణ వ్యవస్థలు ఉన్నప్పుడు కేవలం కొంతమంది ఉద్యోగులు లేదా నగదు లెక్కించే సిబ్బంది మాత్రమే ఈ స్థాయి అవకతవకలకు పాల్పడగలరా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి ఉన్నతస్థాయి వ్యక్తులపై అభియోగాలు రుజువు కాలేదు. కానీ ప్రజల్లో అనుమానాలు మాత్రం కొనసాగుతున్నాయి. అవి నిజమా కాదా అన్నది కోర్టులు, దర్యాప్తు సంస్థలే తేల్చాలి. కానీ ఈ అనుమానాలు ఎందుకు ఉద్భవిస్తున్నాయో కూడా అర్థం చేసుకోవాలి.

దర్యాప్తులో కొందరు ట్రస్ట్ సభ్యులు, ముఖ్య బాధ్యతలలో ఉన్న వ్యక్తులు రాజీనామా చేసినట్లు వార్తలు వచ్చాయి. ట్రస్ట్ స్వయంగా "నిష్పక్షపాత దర్యాప్తుకు సహకరిస్తాం" అని ప్రకటించింది. ఈ పరిణామాలు వ్యవహారం సాధారణ పరిపాలనా లోపం కాదనే సంకేతాన్ని ఇస్తున్నాయి.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఆరోపణలు, అనుమానాలు, రాజకీయ వ్యాఖ్యలు ఒకటి; నిరూపితమైన వాస్తవాలు మరొకటి. ప్రతిపక్ష నాయకులు ఈ అంశాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొందరు దీనిని హిందూ సమాజానికి జరిగిన మోసంగా అభివర్ణిస్తుండగా, మరికొందరు ప్రభుత్వ పర్యవేక్షణ వైఫల్యంగా చిత్రీకరిస్తున్నారు. కానీ రాజకీయ విమర్శలతోనే సత్యం తేలిపోదు. అదే సమయంలో అధికారిక ప్రకటనలతోనే ప్రజల అనుమానాలు కూడా తొలగిపోవు. దేశీయ, అంతర్జాతీయ మీడియా ఈ వ్యవహారాన్ని కేవలం దొంగతనం కేసుగా కాకుండా "పారదర్శకత సంక్షోభం"గా చూస్తోంది. ఎందుకంటే అయోధ్య రామమందిరం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మతపరమైన ప్రాజెక్టు. కోట్లాది రూపాయల విరాళాలు ప్రతిరోజూ వస్తున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై అత్యున్నత ప్రమాణాల పారదర్శకత అవసరం. విరాళాల లెక్కింపు, బ్యాంకులకు బదిలీ, ఆభరణాల రికార్డింగ్, ఆడిట్ వ్యవస్థలు అన్నీ ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉండాలి.

సోషల్ మీడియా, రెడ్డిట్ వంటి వేదికలలో అయితే మరింత తీవ్రమైన ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇది కేవలం దిగువస్థాయి ఉద్యోగుల పని కాదని, మరింత విస్తృతమైన బాధ్యతా వైఫల్యం ఉండవచ్చని వాదిస్తున్నారు. మరికొందరు దర్యాప్తు పూర్తి కాకముందే పెద్ద



ఎత్తున రాజకీయ నిర్ధారణలకు వస్తున్నారు. అయితే సోషల్ మీడియా వ్యాఖ్యలను నిర్ధారిత సాక్ష్యాలుగా పరిగణించలేమని గుర్తుంచుకోవాలి. అవి ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించవచ్చు గానీ, న్యాయపరమైన సత్యాన్ని కాదు. ఈ సంఘటన మరో పెద్ద ప్రశ్నను లేవనెత్తుతోంది. భారతదేశంలోని దేవాలయాలు, మఠాలు, చర్చిలు, మసీదులు, గురుద్వారాలు వంటి మత సంస్థల ఆర్థిక నిర్వహణ ఎంత పారదర్శకంగా ఉంది? భక్తుల విరాళాలు ఎలా వినియోగించబడుతున్నాయి? వార్షిక ఆడిట్ నివేదికలు ఎంతవరకు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి? మతం పేరుతో నడిచే సంస్థలు ప్రజా విశ్వాసాన్ని పొందుతున్నప్పుడు, వాటి జవాబుదారీతనం కూడా అంతే స్థాయిలో ఉండాలి.

రామమందిరం వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థ విషయంలో ఈ ప్రమాణాలు మరింత కఠినంగా ఉండాలి. ఎందుకంటే ఇది కేవలం ఒక మత సంస్థ మాత్రమే కాదు; దేశ రాజకీయాలు, సంస్కృతి, చరిత్ర, సామాజిక భావోద్వేగాలతో ముడిపడి ఉన్న చిహ్నం. అందువల్ల చిన్న లోపం కూడా పెద్ద సంక్షోభంగా మారుతుంది.

ఈ వివాదంలో అత్యంత బాధాకరమైన అంశం ఏమిటంటే, భక్తులు సమర్పించిన ప్రతి రూపాయి వెనుక ఒక విశ్వాసం ఉంటుంది. కొందరు తమ సంపాదనలో భాగం ఇస్తారు. కొందరు జీవితకాల పొదుపులను సమర్పిస్తారు. మరికొందరు భక్తి భావంతో బంగారం, వెండి, ఆభరణాలు అందిస్తారు. అలాంటి విరాళాల నిర్వహణలో అవకతవకల ఆరోపణలు రావడం ఆర్థిక నష్టానికి మించిన నైతిక నష్టం.

కాబట్టి ఈ వ్యవహారంలో అసలు అవసరం రాజకీయ ఆరోపణలు కాదు, సంపూర్ణ సత్యావిష్కరణ. అరెస్టయిన వ్యక్తులు మాత్రమే బాధ్యులా? లేక పర్యవేక్షణలో ఉన్నతస్థాయి వైఫల్యాలు కూడా ఉన్నాయా? భద్రతా వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయి? సీసీటీవీ పర్యవేక్షణలో లోపాలు ఎలా వచ్చాయి? బాధ్యత ఎక్కడ ఆగుతుంది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి.

రాముడి పేరు మీద నిర్మితమైన ఆలయంలో జరిగిన ఈ వివాదం చివరకు ఒకే సందేశాన్ని ఇస్తోంది. విశ్వాసం సంపాదించడం కష్టం; కోల్పోవడం చాలా సులభం. భక్తుల విశ్వాసాన్ని కాపాడాలంటే న్యాయం జరిగిందని చెప్పడం సరిపోదు. న్యాయం జరిగిందని ప్రజలకు అనిపించాలి. అదే అయోధ్యకు, అదే రామమందిరానికి, అదే భారత ప్రజాస్వామ్యానికి ఇప్పుడు ఉన్న అతిపెద్ద పరీక్ష.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# బహుముఖ ప్రజ్ఞశాలి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

- పిల్లుట్లలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ
- హాజరైన మంత్రి దామోదర్



**శివ్వంపేట, జూన్ 28 (జనంసాక్షి) :** బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శివ్వంపేట మండలం, పిల్లుట్ల గ్రామంలో బి.ఆర్. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి దామోదర్ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మొదట పిలుట్లకు చేరుకోగానే అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో బ్యాండ్ మేళా, తాళాలతో పటాకుల భారీ శబ్దాలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత సభా వేదిక పక్కనే భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, జేసీ నగేష్ లతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఈ అంబేద్కర్ విగ్రహం సమానత్వానికి ప్రతీక అనీ సామాజిక న్యాయానికి చిహ్నం అనీ ప్రతి పేద కుటుంబానికి ఆశాజ్యోతి అనీ, ప్రతి యువకుడికి స్ఫూర్తి గా నిలుస్తుందన్నారు. అంబేద్కర్ తన చిన్నతనంలోనే కుల వివక్షను ఎదుర్కొని, చదువుతో ప్రపంచాన్ని గెలిచారన్నారు. వారు మనకు చెప్పిన గొప్ప సందేశం ఒక్కటే, పుట్టుక మన చేతిలో ఉండదు. కానీ జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో మన చేతిలోనే ఉంటుందన్నారు. బాబాసాహెబ్ డా. బి. ఆర్ అంబేద్కర్ బహుభాషావేత్త. ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రం, న్యాయశాస్త్రం, చరిత్ర ఇలా అన్నింటిలో నిష్ణాతుడు. అణగారిన వర్గాల కోసం తన జీవితాంతం పోరాటం చేశారని, అంబేద్కర్ తన కోసం జీవించలేదని, సమాజం కోసం జీవించారన్నారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడని మంత్రి గుర్తు చేశారు. సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించారని, గౌరవంగా జీవించడం ప్రతి మనిషి హక్కు అని ఆయన మనకు నేర్పించారని మంత్రి చెప్పారు. మన దేశానికి బీ.ఆర్ అంబేద్కర్ అందించిన అత్యంత గొప్ప కానుక భారత రాజ్యాంగం. ఆ రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, గౌరవప్రదమైన జీవితం అందించిందన్నారు. అందుకే ఆయనను భారత ప్రజాస్వామ్య శిల్పి గా పిలుస్తామన్నారు. బాబాసాహెబ్ చెప్పిన మార్గంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, మానవ గౌరవం కోసం మనమందరం కలిసి ముందుకు సాగుదాం. మన యువత బాబాసాహెబ్ జీవితాన్ని చదవాలని దామోదర్ రాజానర్సింహా పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని తెలుసుకోవాలని, విద్యను ఆయుధంగా మార్చుకోవాలన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహ దాత వెంకట్ నరసింహారెడ్డిని, మంత్రితోపాటు ఇతర ప్రజా ప్రతినిధులు, అంబేద్కర్ సంఘం నాయకులు శాలువా, మెమెంటోళ్లతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మురళీ గౌడ్, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇంచార్జి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ముంద్రాతి బాలేష్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమన్నగారి రవీందర్ రెడ్డి, జిల్లా నాయకుడు బండారి గంగాధర్, వివిధ పార్టీల మండల నాయకులు, అంసానిపల్లి నరసింహారెడ్డి, బొమ్మిడాల శంకర్, రాఘవరెడ్డి, వెంకట్రాంరెడ్డి, నవీన్ గుప్తా, మాధవరెడ్డి, సర్పంచ్ లు అయ్యగారి యాదగిరి, మాలోత్ కిషన్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, డాక్టర్ సాయిసౌమ్య, ఆర్ఐ నిరంజన్, అంబేద్కర్ సంఘం నాయకులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వం సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగపరచుకోవాలి



**నిజాంపేట్, జూన్ 28 (జనం సాక్షి) :** కుద్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం సర్కిల్ పరిధిలోని రోడ మేస్త్రి డివిజన్‌లో డ్వాక్రా గ్రూప్ మహిళా సంఘాల సభ్యులకు ఆదివారం ఇందిరమ్మ చీరలను డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అందులో భాగంగానే చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు పరుస్తుందని మహిళలకు ఉచిత బస్సు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు మంజూరు ఇతర అనేక కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుంది అని స్థానిక డ్వాక్రా సంఘాల మహిళలను ఉద్దేశించి తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూప్ సంఘాల మహిళలు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు జాకీర్ బలరాం, సిహెచ్ బుచ్చిరెడ్డి, పద్మ, సలీం, రజాక్, దుర్గేష్, కల్పన, నరసింహ, ఆబేద్, లక్ష్మి, సుజాత, లావణ్య,తదితరులు పాల్గొన్నారు.

# సబితా ఇంద్రారెడ్డి ఎటువంటి అభివృద్ధి చేశారో చెప్పాలి



**మహేశ్వరం, జూన్ 28 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదాని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి ఆదివారం మహేశ్వరం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.అనంతరం మండల చౌరస్తాలో కేటీఆర్,సబితా ఇంద్రారెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ నాయకులు దగ్ధం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ...సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్ కు లేదన్నారు.సబితా ఇంద్రారెడ్డి మూడుసార్లు మంత్రిగా ఉండి మహేశ్వరం నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేశారో చెప్పాలన్నారు.ప్రజా ప్రభుత్వాన్ని చూసి కేటీఆర్ ఓర్వలేక పోతున్నారన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతాంగానికి అండగా ఉంటూ, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నారన్నారు.రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజల ఆశీస్సులు ఉన్నాయన్నారు.రంగారెడ్డి జిల్లా , రాష్ట్రంలోని కంపెనీల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్తున్నా సబితా ఇంద్రారెడ్డికి దమ్ముంటే కంపెనీలలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ఫ్యూచర్ సిటీలో చర్చకు రావాలన్నారు.కెసిఆర్ ,కేటీఆర్ భూములను కోటి రూపాయలకు ఇస్తారా అని డిమాండ్ చేశారు.ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో ఎకరా భూమి 10 కోట్ల ధర పలుకుతుందన్నారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోటి రూపాయలకు ఎకర భూమి వస్తదని రైతులను నష్టపరిచేలా వ్యవహరిస్తున్నారన్నారు.బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచులను సబితా ఇంద్రారెడ్డి తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, పున్నా గణేష్,బండి మధుసూదన్ రావు,సామిడి గోపాల్ రెడ్డి,ఆవుల యాదయ్య, సత్యనారాయణ,నందిగామ నరసింహ, మల్లేష్ యాదవ్,రాజు నాయక్, ధనరాజ్ గౌడ్,రఘుపతి, పాండునాయక్,సమత,సునీత, అమృత నాయుడు, అరుణ ,పద్మ,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్‌తో ఓటు హక్కులను హరించే చర్యలను విరమించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్




**పెబ్బేరు, జూన్ 28 (జనం సాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభించారు. పెబ్బేరు మండల కేంద్రంలో సాయిరాం ఫంక్షన్ హాల్ లో మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. శిక్షణా తరగతులకు ప్రారంభ సూచికంగా పార్టీ జెండాను పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్ జెండా ఎగురవేశారు, అమరవీరుల చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు భూపాల్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం పేరుతో కోట్లాది మంది పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, దళితులు, మైనారిటీలు, అట్టడుగు వర్గాల ఓటు హక్కులు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ ఆవేదన వ్యక్తం చేశారు పలు రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు ఈ ప్రక్రియలో అక్రమాలు జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత ప్రాథమిక రాజ్యాంగ హక్కు అని గుర్తు చేశారు. అందువల్ల ఎన్నికల సంఘం రాజకీయ పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ప్రజల్లో అనుమానాలకు తావులేకుండా సర్ ప్రక్రియను నిర్వహించాలని కోరారు.ఎన్నికల జాబితాల సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరిగితే సిపిఎం తీవ్రంగా ప్రతిఘటిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, నాయకులు డి బాల్ రెడ్డి, మండ్ల రాజు, జిఎస్ గోపి, పెబ్బేరు మండల కార్యదర్శి బాలయ్య, పార్టీ సీనియర్ నాయకులు మహమూద్, జిల్లా నాయకులు, కౌన్సిలర్ మదన్, సర్పంచులు దొడ్ల కవిత, ఆర్ నిరంజన్, జమ్ములయ్య, మండల నాయకులు భాస్కర్, దేవన్న, ఉషన్న, పెద్దకాజా సభ్యులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలను అరికట్టడం అందరి బాధ్యత

- ఏసీపీ జి. శంకర్ రాజు




**కాప్రా, జూన్ 28 (జనం సాక్షి) :** మానవ అభివృద్ధి నిరోధకంగా మారిన మాదకద్రవ్యాల రవాణాను, వినియోగాన్ని అరికట్టడం పౌర సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి గురుతర బాధ్యత అని తిరుమలగిరి ట్రాఫిక్ ఏసిపి జి. శంకర్ రాజు అన్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ లో ఆదివారం మాదకద్రవ్యాల నివారణ అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన విద్యార్థి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్టడీ సెంటర్ కు చెందిన పిజిడిహెచ్ఆర్ డిప్లమా, జర్నలిజం విద్యార్థులు సంయుక్తంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ రూపొందించిన వీడియోలను ప్రదర్శించి విశ్లేషణాత్మకమైన వివరణ ఇస్తూ ఏసిపి శంకర్ రాజు ప్రేరణాత్మకమైన ప్రసంగాన్ని విద్యార్థులకు అందించారు. మాదకద్రవ్యాల వ్యతిరేకంగా రాసిన గీతాన్ని స్వయంగా పాడి వినిపించారు. ఉజ్వల భవిష్యత్తు పొందాల్సిన యువతరం, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలై కన్నవారికి కంటి శోకాన్ని మిగిల్చడం బాధాకరమని ఆయన చెప్పారు. దేశ సంపద లాంటి యువతరాన్ని, విద్యార్థులను కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ముందు జాగ్రత్త చర్యలతో కొత్త తరాన్ని ఆ వ్యసనానికి బానిసలు కాకుండా చూడాలని తల్లిదండ్రులు, పౌర సమాజానికి ఆయన విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎస్ ఎస్ బి డైరెక్టర్ డాక్టర్ వై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విస్తరించిన భూతంలా తయారవుతూ మానవ మనుగడకే సవాల్ గా మారిన మాదకద్రవ్యాలను అరికట్టడంలో వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని అన్నారు. ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. విద్యార్థుల ప్రశ్నలకు ఏసీబీ శంకర్ రాజు సమాధానాలు ఇస్తూ మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను చేయించారు.కార్యక్రమంలో అకాడమిక్ కౌన్సిలర్లు దునుకు వేలాద్రి, బాబ్జి, రామస్వామి, ఆలేటి రామచందర్, షేక్ సమీర్ తో పాటు రాజ్యలక్ష్మి, కార్యాలయ సిబ్బంది సతీష్, కాంచన, పీజీ డి హెచ్ ఆర్ విద్యార్థులు కంఠం సైదులు, తులసి కుమార్,శేఖర్, వనమాల అనిత తోపాటు తండు శివుడుగౌడ్, ఎం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హెలెన్ కిల్లర్ జీవితం ఆదర్శం



**శామీర్‌పేట్, జూన్ 28 (జనం సాక్షి) :** హెలెన్ కిల్లర్ జీవితం నేటి యువత కు ఆద్యమని సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ తెలిపారు. ఆదివారం వారం శామీర్ పేట్ లో ఆమె జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ ..యునైటెడ్ స్టేట్ కు చెందిన ఆమె 19 నెలల ప్రాయంలోనే అరుదైన వ్యాధితో తన జీవితంలో అంధకారం చవి చూసారని, అయినా మొక్కవోని ధైర్యంతో జీవితాన్ని జయించారని అన్నారు. ఆ వ్యాది కారణంగా ఆమె కంటి చూపు తో పాటు వినికిడి కూడా కోల్పయిందని అఫ్జల్ ఖాన్ తెలిపారు.ఈ సమయంలోనే అంచెలంచెలు గా తన విద్యాభ్యాసం పూర్తి చేశారని అఫ్జల్ ఖాన్ తెలిపారు. ఈమె జీవితం ఆధారంగానే హిందీ చిత్రం బ్లాక్ కూడా శ్రోతలను ఆదర్శప్రాయంగా నిలిచిందని అన్నారు. ప్రతి ఒక్కరు హెలెన్ కిల్లర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అఫ్జల్ ఖాన్ కోరారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటు నాయకులు ఉపాద్యాయులు పి నర్సింహా రెడ్డి, అశోక్, చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రణాళిక రహిత నిర్మాణాలే హైదరాబాద్ వరద ముంపునకు కారణం




**ముషీరాబాద్, జూన్ 28 (జనం సాక్షి) :** ప్రణాళిక రహిత నిర్మాణాలు, డ్రైనేజీ వ్యవస్థలో లోపాలు, వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు కలిగించే నిర్మాణాలే హైదరాబాద్ లో వరద ముంపుకు ప్రధాన కారణమని అర్బన్ పాలసీ నిపుణులు డా. దొంతి నరసింహారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య అధ్యక్షతన హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, అర్బన్ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాదులో వరద నీటి కష్టాలు – ప్రభుత్వ సన్నద్ధత అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల సమస్యలపై ప్రభుత్వం ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తలు, స్వచ్ఛంద సంస్థలతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలు స్వీకరించాలని ఆయన కోరారు. వాటర్ షెడ్‌లు, ఇంకుడు గుంతలు, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలను నిర్లక్ష్యం చేయడం వల్లే నగరంలో వాటర్ లాగింగ్ సమస్య తీవ్రంగా మారిందన్నారు. పర్యావరణ మార్పులు, హీట్ ఐలాండ్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పర్యావరణవేత్త డాక్టర్ లుబ్నా సర్వత్ మాట్లాడుతూ, ఏనుగుల కుంట సహజ నీటి ప్రవాహ మార్గాలు మూసివేయడం వల్ల వరద నీరు రోడ్లు, ఇళ్లలోకి చేరుతోందని విమర్శించారు. చెరువుల సుందరీకరణతో పాటు వాటి విస్తీర్ణం, లోతు పెంపుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, ప్రతి డబుల్ బెడ్‌రూమ్ అపార్ట్మెంట్ వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని సూచించారు. యూడీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నగరంలో చెట్లు కూలడం, విద్యుత్ తీగలు తెగిపోవడం, ప్రధాన రహదారులపై నీరు నిలవడం ప్రభుత్వ సన్నద్ధత లోపాన్ని బయటపెట్టిందన్నారు. రహదారులపై ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న ప్రార్థనా స్థలాలను స్థానికుల సహకారంతో అనువైన ప్రదేశాలకు తరలించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు, పర్యావరణ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలపై సంఘటితంగా ఉద్యమించాలి




**గద్వాల, జూన్ 28 (జనం సాక్షి) :** ఆల్ ఇండియా ట్రేడియన్ కాంగ్రెస్ జోగులాంబ గద్వాల జిల్లా మూడో మహాసభలు గద్వాల పట్టణంలో నిర్వహించబడ్డాయి.గద్వాల పట్టణంలోని జమ్మిచేడ్ జములమ్మ టెంపుల్ దగ్గర వైష్ణవి ఫంక్షన్ హాల్ కామ్రేడ్ రంగన్న అధ్యక్షతన జరిగాయి. ప్రారంభానికి ముందు ఏఐటియుసి పతాకాన్ని ఏఐటియుసి జాతీయ మాజీ కార్యదర్శి సురవరం విజయలక్ష్మి ఎగరవేసి మహాసభ లను ప్రారంభించి మాట్లాడారు .ఈ మహాసభలకు కార్మికులు, వివిధ రంగాల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.సభలో కార్మిక సమస్యల పరిష్కారం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక విధానాలు, రాబోయే కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐఎఫ్, పీఎఫ్, మరియు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం నరసింహ , ఎఐటియుసి జాతీయ మాజీ కార్యదర్శి సురవరం విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేమ పావని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎం నరసింహ మాట్లాడుతూనేడు కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి ఏమాత్రం కార్మికులకు ఉపయోగం లేని చట్టాలను తీసుకురావడం దుర్మార్గమన్నారు. దేశంలో ఎక్కడ కూడా కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రయత్నించడం లేదని, ఉన్నటువంటి కార్మికుల ప్రయోజనాలను కాలరాసే విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి వాటిలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులను బలవంతంగా బయటకి నెట్టివేయిస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఇన్సూరెన్స్ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేంద్రము చేయడం లేదని ఏఐటీయూసీ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం విజయలక్ష్మి విమర్శించారు. ఆటో కార్మికులైన హమాలి కార్మికులైన రిక్షా కార్మికులైన క్యాబ్ కార్మికులైన వ్యవసాయ కార్మికులైన ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ జీవిత బీమా భద్రత సౌకర్యాలు కల్పిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారని కానీ దేశంలో బిజెపి ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం పని చేయడం మా బాధ్యత కాదన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆర్టీసీ కార్మికులు అలాగే ఆటో కార్మికులు ఇచ్చిన హామీలు అమలు కోసం ఎదురుచూస్తున్న నేటికి ప్రయోజనం చేకూర్చడం లేదని విమర్శించారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ కార్మికులు పని భారం పెరిగి సరైన జీతాలు లేక ఈఎస్ఐ పీఎఫ్ లేక శ్రమ దోపిడీ గురవుతున్న ఇంకా కార్పొరేట్ ప్రైవేటు ఏజెన్సీలకు కార్మికులను వారి శ్రమను దోచుకోవడానికి అప్పనంగా అప్పజెప్పడం సిగ్గుచేటని వాళ్ల శ్రమ దోపిడిని దోచుకొని ఏజెన్సీలకు కట్టబెట్టే విధంగా నిర్ణయాలు మానుకోవడం కార్మికులకు మేలు చేస్తున్నట్లుగా ఉంటుందని తెలిపారు. ఆర్టీసీ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వంలో విలీనం తదితర అంశాలను తక్షణమే అమలుపరచాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేమ్ పావని మాట్లాడుతూ అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించిన ఏ రంగాల వారికి పెంచుతున్నారో స్పష్టత లేదని పేర్కొన్నారు . జోగులాంబ గద్వాల జిల్లాలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పైన రాజీలేని పోరాటాలకు శ్రీకారం చుట్టాలని ఆ దిశగా కార్మిక సంఘం సభ్యత్వం కమిటీలు, కార్యక్రమాలు రూపొందించాలని దానికి ఏఐటీయూసీ రాష్ట్ర కేంద్రం సంపూర్ణంగా సహకారం ఉంటుందని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేమ్ పావని తెలిపారు. మహసభలో జిల్లా అధ్యక్షులు జిల్లా నిర్మాణం భవిష్యత్తు కర్తవ్యాలు నాయకత్వం పని విధానం తదితర అంశాలపై మాట్లాడారు అనంతరం ఈ జిల్లాకు సంబంధించిన కార్మిక సమస్యల పైన కొన్ని తీర్మానాలు చేసి ఆమోదం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు ప్రతినిధులు రంగన్న వెంకటేష్ కాసిం కృష్ణ నారాయణ రాజు నాగరాజు పరశురాము వెంకటేశు మద్దిలేటి నాగార్జున ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ అధ్యక్షులు భరత్ ఆశన్న కురుమన్న బంగారు తిమ్మప్ప రవి వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
29 జూన్ 2026

# నిర్మాణాల నాణ్యత గాలికి..

- రెండున్నర ఏళ్లకే సీసీ రోడ్డుకు పగుళ్లు
- ఇసుక లేకుండానే మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం
- పర్యవేక్షణ కరువైందని గ్రామస్థుల ఆరోపణలు

**కొండాపూర్, జూన్ 28 (జనం సాక్షి) :** మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనుల పేరుతో చేపడుతున్న సీసీ రోడ్లు, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా విస్మరించబడుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మారేపల్లి గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డుకు రెండున్నర సంవత్సరాలకే పగుళ్లు ఏర్పడగా, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మహిళా సమాఖ్య భవనంలోనూ ఇసుకకు బదులుగా డస్ట్‌ను వినియోగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గతంలో నిర్మించిన సీసీ రోడ్లలో నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అవసరమైన ఇసుకను వినియోగించకుండా డస్ట్‌తోనే నిర్మాణాలు చేపట్టడంతో రోడ్లు తక్కువ కాలంలోనే దెబ్బతిన్నాయని స్థానికులు చెబుతున్నారు. మారేపల్లితో పాటు ఇదే కాంట్రాక్టర్ చేపట్టిన ఇతర గ్రామాల పనుల్లోనూ ఇలాంటి సమస్యలే ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం డ్వాక్రా మహిళల సమావేశాల కోసం నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవనాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. స్లాబ్ పనుల్లో కూడా ఇసుక వినియోగించకుండా డస్ట్‌తోనే కాంక్రీట్ వేస్తున్నారని, తక్కువ నాణ్యత కలిగిన సిమెంట్ ఇటుకలతో గోడలు నిర్మిస్తున్నారని విమర్శిస్తున్నారు. గతంలో నిర్మించిన సీసీ రోడ్లకు సైడ్ బర్మ్‌లు వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. నాసిరకం నిర్మాణాల వల్ల ప్రజాధనం వృథా అవుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల పర్యవేక్షణపై విమర్శలు

నిర్మాణ పనులపై సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్లు తమ



ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. నాసిరకం పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పనులను నిలిపివేసి నాణ్యతతో తిరిగి నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### లోపాలు సరిచేస్తాం

మారేపల్లి సీసీ రోడ్డులో పగుళ్లు ఏర్పడిన విషయం ఇటీవల తన దృష్టికి వచ్చిందని పీఆర్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పగుళ్లు ఏర్పడిన ప్రాంతాలను పరిశీలించి మరమ్మతులు చేపడతామని చెప్పారు. మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాల్లో ఇసుక వినియోగించాల్సిందేనని, నాణ్యతా లోపాలు తేలితే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 28 (జనం సాక్షి) :** ఐదేళ్ళలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు వేయాలన్నారు. నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎంతమంది చిన్నారులు ఉన్నారు? ఎన్ని కేంద్రాలను ఏర్పాటు చేశారని, అవసరమైన డోసుల వాక్సిన్ అందుబాటులో ఉందా అని ప్రోగ్రామ్ అధికారిని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పుర చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, కౌన్సిలర్లు ప్రభాకర్, రాజేష్ ఘట్, ఆర్ఎంవో డాక్టర్ బాలాజీ, ఏఎన్ ఎం సువిశేషమ్మ, అంగన్ వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సదాశివపేట, జూన్ 28 (జనం సాక్షి) :** ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా ఆదివారం సదాశివపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,మండల పరిధి గొల్లగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని, చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు రెండు పోలియో చుక్కలే రక్షణ కవచమని పేర్కొన్నారు. తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లోని ప్రతి చిన్నారికి పోలీసులకు వందల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి అర్హులైన చిన్నారులను గుర్తించి పోలే చుక్కలు వెయ్యాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునిగే సుజాత నవీన్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు, ఉప సర్పంచ్ కొలుకూరి అశోక్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ నాసిర్, నాయకులు అక్బర్ హుస్సేన్, లతీఫ్, మల్లేశం, వార్డ్ మెంబర్లు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యో రీత్యా ఉద్యోగ విరమణ తప్పదు



**మెదక్, జూన్ 28 (జనం సాక్షి) :** ఆదివారం రోజు మెదక్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాచవరంలో తెలుగు ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న పద్మావతి ఉద్యోగ విరమణ అభినందన సభ మండల పరిధిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ విరమణ సభను ఉద్దేశించి మాచవరం కాంప్లెక్స్ మరియు మాచావారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుకన్య మాట్లాడుతూ పదవి విరమణ ప్రతి ఒక్క ఉద్యోగికి తప్పనిసరిగా అని సమాజంలో మంచి గుర్తింపు పొందిన ఉపాధ్యాయురాలుగా పద్మావతి అని మాచవరం ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాల పాటు తెలుగు సబ్జెక్టును బోధిస్తూ గురువారం పదవి విరమణ పొందిన పద్మావతికి అభినందనలు తెలిపారు పద్మావతి విద్యార్థులతో మమేకమై పాఠాలు బోధించేవారని సమయపాలన పాటించడంలో ఆమె ముందు వరుసలో ఉండేదని , ప్రతి విద్యార్థి తో ఆమె మమేకమై బోధించే వారని . విద్యార్థుల ప్రగతిలో ఆమె కృషి అమోఘమని సుకన్య అన్నారు. ఈ ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పనింద్ర , సత్యనారాయణ పత్రికా విలేకరులు శరత్ చంద్ర , శంకర్ దయాల్ చారి మరియు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎల్.మల్లారెడ్డి , శిరిగి ప్రభాకర్ , నీలకంఠం కొండల్ రెడ్డి. అంజగౌడ్,. కిష్టయ్య, రాగి అశోక్ రాగి చక్రపాణి మెదక్ పట్టణ ఆర్యవైశ్య.ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యం



**కొండాపూర్, జూన్ 28 (జనం సాక్షి) :** గ్రామాల సమగ్ర అభివృద్ధే తన ధ్యేయమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కొండాపూర్ మండలంలోని తెర్పోల్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఓపెన్ డ్రైన్ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచ్ సతీష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినందుకు ఎమ్మెల్యేకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. అధికార--ప్రతిపక్ష భేదం లేకుండా నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న నిరడి బిక్షపతి,నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే చెల్లగోపులారం గ్రామంలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకం విఠల్, ఉప సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ మోహన్ గౌడ్, సదాశివపేట మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, డాకూరి శేఖర్, మన్సూర్, సర్పంచ్ రామ్ చందర్, మోహన్, కృష్ణ, మాజీ సర్పంచ్ ప్రకాష్, మాజీ ఎంపీటీసీ అనంత రాములు గౌడ్, వార్డు సభ్యుడు శివయ్య, రాజు, మాజీ ఎంపీటీసీ రామదాసు, శ్రీను, విష్ణు, శివరాములు, శ్రీకాంత్ రెడ్డి, మహేనుబ్, మహుమద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

- ఏబీవీపీ పాలమూరు విభాగ్ సమావేశం విజయవంతం



**వనపర్తి రూరల్, జూన్ 28 (జనం సాక్షి) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పాలమూరు విభాగ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని ఎం.వి. రామన్ స్కూల్‌లో పాలమూరు విభాగ్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీ విష్ణువర్ధన్ జీ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలమూరు విభాగ్‌లో గతంలో నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించి, వాటి విజయవంతానికి కృషి చేసిన కార్యకర్తలను అభినందించారు. రానున్న రోజుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి విద్యాసంస్థలో విస్తృతంగా చేపట్టాలని, నగర, కళాశాల కమిటీలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడంతో పాటు, విద్యార్థులు ఎదుర్కొంటున్న స్థానిక విద్యా సమస్యలపై నిరంతర ఉద్యమాలు చేపట్టి వారి హక్కుల పరిరక్షణకు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, ఏబీవీపీ సేవా, జాతీయ భావనతో విద్యార్థి సమాజానికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థి శక్తే దేశ భవిష్యత్తు -- ప్రతి విద్యార్థి వద్దకు ఏబీవీపీ" అనే లక్ష్యంతో రానున్న కార్యాచరణను విజయవంతం చేయాలని సమావేశంలో కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో పాలమూరు--నల్గొండ సంభాగ్ ప్రముఖ్ శ్రీ బీజాపూర్ కరెంధర్‌నాథ్, పాలమూరు విభాగ్ ప్రముఖ్ శ్రీ కర్నె రామచందర్, పాలమూరు విభాగ్ సంఘటన కార్యదర్శి నవేంద్ర జీ, పాలమూరు విభాగ్ కన్వీనర్ అర్జున్ సాతర్ల, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరుణాకర్, జిల్లా కన్వీనర్లు, జిల్లా ప్రముఖులు, వివిధ కళాశాలల విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రష్యా నెవ్‌స్కి సదస్సు గొప్ప అనుభూతి

- గురుజాల్ శివరాజ్ పాటిల్



**కృష్ణ, జూన్ 28 (జనం సాక్షి) :** రష్యాలోని సెంట్ పీటర్స్‌బర్గ్ నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నెవ్ స్కి, ఫోరం ఆధ్వర్యంలోని ప్రపంచీకరణ - విద్యా అవకాశాలు, యువత పాత్ర" అనే అంతర్జాతీయ సదస్సులో భారతదేశం తరపున పాల్గొనడం నాకు ఎంతో గౌరవంగా, స్ఫూర్తిదాయకం గా అర్థవంతమైన అనుభూతిగా నిలిచిందనీ గురుజాల్ శివరాజ్ పాటిల్ అన్నారు. సెంట్ పీటర్స్‌బర్గ్ అసెంబ్లీ హాల్‌లో జరిగిన ఈ కీలక సమావేశంలో మారుతున్న విద్యా అవకాశాలు, కృత్రిమ మేధస్సు, సాంకేతికత ప్రభావం, భవిష్యత్తులో యువత పాత్ర, అంతర్జాతీయ సహకారం వంటి పలు అంశాలపై విస్తృత చర్చలు జరిగాయనీ తెలిపారు. ముఖ్యంగా బ్రిక్స్ దేశాల మధ్య సంబంధాల బలోపేతం, యువతకు అందుబాటులోకి వస్తున్న కొత్త అవకాశాలపై విలువైన ఆలోచనలు పంచుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భారతదేశం తరఫున పాల్గొనే అవకాశం రావడం నాకు ఎంతో ఆనందం, గర్వాన్ని కలిగించిందన్నారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ముజేంద్రజీ, ఉదయసుద్, అయ్యప్పతో కలిసి ఈ అంతర్జాతీయ వేదికలో పాల్గొనడం ప్రత్యేక అనుభూతిగా నిలిచిందన్నారు. ఈ వేదిక ద్వారా ప్రపంచ విద్యా రంగంలోచోటుచేసుకుంటున్న మార్పులనుతెలుసుకోవడం, యువత భవిష్యత్తు కోసం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలను అర్థం చేసుకోవడం ఒక గొప్ప అనుభవం అన్నారు. భారత యువత ప్రతిభ, ఆలోచనలు నాయకత్వ సామర్థ్యాలు ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## జములమ్మ క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ




**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 28 (జనం సాక్షి) :** గద్వాల నియోజకవర్గంలోని నడిగడ్డ ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన జమ్మిచేడు జములమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తెలంగాణ సాదు పరిషత్ ఆధ్వర్యంలో మహాజన శక్తి కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సాధువులు, హిందూ సామాజిక వర్గాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ సాదు పరిషత్ అధ్యక్షుడు శంకర్ స్వామీజీ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను కల్పించిందని, హిందూ దేవాలయాలలో దర్శనం చేసుకునే హక్కు భక్తులందరికీ ఉందని పేర్కొన్నారు. ఇటీవల మల్దకల్ మండలంలోని మద్దెలబండ గ్రామంలో తనను పోలీసులు నిర్బంధించిన ఘటనపై ఆవేదన వ్యక్తం చేస్తూ, సంబంధిత అంశంపై అధికారులు చట్టబద్ధంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జములమ్మ అమ్మవారిపై భక్తులకు ఉన్న విశ్వాసాలను గౌరవించాలని, ఆలయ సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షిస్తూ హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హిందువులందరూ పరస్పర సహకారం, సామరస్యంతో సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేదయోగి మహారాజ్, ఆత్మరామస్వామి, సి.వి.ఆర్. ప్రసాద్ జీ, డాక్టర్ పురుషోత్తం, కీర లింగేశ్వర స్వామి, ప్రియా చౌదరి తదితరులు పాల్గొన్నారు. విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు, స్థానిక హిందూ బంధువులు మరియు వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం మొత్తం ధార్మిక విలువలు, సామాజిక ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణ వంటి అంశాలపై చర్చలతో సాగింది.

## ప్రత్యేక సమగ్ర సవరణను వేగవంతం చేయండి



**న్యాల్‌కల్, జూన్ 28 (జనం సాక్షి) :** రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కొనసాగుతున్న.."ప్రత్యేక సమగ్ర సవరణ" (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) సర్ కార్యక్రమాన్ని మరింతగా వేగవంతం చేయాలని, నిర్దేశించిన గడువులోపే సర్ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని, మండలంలో సర్ కార్యక్రమ ప్రక్షాళన మందకోడిగా కొనసాగడం ఎంత మాత్రం సరికాదని, ఏమాత్రం అలసత్వం వహించిన శాఖపరమైన చర్యలు తప్పవని జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని హద్నూర్ గ్రామంలో కొనసాగుతున్న సర్ ప్రక్షాళన కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలంలో సర్ ప్రక్షాళన కార్యక్రమాన్ని మరింతగా వేగవంతం చేసేందుకు స్థానిక సర్ ప్రక్షాళన అధికారుల బృందం దృష్టి సారించాలని ఆర్డీఓ ఆదేశించారు. ప్రక్షాళనతో అనర్హత ఓట్లను తొలగించేందుకు బిఎల్వో లు, బిఎల్ఏలు మరింతగా దృష్టి సారించి వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈనెల 25న ప్రారంభమైన ప్రక్షాళన జులై 24 లోపు ప్రతి ఇంటింటికి వెళ్లి "ప్రత్యేక సమగ్ర సవరణ" చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ ఐ శ్యామ్ రావు, బిఎల్ఓలు, బిఎల్ఏలు పాల్గొన్నారు.

## పోలియో రహిత భారతదేశమే మన లక్ష్యం



**కోహెడ, జూన్ 29 (జనంసాక్షి) :** మండలం లోని వరికోలు గ్రామం లో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో వైద్య సిబ్బందితో కలిసి కోహెడ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయిని నిర్మల - జయరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పోలియో రహిత భారతదేశమే మన అందరి లక్ష్యమని, దీనిని సాధించాలంటే ప్రతి బిడ్డకూ క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని, ప్రభుత్వం అందిస్తున్న అన్ని టీకాలను తప్పనిసరిగా వేయించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, మీ పిల్లల ఆరోగ్యం కోసం దగ్గరలోని పోలియో కేంద్రానికి వెళ్లి చుక్కల మందు వేయించాలని,ఇది పూర్తిగా ఉచితం, సురక్షితమని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుదగోని దేవరాజ్, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి,ఏ ఎన్ ఎం జ్యోతి,ఆశా కార్యకర్తలు గుర్రం విజయ, జేరిపోతుల పద్మ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం అండ




**గద్వాల నడిగడ్డ, జూన్ 28 (జనం సాక్షి) :** గ్రామ స్థాయిలో మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సెర్ప్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని జిల్లా సమాఖ్య అధ్యక్షులు, మహా సమాఖ్య అధ్యక్షుల నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్పించాలని,మహిళా సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబనను పెంపొందించాలని సూచించారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ మహిళా సాధికారత, బాలికల విద్య, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వడ్డీలేని రుణాలు,ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి యూనిట్లు,వివిధ సంక్షేమ పథకాలతో మహిళలను అన్ని విధాలుగా ఆదుకుంటూ ఆర్థికంగా బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. అనంతరం జిల్లా సమాఖ్య అధ్యక్షులకు శ్రీ వినాయకుని చిత్రపటాలను జ్ఞాపిక,మెమెంటో లను అందజేశారు. అంతకముందు అలంపూర్‌లోని జోగులాంబ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని రాష్ట్రంలోని జిల్లా సమాఖ్య అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ముసాయిదా బేగం,అడిషనల్ డి.ఆర్.డి.ఓ శ్రీనివాసులు,గద్వాల మహిళా సమాఖ్య అధ్యక్షులు ప్రభావతి, వివిధ జిల్లాల సమాఖ్య అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

# చిరుతపులి సంచరిస్తోంది జాగ్రత్త

- రాత్రి వేళల్లో బయటకు రావద్దు
- కొత్తగూడ రేంజ్ అధికారి వంశీకృష్ణ





**కొత్తగూడ జూన్ 28 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా నర్సంపేట రేంజ్ పరిధిలోని ఖానాపూర్ మండల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గూడూరు వన్యప్రాణి విభాగానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులకు నమ్మదగిన సమాచారం అందింది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ అటవీ శాఖ రేంజ్ అధికారి వంశీకృష్ణ స్పందిస్తూ స్థానిక గ్రామస్థులు ముందస్తు జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పశువులు, గొర్రెలు, మేకలను మేపడానికి అటవీ ప్రాంతాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు. అలాగే మహిళలు, వృద్ధులు పిల్లలు సాయంత్రం వేళల్లో, రాత్రి సమయాల్లో ఇళ్ల నుండి ఒంటరిగా బయటకు రాకూడదని, అత్యవసరమైతే సమూహాలుగా వెళ్లాలని సూచించారు. ఎవరైనా చిరుతపులి సంచారాన్ని గమనించినట్లయితే దానికి ఎలాంటి హాని కలిగించకుండా వెంటనే అటవీ శాఖ కు సమాచారం అందించాలని కోరారు. వన్యప్రాణులకు హాని కలిగించడం లేదా వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972 నిబంధనలను ఉల్లంఘించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చిరుతపులి సమాచారం కోసం ఎఫ్.ఎస్.ఓ. హట్టి సింగ్ (94405 87017), ఎఫ్.బి.ఓ. సాగర్ (95026 88782) నెంబర్లలో సంప్రదించాలని అటవీ శాఖ రేంజ్ అధికారి ప్రకటనలో తెలిపారు.

# శివాని విద్యా సంస్థల డైరెక్టర్ సతీమణి మృతి



**చెన్నారావుపేట, జూన్ 28( జనం సాక్షి ):** శివాని విద్యా సంస్థల డైరెక్టర్, పాతమగ్దంపురం గ్రామానికి చెందిన ననుమాస రమేష్ గౌడ్ సతీమణి శ్రీదేవి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలిసిన గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ శ్రీ దేవి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మోకుదెబ్బ చెన్నారావుపేట మండల అధ్యక్షులు గొడిశాల మల్లయ్య గౌడ్, శివాని విద్యా సంస్థల చైర్మన్ తాళ్లపెల్లి స్వామి గౌడ్, సర్పంచ్ ననుమాస కర్ణాకర్ గౌడ్, ఆకులపెల్లి మనోహర్ గౌడ్, వీరస్వామి గౌడ్, రాజు గౌడ్, కరణాకర్ గౌడ్, కళాదర్ గౌడ్, నాగపూరి రాజు గౌడ్, సంఘం అధ్యక్షులు ననుమాస నర్సయ్య గౌడ్, ఆకుల అశోక్ గౌడ్, బండారు సత్యం గౌడ్, ననుమాస బాస్కర్ గౌడ్, ముత్యాల కుమార్ గౌడ్, కుర్ర శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# భైంసా అభివృద్ధికి రూ.30.32 కోట్ల పనులకు శ్రీకారం

- జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



**నిర్మల్ బ్యూరో, జూన్ 28 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం భైంసా పట్టణంలో రూ.30.32 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, 440 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు తాళాలు, గృహ పట్టాలు అందజేశారు. అమృత్ పథకం కింద రూ.28.18 కోట్లతో తాగునీటి సరఫరా వ్యవస్థ ఆధునికీకరణ పనులకు, రూ.2.14 కోట్లతో మహదేవ్‌పూర్ చెరువు పునరుద్ధరణకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనులతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి చెప్పారు. రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, త్వరలో సామాజిక భద్రత పింఛన్ల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం కొనసాగిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జి. నగేష్, ఎమ్మెల్యే రామారావు పటేల్, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో
# ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో , జూన్ 28 (జనంసాక్షి) :** జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి అర్హ ఓటరు జూలై 24లోగా తమ వివరాలను నమోదు చేసి ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని 29వ వార్డులో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక సవరణ కార్యక్రమం జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కాలంలో ఓటర్ల వివరాల సేకరణ, సవరణ, అనుసంధాన ప్రక్రియను విస్తృతంగా చేపడుతున్నట్లు చెప్పారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి రెండు ప్రతుల ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ప్రజలు ఫారాలను పూర్తిగా పూరించి, 2002 ఓటర్ల జాబితాలో తమ పేరు లేదా తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మ, నానమ్మ తదితర కుటుంబ సభ్యుల వివరాలు ఉన్నాయో లేదో పరిశీలించి, సంబంధిత సమాచారాన్ని ఫారంలో నమోదు చేయాలని సూచించారు. అనంతరం సంతకం చేసి, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటోను జతచేసి సంబంధిత బీఎల్‌ఓకు అందజేయాలని తెలిపారు. ఒక ప్రతిని బీఎల్‌ఓ వద్ద ఉంచుకుని, మరో ప్రతిని ఓటర్లు తమ వద్ద భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఓటర్లు తమ వివరాలను బీఎల్‌ఓలను సంప్రదించడం ద్వారా లేదా voters.eci.gov.in వెబ్‌సైట్‌లో **Search by Electoral** ఎంపిక ద్వారా సులభంగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించిన ప్రతి ఓటరి ఓటు భద్రంగా ఉంటుందని, ఫారాలు సమర్పించని వారి వివరాలు మాత్రమే తదుపరి పరిశీలనకు లోబడే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంలో పాల్గొనడం ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొంటూ, జిల్లాలోని ప్రతి అర్హత ఓటరు జూలై 24లోగా తమ వివరాలను నమోదు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్‌ఓ సమక్షంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్వయంగా తన ఓటు వివరాలను పరిశీలించారు. రీప్రింటెడ్ ఎన్యూమరేషన్ ఫారంలో 2002 ఓటర్ల జాబితా ప్రకారం ఉన్న వివరాలను నమోదు చేసి, పాస్‌పోర్ట్ సైజు ఫోటోను జతచేసి బీఎల్‌ఓకు అందజేశారు. ఈ సందర్భంగా జూలై 24 వరకు కొనసాగనున్న ప్రత్యేక ఎన్యూమరేషన్ కార్యక్రమంలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొని ఫారాలను సమర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ తహసీల్దార్ రాజు, వార్డు సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, కాలనీ వాసులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ ఫిర్యాదులు బుట్టదాఖలు?

- న్యాయం జరుగుతుందన్న బాధితులకు నిరాశేనా..!
- అధికారులు ఇప్పటికైనా స్పందించండి
- సమస్యలు పరిష్కరించండి
- పలువురు ఫిర్యాదుదారుల ఆవేదన



**వరంగల్ ఈస్ట్, జూన్ 28 (జనం సాక్షి) :** కమిషనర్ పెట్టే గ్రీవెన్స్ లో తాము దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరుగుతుందని, తాము ప్రశాంతంగా ఉండగలుగుతామని ఎంతో ఆశతో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రీవెన్స్కు వచ్చి తమ ఫిర్యాదులను ప్రతి సోమవారం ఇస్తున్న ప్రజలకు బాధితులకు నిరాశే కలుగుతుందా అనే అనుమానం కలుగుతుంది. తాము ప్రతి సోమవారం గ్రీవెన్స్ లో దరఖాస్తులు ఇస్తూ ఉండడమే తప్ప వాటి పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్న పరిస్థితి కనిపిస్తుంది. ఏళ్ల తరబడి గ్రీవెన్స్ లో దరఖాస్తు చేసుకుంటున్నా కూడా తమ సమస్యలు అలాగే ఉన్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ప్రజలు తమ బాధలకు సంబంధించిన దరఖాస్తులను ఇచ్చినప్పుడు సంబంధిత వింగు అధికారులకు అందించినప్పుడు తమ సంబంధిత సిబ్బందికి అప్పజెప్పి సమస్య పరిష్కరించాలని చెప్పినా కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఆ సమస్యల అపరిష్కృతం గానే ఉండిపోతున్నాయి. ప్రతి సోమవారం వందలాది మంది దరఖాస్తులు చేసుకుంటున్నారు కానీ వాటిని పరిశీలించి వాటిలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని చిత్తశుద్ధి అధికారులలో ఉండాలి. కాని వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అని అనుమానం కలుగుతుంది. ఇందుకు ఉదాహరణగా గృహవాసులు వాడుకునే నీళ్లతో పాటు వర్షానికి వచ్చే వరద నీరు పోయే దారిని ఏర్పాటు చేయాలని, మోరి నిర్మించాలని ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రంగసాయిపేటకు చెందిన రిషి నందు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు కొల్లూరి యోగానంద్ గ్రీవెన్స్ లో కోరారు. ఈ మేరకు ఆయన గత సోమవారం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. నగరంలోని 42వ డివిజన్ రంగసాయిపేట పరిధిలోని ఖమ్మం రోడ్డు నుంచి ఉరుసు వెళ్లే బైపాస్ రోడ్ లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీళ్లు నిలిచి ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. లెనిన్ నగర్, సాయి నగర్, జయశంకర్ కాలనీ, హరిజన బస్తి ,సగర వీధి, కటికవాడ పద్మశాలివాడ ,వెంకటేశ్వర కాలనీ, తెలంగాణ కాలనీ వాసులు వాడుకునే నీరు సునాయాసంగా బయటికి వెళ్లే దారి లేక బైపాస్ రోడ్ లో నిలుస్తుందని యోగానంద్ ఫిర్యాదులు తెలిపారు. అదేవిధంగా వర్షం వస్తే ఇంకా పరిస్థితి అయోమయంగా ఉంటుందన్నారు. కాలువలపై అక్రమంగా ఏర్పాటు చసిన చిన్న పైపులను తొలగించాలని, కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కనీసం మూడు అడుగుల పైపువేసి పునరుద్ధరించి మురికి నీరు సాపిగా వెళ్లాల చేయాలని, వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని సమస్యను శాశ్వత పరిష్కారం చేయాలని యోగానందు కోరారు. అంతేకాకుండా సంబంధిత ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అధికారులకు కూడా ఆయన విన్నవించారు. అయినా కూడా ఆ సమస్య అక్కడే ఉంది. ప్రజల ఆరోగ్యం ప్రజా ప్రయోజనాల గుర్తించి ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి శాశ్వత చర్యలు తీసుకోవాలని కమిషనర్ను కోరుతున్నాడు. ఇదొక్కటే సమస్య కాదు గ్రీవెన్స్ వచ్చినటువంటి చాలా సమస్యలు ఈ విధంగానే అపరిష్కృతంగా మిగిలి ఉన్నాయి. ప్రతి సోమవారం గ్రీవెన్స్ కొచ్చి ఫిర్యాదులు తీసుకోవడమే తప్ప ఆ ఫిర్యాదుల లో ఉన్న సమస్యలను తీర్చే నాధుడు లేక నగర ప్రజలు గ్రీవెన్స్ పై అసహనం వ్యక్తం చేస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన విధంగా స్పందిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# సెల్యులైటిస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రైతులు, మధుమేహ రోగులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- డాక్టర్ నరేష్ కుమార్, ఎంఎస్, జనరల్ సర్జరీ, వరంగల్





**వరంగల్ బ్యూరో, జూన్ 28(జనం సాక్షి) :** వర్షాకాలం ప్రారంభమైన తర్వాత రైతులు పొలాల్లో ఎక్కువసేపు నీటిలో పనిచేయడం, కాళ్లకు చిన్న చిన్న గాయాలు కావడం, ముళ్లు గుచ్చుకోవడం, పగుళ్లు ఏర్పడటం వంటి కారణాల వల్ల సెల్యులైటిస్ అనే తీవ్రమైన చర్మ మరియు మృదు కణజాల ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. అలాగే మధుమేహం ఉన్నవారిలో రోగనిరోధక శక్తి తగ్గడం, కాళ్లలో స్పర్శ తగ్గిపోవడం , రక్తప్రసరణ సరిగా లేకపోవడం వల్ల ఈ వ్యాధి మరింత తీవ్రంగా మారే అవకాశం ఉంటుంది ఈ విషయమై డాక్టర్ నరేష్ కుమార్ ఎంఎస్ సర్జరీ వరంగల్ వెల్లడించారు.

### సెల్యులైటిస్ అంటే ఏమిటి?

సెల్యులైటిస్ అనేది చర్మం లోపలి పొరలు మరియు మృదు కణజాలంలో బ్యాక్టీరియా వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్. సాధారణంగా చిన్న గాయం, పగిలిన చర్మం, పాదాల వేళ్ల మధ్య ఫంగస్, పురుగు కాటు లేదా దోమ కాటు తర్వాత గోకడం , ముల్లు గుచ్చుకున్న చోటబ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుంది.

### ఎవరికి ఎక్కువ ప్రమాదం

పొలాల్లో నీటిలో పనిచేసే రైతులు, మధుమేహ రోగులు, వృద్ధులు, కాళ్లలో వాపు ఉన్నవారు, వెరికోస్ వెయిన్స్ ఉన్నవారు, దీర్ఘకాలిక మూత్రపిండ, కాలేయ లేదా గుండె వ్యాధిగ్రస్తులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఎక్కువగా ప్రమాదముంటుంది.

### ముఖ్య లక్షణాలు

కాలు లేదా చేతిపై అకస్మాత్తుగా ఎర్రబడటం, తీవ్రమైన వాపు, నొప్పి, వేడిగా అనిపించడం, జ్వరం, వణుకు, చర్మం బిగుసుకుపోవడం, నడవడానికి ఇబ్బంది, కొన్నిసార్లు నీటి బుడగలు లేదా చీము రావడం వంటివి లక్షణాలుగా ఉంటాయి.

### ప్రమాద సంకేతాలు

చర్మం పై వేగంగా వ్యాపిస్తున్న ఎరుపు ధనం, అధిక జ్వరం, తీవ్రమైన నొప్పి,నల్లటి రంగులోకి మారుతున్న చర్మం,స్పృహ తగ్గడం, షుగర్ రోగిలో ఏ చిన్న పాద గాయం అయినా త్వరగా మానకపోవడం, ఇవి రక్తంలోకి ఇన్‌ఫెక్షన్ వ్యాపించే ప్రమాదానికి సంకేతాలు కావచ్చు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి.

### వర్షాకాలంలో ఎలా నివారించాలి

పొలాల్లో పని చేసే సమయంలో ప్రత్యేక బూట్లు లేదా రక్షణ కలిగిన పాదరక్షలు ధరించండి. పని ముగిసిన వెంటనే కాళ్లను శుభ్రమైన నీటితో కడిగి పూర్తిగా ఆరబెట్టండి. చిన్న గాయాన్ని కూడా నిర్లక్ష్యం చేయకండి. పాదాల వేళ్ల మధ్య ఫంగస్ ఉంటే వెంటనే చికిత్స చేయించుకోండి. షుగర్‌ను నియంత్రణలో ఉంచండి. ప్రతిరోజూ పాదాలను పరిశీలించండి. వైద్యుని సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడవద్దు.

### నకిలీ వైద్యులు లేదా ఆర్ ఏం పి ల వద్ద చికిత్స చేయించవద్దు

చాలామంది ప్రారంభంలో కేవలం వాపు లేదా ఎర్రదనం మాత్రమే ఉందని భావించి నకిలీ వైద్యులు లేదా అర్హత లేని వ్యక్తుల వద్ద చికిత్స తీసుకుంటారు. దీని వల్ల సరైన యాంటీబయాటిక్స్ ఆలస్యంగా ప్రారంభమవుతాయి. ఫలితంగా ఇన్‌ఫెక్షన్ వేగంగా వ్యాపించి పెద్ద శస్త్రచికిత్స అవసరం కావచ్చు. చీము తొలగించే ఆపరేషన్ చేయాల్సి రావచ్చు. చర్మం, కండరాలు దెబ్బతినవచ్చు. అవయవాన్ని తొలగించే పరిస్థితి రావచ్చు. ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు. అందువల్ల సెల్యులైటిస్ లక్షణాలు కనిపించిన వెంటనే అర్హత కలిగిన ఎంబీబీఎస్ లేదా స్పెషలిస్ట్ జనరల్ సర్జన్ వైద్యుడిని సంప్రదించాలి.

### గుర్తుంచుకోండి

"చిన్న గాయాన్ని నిర్లక్ష్యం చేస్తే పెద్ద సమస్యగా మారుతుంది." వర్షాకాలంలో రైతులు, మధుమేహ రోగులు కాళ్ల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఎర్రదనం, వాపు, నొప్పి లేదా జ్వరం కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని అర్హత కలిగిన వైద్యుడిని లేదా ప్రభుత్వ ఆసుపత్రి ని సంప్రదించండి. సరైన సమయంలో సరైన చికిత్సే నిర్లక్ష్యం చేయకుండా ఉంటే అవయవాన్ని, ప్రాణాన్ని కాపాడుతుంది.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 28(జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం జిల్లాలోని కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జూలై 24వ తేదీ వరకు జరగనున్న ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో సమర్థవంతంగా చేపట్టాలని, బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు, సూపర్వైజర్లు, వాలంటీర్లకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి సంబంధిత ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం అందించి బి ఎల్ ఓ యాప్ లో మార్కింగ్ చేసుకోవాలని, తిరిగి సంబంధిత ఓటరు నింపిన ఫారంలోని వివరాలను యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు చేపట్టే ప్రక్రియను సూపర్వైజర్లు పర్యవేక్షించాలని, వాలంటీర్లుగా వ్యవహరించే పంచాయితీ కార్యదర్శులు, వి వో ఏ లు, యువజన సంఘాలు, కుల పెద్దలు, గ్రామ పెద్దలు, చదువుకున్నవారు సహకరించాలని తెలిపారు. మరణించిన, గ్రామం వదిలి వెళ్ళిపోయిన, 2 అంతకంటే ఎక్కువ ఎపిక్ కార్డులు కలిగిన ఓటర్లను తొలగించాలని, అందరూ సమన్వయంతో పని చేసి జిల్లాలో సమగ్ర సవరణ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించి విజయవంతం చేసేలా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుకాసురుల ఆగడాలకు అడ్డుకట్టలేదు

- విచ్చల విడిగా డంపులు.. ప్రభుత్వ ఖజానాకు గండి



**సారంగాపూర్,జూన్28(జనం సాక్షి) :** ఎవరికీ అందిన కాడికి వాళ్లు దోచుకోవడమే అన్నట్టు సాగిపోతోంది. మండల పరిధిలోని సహజ వనరుల దోపిడి దందాను అడ్డుకునే నాథుడే లేకుండా పోయారని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ మొరం రవాణా, అలాగే మట్టి రవాణా విచ్చలవిడిగా పెరిగిపోతోంది. సారంగాపూర్ మండలంలోని వాగు నది పరివాహక ప్రాంతం కాలువ సమీపంలో అక్రమ దందాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇసుక సురులు మండలంలోని ఆలూరు బోరిగం బీరవెల్లి యాకర్ పెల్లి వంజర్ తాండ్ర ధోనిగశీ కాంకేట చించోలీ సారంగాపూర్ తో పాటు గ్రామాల నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా జోరుగా అక్రమ ఇసుక మొరం రవాణా దందా కొనసాగుతోంది. కాసులకు కక్కుర్తి పడి ఈ అక్రమ దందా రోజు రోజుకు పెరిగిపోతున్నట్టు సమాచారం. ఈ దందాతో ప్రభుత్వానికి భారీగానే నష్టం వాటిల్లుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టపగలే సహజ వనరులను దోచుకుంటున్నారు. అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. గత కొద్ది రోజులుగా ఇసుక దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంలా కొనసాగుతోంది.

ఎక్కువగా రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా వ్యవసాయ పొలాల్లో డంపింగ్ చేసి.. టిప్పర్ల ద్వారా పక్కనే ఉన్న మహారాష్ట్ర బోత్ తరలిస్తున్నారు. వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. కొంత మంది అధికారుల అండతో ఇసుక రవాణా జోరుగా సాగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్మిషన్ లేకున్నా మొరం ఇసుకను తరలిస్తున్నారని ప్రశ్నిస్తే.. అధికారుల అండదండలు ఉన్నాయని, ఇష్టం ఉన్నచోట చెప్పుకోండి అంటూ ఎదురు దాడికి దిగుతున్న సందర్భాలు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టపగలే అతివేగంతో ట్రాక్టర్లు రోడ్లపై ప్రయాణిస్తుంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇసుక దందాకు అధికారులు సహకరిస్తున్నారని ప్రజలు బాహటంగానే చర్చించుకుంటున్నారు. ఎవరైనా అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసిన అధికారులు, చూసీచూడట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇసుక రవాణాకు సహకరిస్తున్న అధికారులపై విచారణ చేసి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
29 జూన్ 2026

## చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 28 (జనం సాక్షి) :** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా చూడాలని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలు, మొబైల్ బృందాల సేవలను సద్వినియోగం చేసుకొని అర్హులైన చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎవ్షశ్రీ, మున్సిపల్ ఛైర్పర్సన్ ఉమారాణి,జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభకు స్థల పరిశీలన



**మిడ్జిల్, జూన్ 28 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సభ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. మండల కేంద్రం లోని ఇండియన్ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న స్థలాన్ని సీఎం సభాస్థలిగా ఎంపిక చేసే నేపథ్యంలో జిల్లా ఎస్పీ జానకి. డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం సీఎం హెలికాప్టర్ దిగే హెలిపాడ్ స్థలం, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను కూడా జిల్లా ఎస్పీ జానకి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు. అల్వాల్ రెడ్డి వెంకటయ్య, బాల్‌రెడ్డి, అనిల్, సాయి తదితరులతో కలిసి స్థలాల పరిస్థితులను పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు.సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

- అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి



**దేవరకొండ, జూన్ 28 (జనం సాక్షి) :** ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవరకొండ పట్టణంలో 11, 12 వార్డులలో నగర అభివృద్ధి నిధుల కింద కోటి 42 లక్షల 25 వేల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం చేపట్టామని తెలిపారు.గ్రామాలు మరియు పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. నాణ్యమైన ప్రమాణాలతో రోడ్ల నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. స్థానిక ప్రజలు కూడా అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.రహదారులు పూర్తయిన తర్వాత రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని, ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 28 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని 15వ వార్డు మున్సిపల్ పార్కులో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా భారీ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పార్కు ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తుకు భద్రత: పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత. నేడు మనం నాటే ప్రతి మొక్క, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తుంది. ఈ పచ్చదనం పండుగలో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు: వనిత రామ్మోహన్ (స్థానిక కౌన్సిలర్) నాగరాజు, అఖిల్ (ముఖ్య నాయకులు), వార్డు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పర్యవేక్షించిన అదనపు కలెక్టర్

**గద్వాల నడిగడ్డ, జూన్ 28 (జనం సాక్షి) :** ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ పత్రాలు అందించి,ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులను ఆదేశించారు.కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శనివారం గద్వాల మున్సిపాలిటీ 22,23 వార్డుల్లో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా అందజేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఫారాలను ఎలా పూరించాలో ఓటర్లకు స్పష్టంగా వివరించాలని చెప్పారు.ఫారాలు ఇచ్చేటప్పుడే ఓటర్ల అనుమానాలను బీఎల్ వోలు నివృత్తి చేయాలన్నారు. పంపిణీ చేసిన ఫారాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ జరిగిన పురోగతిని అదే



రోజు సంబంధిత యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.ఇంటింటి సర్వే సందర్భంగా బీఎల్ఓలతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా యూనిఫామ్, గుర్తింపు కార్డులు ధరించి విధులు నిర్వహించాలని తెలిపారు.2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకొని తప్పులు లేని సమగ్ర ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారిని ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేయించాలని, మరణించిన వారి పేర్లు, ద్వంద్వ నమోదులు, ఇతర సవరణల కోసం ఫారం-7 వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రతి ఇంటిని చేరుకొని ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజలకు చేరవేసి ప్రతి ఓటరు ఈ కార్యక్రమంలో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటి సర్వే సందర్భంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను స్వయంగా అందజేశారు. ఈ పరిశీలనలో అధికారులు, బీఎల్ఓలు,బీఎల్ఏలు పాల్గొన్నారు.

# అన్నదాతలకు అండగా ప్రజా ప్రభుత్వం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 28 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాహసోపేత నిర్ణయాలతో అన్నదాతలకు కొండంత అండగా నిలుస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో ఈనెల 30వ తేదీ మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న 'రైతు ఆశీర్వాద సభ' ఏర్పాట్లను ఆదివారం ఆయన వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్ర మోహన్, కమిషనర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించిన మంత్రి, భారీ వర్షాలు కురిసినా కార్యక్రమానికి ఎలాంటి అంతరాయం కలగకుండా జర్మన్ హ్యాంగర్లు, తగిన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను అత్యున్నత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూలి, వర్షాకాలం నేపథ్యంలో భారీ వర్షాల సూచనలు ఉన్నప్పటికీ ప్రభుత్వం అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టిందని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా రైతు ఆశీర్వాద సభ అనుకున్నదానికంటే మరింత ఘన విజయాన్ని సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారీ సంఖ్యలో రైతులు సభకు హాజరవుతారని, ఈ సభ రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ రైతు పక్షపాత ప్రభుత్వంగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తీసుకున్న సాహసోపేత నిర్ణయాల వల్ల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులను వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేసి ప్రభుత్వం రైతుల పట్ల తన నిబద్ధతను చాటుకుందని పేర్కొన్నారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల సమన్వయంతో, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం అందరూ కలిసి ఈ రైతు ఆశీర్వాద సభను రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విజయవంతమైన కార్యక్రమంగా నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందిరమ్మ రాజ్యం లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. కేవలం రెండేళ్లలోనే రికార్డు స్థాయిలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, త్వరలో మరిన్ని వేలాది ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు. కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## గంజాయి పట్టివేత



**భద్రాచలం, జూన్ 28 (జనంసాక్షి) :** భద్రాచలంలో ఆదివారం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు రూ.1,70,000 విలువ చేసే 1.300 కేజీల గంజాయిని పట్టుకున్నారు. కొల్లుగూడెం ఇసుక రీచ్ వద్ద ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ ఐ. సి హెచ్.శ్రీ హరి రావు, సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా వస్తున్న వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఓ వాహనంలో గంజాయి లభ్యమైంది. దీంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్‌కు చెందిన బలరామ్ లామా, ఉప్పల్‌కు చెందిన సుదీప్ కేసిలను అరెస్టు చేసి ఎక్సైజు స్టేషన్‌కు తరలించారు. అలాగే వీరి వద్ద రెండు సెల్‌ఫోన్లు, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇట్టి తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుల్స్? పి. రాజు, వెంకన్న, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్ లు పాల్గొన్నారు.

## సిరిపురంలో 'సిరి కన్స్ట్రక్షన్స్' ప్రారంభం

- యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేల పిలుపు



**రామన్నపేట, జూన్ 28 (జనంసాక్షి) :** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన "సిరి కన్స్ట్రక్షన్స్" ను ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి నూతన వ్యాపార సంస్థలు రావడం శుభపరిణామం. నిర్మాణ రంగంలో ఉన్న అవకాశాలను యువత ముందు లైన్‌లో ఉండి సద్వినియోగం చేసుకోవాలి. స్వయం ఉపాధి దిశగా అడుగులు వేసి ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, స్వయం ఉపాధి పథకాల ద్వారా అండగా నిలుస్తోంది. సిరి కన్స్ట్రక్షన్స్ లాంటి సంస్థలు స్థానిక యువతకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధికి తోడ్పడతాయి. యువకులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి అని సూచించారు. సిరి కన్స్ట్రక్షన్స్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యేలు అభినందించి, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నాణ్యమైన నిర్మాణ సామాగ్రి, సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, సిరిపురం గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**తలకొండపల్లి, జూన్ 28 (జనంసాక్షి) :** పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఖానాపూర్ సర్పంచ్ దుగ్గపురం అనిత శ్రీనివాస్ పేర్కొన్నారు.ఆదివారం తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ దుగ్గపురం అనిత శ్రీనివాస్ హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేసారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..పోలియో నిర్మూలన కోసం ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోలియో వ్యాక్సినేషన్ కీలక పాత్ర పోషిస్తుందని,దేశాన్ని పూర్తిస్థాయి పోలియో రహిత దేశంగా



నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని అన్నారు.ఐదేళ్లలోపు పిల్లలను తప్పకుండా సమీప పోలియో కేంద్రాలకు తీసుకువెళ్లి చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు ప్రమోద,ప్రియదర్శిని,ఎమ్ఎల్‌హెచ్‌పి సావిత్రి,అంగన్‌వాడీ టీచర్ నిర్మళ,ఆశాలు కవితా,రాణి,అంగన్‌వాడీ ఆయా భారతమ్మ తదితరులు ఉన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ కలయిక

- ఏడు పదులు వయస్సులో గత స్మృతులను గుర్తు చేసుకున్న వైనం

**బూర్గంపహాడ్, జూన్ 28 (జనంసాక్షి) :** స్నేహానికి హోదా, వయస్సు అడ్డుకాదనే చాటిచెప్పేలా సాగింది బూర్గంపహాడ్ జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ కలయిక. ఆదివారం బూర్గంపహాడ్ లోని జక్కుల పెద్ద బుచ్చయ్య మెమోరియల్ కళాశాలలో 1967. 68 సంవత్సర హైస్కూల్ బ్యాచ్ స్వర్ణోత్సవ కలయిక కనులపండుగగా సాగింది. ప్రముఖ వైద్యులు చెన్నం సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 70సంవత్సరాలు పైబడిన రిటైర్డ్ ఉద్యోగులు. ప్రముఖ లాయర్లు, వైద్యులు, రాజకీయ నాయకులు రైతులు, వ్యాపారస్తులతో పాటు జనజీవన ప్రవంతిలో కలసిన మాజీ నక్సలైట్లు తమ తమ హోదాలతో పాటు వయస్సుతో వచ్చే సమస్యలను పక్కనుపెట్టి ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్దేశ్ రాష్ట్రాలలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 60 మంది పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితులతో గత



స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు చిన్ననాటి స్నేహితులతో సరదాగా గడుపుతూ తమ కుటుంబ విషయాలతో పాటు తమ ప్రస్తుత జీవిస్తున్న తీరును పంచుకున్నారు. ఈ సందర్భంగా జక్కం గోపయ్య తో పాటు మృతి చెందిన తమ మిత్రులకు సంతాపం తెలియచేస్తూ రెండు నిమషాలు మౌనం పాటించారు. నిర్వాహకులు డాక్టర్ చెన్నం సత్యనారాయణను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చందా లింగయ్య దొర, బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలే సమాజ ప్రగతికి బలమైన పునాదులు

- టాస్క్ సిఓఓ రెడ్డి రాఘవేందర్ రెడ్డి

**వెల్దండ, జూన్ 28 (జనంసాక్షి) :** వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రులు, యువతతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానంగా విద్యా విధానం, నైపుణ్యాభివృద్ధి,ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు,యువత భవిష్యత్ కార్యాచరణ,వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై విద్యార్థులు, యువత, తల్లిదండ్రులతో ఆయన ప్రత్యక్షంగా ముఖాముఖి నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ..నేడు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని,అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామి కావాలని కోరారు.తమ పాఠశాలకు



సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అనునిత్యం సహకారం అందిస్తున్నారని,ప్రత్యేకంగా పాఠశాలకు ముగ్గురు విద్యా వాలంటీర్లను అందించడంతో పాటు,పాఠశాలకు కావలసిన మౌలిక వసతులను అందించి అన్ని రకాలుగా సహకారం అందిస్తున్నారని సుంకిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం సుంకిరెడ్డి మాట్లాడుతూ..తను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి నేడు ఈ స్థాయికి చేరుకున్నానని తెలుపుతూ,ప్రభుత్వ పాఠశాలలో చదివితే భవిష్యత్తు ఉండదనేది పూర్తిగా అపోహ మాత్రమే, ప్రభుత్వ బడిలో చదివిన విద్యార్థులు నేడు దేశంలో అత్యున్నత స్థానాల్లో సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అనునిత్యం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ రాజీవ్, వార్డ్ సభ్యులు పుష్పలత చంద్రశేఖర్ ,రమేష్, విజయ,శ్రీశైలం ,కృష్ణమ్మ, మాజీ ఉప సర్పంచ్ సింధుజ మల్లేష్,కొండల్ యాదవ్,గ్రామ పెద్దలు పెద్దయ్య ,ఒగ్గు వెంకటయ్య, లోడిగ తిరుపతయ్య బాలరాజ్, దొబ్బల బాలయ్య , బాబురావు, మోహన్,లోడిగ శ్రీశైలం యువ నాయకులు భరత్, శివ, పెరుమళ్ళ శ్రీశైలం,ఒగ్గు కొండల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ఐపీఓల సందడి

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఆందోళనకర పరిస్థితులు లేవు

- సమీక్షలో తేల్చేసిన రెండు స్వతంత్ర న్యాయ సంస్థలు
- అతాను చక్రవర్తి లేవనెత్తిన అంశాలకు ఆధారాల్లేవు




దిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పూర్వ ఛైర్మన్ అతాను చక్రవర్తి తన రాజీనామా లేఖలో, తదనంతర బహిరంగ ప్రకటనల్లో లేవనెత్తిన 'నైతిక అంశాల'పై ఆందోళనలను బలపరిచే ఆధారాలు లభించలేదని, రెండు బాహ్య న్యాయ సంస్థలు నిర్వహించిన స్వతంత్ర న్యాయ సమీక్షలో తేలిందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. మార్చి 24న ప్రకటించిన సమీక్షలో చక్రవర్తి లేవనెత్తిన అంశాలు రికార్డుల్లో కనిపిస్తున్నాయా? తన పదవీ కాలంలో ఆయన ఏవైనా భిన్నాభిప్రాయాలను నమోదు చేశారా? అటువంటి భిన్నాభిప్రాయాలు ఏవైనా ఉంటే వాటిని పరిష్కరించారా? అనే విషయాలను పరిశీలించినట్లు బ్యాంక్ తెలిపింది. నైతికపరమైన ఆందోళనలను కారణంగా చూపుతూ, దేశంలోనే రెండో అతి పెద్ద రుణదాత అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఛైర్మన్ పదవికి చక్రవర్తి రాజీనామా చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చరిత్రలో ఒక తాత్కాలిక ఛైర్మన్ పదవీకాలం మధ్యలో వైదొలగడం ఇదే తొలిసారి కావడంతో బ్యాంక్ పనితీరుపై ఆందోళనలకు దారి తీసింది. 'గత రెండేళ్లుగా బ్యాంకులో నేను గమనించిన కొన్ని పరిణామాలు, కార్యకలాపాలు నా వ్యక్తిగత విలువలు, నైతిక సూత్రాలకు అనుగుణంగా లేవు. నేను వైదొలగాలనే నిర్ణయానికి ఇందువల్లే వచ్చాను' అని మార్చి 17న తన రాజీనామా లేఖలో అతాను పేర్కొనడం చర్చనీయాంశమైంది. విల్సన్ సోన్సిని గుడ్‌రిచ్ అండ్ రోసాటి, పీసీ అండ్ వాడియా గాంధీ అండ్ కో సంస్థలు మూడు నెలలపాటు స్వతంత్ర న్యాయ సమీక్ష నిర్వహించి.. 'అతాను లేవనెత్తిన ఆందోళనలను బలపరిచేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని' తేల్చాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నియంత్రణ సంస్థలకు సమాచారమిచ్చింది.

## 11 ఇష్యూలు.. 9 లిస్టింగ్‌లు

ముంబయి: ప్రైమరీ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి వేగం పుంజుకొంది. భౌగోళిక ఉద్రిక్తతలు చల్లారిన నేపథ్యంలో ఒక్కొక్కటిగా ఐపీఓలకు వచ్చేందుకు కంపెనీలు ఉత్సాహం చూపిస్తున్నాయి. వచ్చే వారం మొత్తం 11 ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. ఇందులో రెండు మెయిన్‌బోర్డువి కాగా.. మిగిలినవి ఎస్ఎంఈ కేటగిరీకి చెందినవి. ఇప్పటికే సబ్‌స్క్రిప్షన్ పూర్తి చేసుకున్న మరో 9 కంపెనీలు వచ్చేవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి.

ఐపీఓకు వచ్చే కంపెనీలు ఇవే..

ఆస్త్రా స్పింటెక్స్ ఐపీఓ జూన్ 29న ప్రారంభమై జులై 1న ముగియనుంది. ధరల శ్రేణిని రూ.125-136గా కంపెనీ నిర్ణయించింది. రూ.170 కోట్లు ఐపీఓ ద్వారా సమీకరించనుంది.న్యాక్ ప్యాకేజింగ్ ఐపీఓ జులై 1 నుంచి జులై 3 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉండనుంది. ధరల శ్రేణిని రూ.161-170గా కంపెనీ నిర్ణయించింది. ఐపీఓ ద్వారా రూ.439.50 కోట్లు సమీకరించనుంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.380 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.59.50 కోట్లు సమీకరించనుంది.ట్వింకిల్ పేపర్స్, అడోన్ ఆగ్రో




కమోడిటీస్, క్రటికల్ టెక్ ఐపీఓ, తేజ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్, అథర్వ పాలీప్లాస్ట్, సీమ్యాక్స్ రిసోర్సెస్, సంపర్క్ ఇండియా లాజిస్టిక్స్, వినిత్ మొబైల్, ఐసీ ఎలక్ట్రికల్స్ ఎస్ఎంఈ కేటగిరీలో జూన్ 30 నుంచి జులై 2 మధ్య సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి.

**లిస్టింగ్స్ ఇవే..**

టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ జూన్ 29, వాటర్‌వేస్ లీజర్ టూరిజం ఐపీఓ, అద్వైత్ జువెల్స్ జులై 1న, సీఎస్ఎం టెక్నాలజీస్ జులై 2న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్టింగ్‌కు రానన్నాయి. రియాసత్ లైఫ్‌స్టైల్, అనుభవ్ ప్లాస్టో, శ్రీధర్ స్పిన్నర్స్, జివైల్ ఇండస్ట్రీస్, శ్రీ ప్రియాంక జియో కామెక్స్, క్రేజీ స్నాక్స్ ఐపీఓలు ఎస్ఎంఈ కేటగిరీలో వచ్చేవారం లిస్టింగ్‌కు రానున్నాయి.

## ప్రైమ్ డే సేల్..

### శాంసంగ్ గెలాక్సీ ఎస్25 అల్ట్రాపై బిగ్ డిస్కౌంట్

టెక్ ప్రియులను అలరించేందుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ భారీ డిస్కౌంట్‌లతో వస్తున్నాయి. జులై 4న ప్రారంభమయ్యే సేల్స్‌లో భాగంగా ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్ ఐఫోన్ 17 మోడల్స్‌పై ఆఫర్లు ప్రకటించగా.. తాజాగా అమెజాన్ కూడా డీల్స్‌ను ఒక్కొక్కటిగా రివీల్ చేస్తోంది. ఇందులో శాంసంగ్ గెలాక్సీ ఎస్25 అల్ట్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలిసారి ఈ స్మార్ట్‌ఫోన్‌ను డిస్కౌంట్ ధరకు విక్రయించ నున్నారు. లాంచ్ సమయంలో




దీని ధర రూ.1,29, 999గా ఉండగా.. ప్రస్తుతం రూ.99వేలకు విక్రయిస్తు న్నారు.మరోవైపు వన్‌ప్లస్ 13ను రూ.51,999 (బ్యాంక్ ఆఫర్‌తో), నథింగ్ ఫోన్ (3)ను రూ.40,999కు విక్రయించనున్నట్లు అమెజాన్ తన పేజీలో పేర్కొంది. బడ్జెట్, మిడ్ రేంజ్, ప్రీమియం, అల్ట్రా ప్రీమియం సెగ్మెంట్లలో మరిన్ని స్మార్ట్‌ఫోన్లపై ఆఫర్లను వెల్లడించాల్సి ఉంది. సేల్‌లో భాగంగా జూన్ 29న శాంసంగ్ ఎం47, జూన్ 30న వన్‌ప్లస్ ఎన్6 5జీ స్మార్ట్‌పోన్లను లాంచ్ చేయనున్నారు. అమెజాన్ ప్రైమ్ యూజర్ల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ సేల్‌లో ఎలక్ట్రానిక్స్, యాక్సెసరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు ఉండనుందని అమెజాన్ తెలిపింది. హోమ్ అప్లికేషన్స్, స్మార్ట్ టీవీ, ప్రొజెక్టర్లపైనా డిస్కౌంట్లు ఉండనున్నాయని పేర్కొంది.

## ఫ్లిప్‌కార్ట్ 'గోట్‌సేల్'..

ఐఫోన్ 17 సిరీస్‌పై భారీ డిస్కౌంట్స్

ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ 'గోట్ సేల్' జులై 4న ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఐఫోన్‌లపై భారీ ఆఫర్లను ప్రకటించింది. ఐఫోన్ కొనుగోలు చేయాలనుకునే యూజర్లకు ఇది బంపర్ ఆఫర్‌గా మారనుంది. ఐఫోన్17 పై రూ.12 వేలు, ప్రో మోడల్స్‌పై రూ.22 వేల వరకు డిస్కౌంట్‌లను ఇస్తోంది. మెమొరీ చిప్ కొరత వల్ల రానున్న రోజుల్లో ఐఫోన్ ధరలు పెరిగే అవకాశం ఉన్నందున..ఈ సేల్ మంచి అవకాశం.ఆఫర్‌లో భాగంగా.. ఐఫోన్ 17 రూ.82,900 ధరతో లాంచ్ అవ్వగా.. సేల్‌లో భాగంగా రూ.70,990కే పొందొచ్చు. అంటే రూ.12 వేల డిస్కౌంట్. ఐఫోన్ 17 ప్రో ధర రూ.1,34,900 నుంచి ప్రారంభమవ్వగా.. సేల్‌లో రూ.1,12,900కు లభిస్తుంది. గరిష్ఠంగా రూ.22 వేల డిస్కౌంట్‌తో వస్తోంది.ఈ సేల్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ఐఫోన్ 17 ప్రో మాక్స్. రూ.22 వేల




డిస్కౌంట్‌తో రూ.1,27,900కు సొంతం చేసుకోవచ్చు.ఐఫోన్ 17ఈ ధర రూ.60,900, ఐఫోన్ ఎయిర్ ధర రూ.95,900, ఐఫోన్ 16 ధర రూ.59,900, ఐఫోన్ 16 ప్లస్ ధర రూ.73,900, ఐఫోన్ 16ఇ ధర రూ.55,900, ఐఫోన్ 15 ధర రూ.49,900 నుంచి ప్రారంభం కానున్నాయి.అదనంగా బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ బోనస్, నో-కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ల ద్వారా ఐఫోన్ ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్ఎస్‌బీసీ క్రెడిట్ కార్డు హోల్డర్స్‌కు 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభించనుంది.కొత్తగా ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్‌కార్డు తీసుకునేవారికి రూ.3 వేల వెల్‌కమ్ వోచర్లు లభిస్తాయి. ప్లస్ లేదా బ్లాక్ మెంబర్స్‌కు 24 గంటల ముందే (జులై 3) గోట్ సేల్ ఎర్లీ యాక్సెస్ పొందవచ్చు.




## ప్రధాన విమానాశ్రయాల్లో ముఖ గుర్తింపు డేటా ఏకీకృతం

**దిల్లీలో డేటా ఫ్యూజన్ సెంటర్.. కేంద్ర హోం శాఖ పరిశీలనలో ప్రతిపాదన**

**దిల్లీ:** దేశంలోని ప్రధాన విమానాశ్రయాల నుంచి ముఖ గుర్తింపు డేటాను ఏకీకృతం చేసే 'డేటా ఫ్యూజన్ సెంటర్'ను దిల్లీలో ఏర్పాటు చేయడానికి సెంట్రల్



ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) యోచిస్తోందని సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ రంజన్ తెలిపారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉందన్నారు. 'దిల్లీలో ఒక డేటా ఫ్యూజన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. దీని కింద ప్రధాన విమానాశ్రయాల్లోని ముఖ గుర్తింపు వ్యవస్థలను అనుసంధానించాలనేది ప్రణాళిక. ఈ ప్రతిపాదన ప్రస్తుతం హోం శాఖ పరిశీలనలో ఉంది. అలాగే సీఐఎస్ఎస్ భద్రతా కవచం కింద ఉన్న యూనిట్లలో ఏర్పాటు చేసిన సుమారు 1.5 లక్షల సీసీటీవీలను కూడా రాబోయే రోజుల్లో అనుసంధానించాలనుకుంటున్నట్లు' ప్రవీణ్ వివరించారు. తమ భద్రతా పరిధిలో ఉన్న అత్యంత కీలకమైన కేంద్రాల వద్ద ఒక సమగ్ర కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఐఎస్ఎఫ్ తన భద్రతా పరిధిలో మొత్తం 359 యూనిట్లను కలిగి ఉంది. వీటిలో ఏరోస్పేస్, అణు, విద్యుత్ కేంద్రాలతో పాటు 72 పౌర విమానాశ్రయాలు కూడా ఉన్నాయి.

# ఏఐ పెట్టుబడులపై లాభాల వర్షం

### అంకురాల్లో రూ.4,900 కోట్లు పెడితే రూ.41,300 కోట్ల ప్రతిఫలం

దిల్లీ: దేశంలో కృత్రిమ మేధ, డీప్‌టెక్ రంగాలు ఊపందుకోకముందే సంబంధిత సంస్థల్లో చేసిన ముందస్తు పెట్టుబడులు, ఇప్పుడు ఇన్ఫోఎడ్జ్ సంస్థకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. 2020 నుంచి ఈ రంగాల్లోని 54 కంపెనీల్లో పెట్టిన రూ.1,000 కోట్లకు పైగా పెట్టుబడులు ఇన్ఫోఎడ్జ్‌కు మంచి లాభాలు తెచ్చిపెడుతున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, వైస్ ఛైర్మన్ సంజీవ్ బిక్‌చందానీ వాటాదార్లకు తెలిపారు. 28 ఏఐ స్టార్టప్‌ల్లో కంపెనీ రూ.614 కోట్ల పెట్టుబడులు పెట్టగా.. ఇప్పుడు ఆ విలువ రూ.1,268 కోట్లకు చేరింది. అంటే పెట్టిన పెట్టుబడికి 2.1 రెట్ల లాభం, 31% అంతర్గత రాబడి రేటు (ఐఆర్ఆర్) నమోదైంది. ఆఫ్టర్‌షూట్, అటెంటివ్ ఏఐ, జ్ఞాని.ఏఐ, లుమిక్, పాస్కల్ ఏఐ, షిప్సీ వంటి 15 కంపెనీలు పీక్ ఎక్స్‌వీ, వర్టెక్స్ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి తదుపరి నిధులు సమీకరించాయి. వాయిస్ ఏఐ స్టార్టప్ సంస్థ జ్ఞాని.ఏఐ, ఇండియా ఏఐ






మిషన్ కింద ఎంపికైంది. సార్వభౌమ ఏఐ మోడళ్లు నిర్మించడానికి ఈ సంస్థ రూ.177 కోట్ల విలువైన ప్రభుత్వ ఏఐ కంప్యూట్ క్రెడిట్‌లను దక్కించుకుంది. రోబోటిక్స్, సెమీకండక్టర్స్, బయోటెక్నాలజీ, స్పేస్‌టెక్, డిఫెన్స్, ఇ-మొబిలిటీ వంటి 30 డీప్‌టెక్ కంపెనీల్లో ఇన్ఫోఎడ్జ్ రూ.455 కోట్ల పెట్టుబడులు పెట్టగా, ప్రస్తుతం వాటి విలువ రూ.559 కోట్లకు చేరింది. ఇందులో అన్‌బాక్స్ రోబోటిక్స్, ఇప్లేన్, మనస్తు స్పేస్, భారత్ సెమీ, క్లీన్ ఎలక్ట్రిక్ వంటి సంస్థలు ఉన్నాయి. ఇన్ఫోఎడ్జ్‌కు అత్యధిక లాభాలను తెచ్చిపెట్టింది కన్జ్యూమర్ టెక్నాలజీ విభాగమే. ఇందులో 45 కంపెనీల్లో పెట్టిన రూ.2,755 కోట్ల పెట్టుబడి, ఇప్పుడు ఏకంగా రూ.37,214 కోట్లకు చేరింది. అంటే పెట్టిన పెట్టుబడిపై కంపెనీ 13.5 రెట్ల ప్రతిఫలం లభించింది. ఇందులో ఎటర్నల్, పీబీ ఫిన్‌టెక్, బ్లూస్టోన్, ఇక్సిగో, ట్రూమెడ్స్, వేక్‌ఫిక్ వంటి సంస్థలు ఉన్నాయి. మొత్తంగా ఇన్ఫోఎడ్జ్ 135 అంకురాల్లో పెట్టిన రూ.4,900 కోట్ల పెట్టుబడుల విలువ ఇప్పుడు రూ.41,300 కోట్లకు (8.3 రెట్ల లాభం) చేరింది.

## చైనా పర్మిట్ లేక చిక్కుకుపోయి

**మానస్ సరోవర్ యాత్ర వేళ కేంద్రం అడ్వైజరీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రైవేటు టూర్ ఆపరేటర్లపై ఆధారపడి కైలాస్-మానస్ సరోవర్ యాత్రకు వెళ్తున్న భారతీయ పౌరులను ఉద్దేశించి విదేశాంగ శాఖ అడ్వైజరీ చేసింది. ఈ మొత్తం ప్రయాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన అన్ని పత్రాలు పొందిన తర్వాతే భారత్ నుంచి బయల్దేరాలని సూచించింది. చైనాలోకి ప్రవేశించడానికి అవసరమైన పర్మిట్, వీసాలు లేకుండా.. ప్రైవేటు టూర్ ఆపరేటర్లను నమ్మి వెళ్లి.. పలువురు భారతీయ యాత్రికులు నేపాల్‌లో చిక్కుకుపోయారు. సహాయం చేయాలంటూ వారి నుంచి అభ్యర్థనలు వచ్చిన నేపథ్యంలో కేంద్రం నుంచి స్పందన వచ్చింది. యాత్ర ప్రారంభించడానికి ముందు టూర్ ఆపరేటర్ వివరాలను ధ్రువీకరించుకోవాలని సూచించింది. నేపాల్‌లో చిక్కుకున్న భారతీయ యాత్రికులకు సహాయం చేయాలంటూ ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే కేంద్రాన్ని.. నేపాల్, చైనాలోని భారత ఎంబసీలను ఎక్స్ వేదికగా కోరారు. 52 మంది భారత పౌరులు చిక్కుకున్నారని ఆమె చెప్పారు. ఈ క్రమంలోనే కేంద్రం స్పందించింది. కరోనాతో ఐదు సంవత్సరాలు ఈ యాత్రకు అంతరాయం ఏర్పడగా.. గత ఏడాదే పునఃప్రారంభమైంది. ఈ ఏడాది జూన్ 20న తొలిబ్యాచ్ నాథులా పాస్ మీదుగా చైనాలోకి ప్రవేశించింది.



## 3 ఏళ్లలోనే పసిడి రుణాలు మూడింతలు

**రూ.6.3 లక్షల కోట్ల నుంచి రూ.19.4 లక్షల కోట్లకు**

**ప్రైవేటు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వాటా పెరుగుతోంది.. ఎక్స్‌పీరియన్ నివేదిక**

దేశంలో పసిడి తనఖాపై తీసుకుంటున్న రుణాల విలువ ఈ ఏడాది మార్చి చివరకు దాదాపు రూ.20 లక్షల కోట్లకు చేరినట్లు అంతర్జాతీయ డేటా, టెక్నాలజీ కంపెనీ ఎక్స్‌పీరియన్ రూపొందించిన నివేదిక తెలిపింది. పసిడి ధరలు పెరగడం, ఆభరణాల తనఖాపై ఎక్కువ మొత్తం రుణంగా తీసుకోవడం పెరగడమే ఇందుకు కారణమని విశ్లేషించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరకు పసిడి తనఖా రుణాల విలువ రూ.19.4 లక్షల కోట్లకు చేరింది. 2022-23 చివరిలో ఈ రుణాల విలువ రూ.6.3 లక్షల కోట్లే. అంటే మూడేళ్లలోనే పసిడి రుణాల విలువ 3 రెట్లు పెరిగింది. ఈ కాలంలో బంగారం ధర కూడా 144% పెరిగింది. ఇదే సమయంలో ఒక రుణ ఖాతా సగటు రూ.98,000 నుంచి రూ.1.96 లక్షలకు చేరింది. పసిడి రుణాల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే ప్రైవేటు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల వైపు వెళ్లే వారి సంఖ్య పెరుగుతోందని నివేదిక తెలిపింది. 'గోల్డ్ లోన్స్ ఇన్ ట్రాన్సిషన్: మార్కెట్ ఎవల్యూషన్ అండ్ కన్జ్యూమర్ ప్యాటర్న్స్' పేరుతో విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. పసిడి ఆభరణాలు తనఖా పెట్టి, కావాల్సిన



మొత్తాలు తీసుకునేందుకు సమీపంలోని ఆర్థిక సంస్థలను వినియోగదారులు ఆశ్రయిస్తుంటారు. ఇప్పటికీ ఈ విభాగంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలకంగానే ఉన్నా.. ప్రైవేటు సంస్థల వాటా పెరుగుతోంది. ప్రైవేటు సంస్థలు తమ శాఖలను 'రుణాలు అవసరమైన ప్రాంతాలకు' విస్తరిస్తుండటం, మంజూరుకు తక్కువ సమయాన్ని తీసుకోవడం ఆకర్షిస్తున్నట్లు నివేదిక తెలిపింది.

రుణ విలువ ఆధారంగా..

పసిడి రుణాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా 2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో 37 శాతంగా నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది 45% కావడం గమనార్హం.. ఇదే సమయంలో ఎన్‌బీఎఫ్‌సీల వాటా 33% నుంచి 44 శాతానికి చేరడం గమనార్హం. ఎన్‌బీఎఫ్‌సీలు పసిడి రుణ విభాగంలో కొన్ని త్రైమాసికాలుగా మార్కెట్ వాటా పెంచుకుంటున్నాయి. 2025-26 నాలుగో త్రైమాసికం నాటికి రుణాల జారీలో ప్రభుత్వ రంగ బ్యాంకులను అధిగమించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రాధాన్యతా రంగ పసిడి రుణాల (పీఎస్‌జీఎల్) మార్కెట్‌లో మాత్రం ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. 2025-26 నాలుగో త్రైమాసికంలో సుమారు 88% మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి. 2025-26లో వాటి పసిడి రుణాల విలువకు పీఎస్‌జీఎల్ సుమారు 42% వాటా అందించింది.

టెలికాం రంగంలో పాత లైసెన్సింగ్ విధానం నుంచి కొత్త ఆథరైజేషన్ (అనుమతి) ఆధారిత విధానానికి మారేలా నిబంధనలను ప్రభుత్వం ప్రకటించింది. టెలికాం చట్టంలోని నిబంధనలను డిజిటల్‌గా అమలు చేసేందుకు 'టెలికాం ఇ-సర్వీసెస్ పోర్టల్'ను కూడా కేంద్రం నోటిఫై చేసింది. టెలికాం చట్టం కింద నిబంధనలను నోటిఫై చేశారు. వీటిలో టెలికమ్యూనికేషన్స్ (ప్రధాన టెలికమ్యూనికేషన్ సేవలను అందించడానికి అధికారం) నియమాలు-2025 ఉన్నాయి. ఇవి సంస్థలను పాత లైసెన్స్ విధానం నుంచి కొత్త అనుమతి ఆధారిత ఫ్రేమ్‌వర్క్‌కు సమర్థంగా మారుస్తాయి. ప్రస్తుతం యూనిఫైడ్ లైసెన్స్, యూఏఎస్ఎల్, ఐఎస్‌పీ, ఎన్ఎల్‌డీ, ఐఎల్‌డీ లైసెన్స్‌లు కలిగిన వారు కొత్త విధానానికి మారొచ్చు.

## కేంద్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం!

అవి మర్యాదపూర్వక భేటీలు అని చెబుతున్నప్పటికీ మంత్రివర్గ మార్పులపై చర్చ జరిగినట్లు భావిస్తున్నారు. సాధారణంగా జులై మూడోవారంలో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతాయి. దీంతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కూడా జులైలో జరిగే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ బిజీ షెడ్యూల్ ఆధారంగా కేబినెట్ విస్తరణ తేదీని ఖరారు చేయనున్నారు.

**యువ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం**

బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో కొత్త టీమ్‌ను ప్రకటించే సమయంలోనే కేంద్ర మంత్రివర్గంలోనూ మార్పులు ఉంటాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. యువ నేతలకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. కొందరు మంత్రులకు పార్టీ బాధ్యతలు అప్పగించటంతోపాటు అలాగే పార్టీ బాధ్యతలు చూస్తున్న కొందరిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయని సమాచారం. గతవారం కొందరు కేంద్ర సహాయమంత్రులతో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ చర్చలు జరిపారు. ఇప్పటికే ఇద్దరు కేంద్రమంత్రులు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రాకు ఉత్తర్‌ప్రదేశ్, దిల్లీ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు.

వారు కేంద్ర మంత్రి పదవుల నుంచి తప్పుకునే అవకాశం

ఇక, బీజేపీలో 'ఒక వ్యక్తికి ఒకే పదవి' నిబంధన ఉన్నందున వారు కేంద్ర మంత్రి పదవుల నుంచి తప్పుకునే అవకాశం ఉంది. కేంద్ర మంత్రులు జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టులను బీజేపీ రాజ్యసభకు తిరిగి నామినేట్ చేయలేదు. వారి పదవీకాలం జూన్ 21తో ముగిసింది. జార్జ్ కురియన్ ఇప్పటికే తన పదవికి రాజీనామా చేయగా, బిట్టు కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది జరిగే పంజాబ్ ఎన్నికలపై దృష్టి సారించాలని ఆయనకు సూచించనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఆ రాష్ట్రాలకు మోదీ కేబినెట్‌లో ఎక్కువ ప్రాధాన్యం కల్పించే అవకాశం ఉంది.

**బంగాల్‌లో ఎంపీలకు మంత్రివర్గంలో అవకాశం!**

బంగాల్‌లో బీజేపీ ఘనవిజయం సాధించినందున అక్కడి ఎంపీలకు మంత్రివర్గంలో అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. అలాగే తృణమూల్ కాంగ్రెస్, శివసేన-యూబీటీ రెబల్ ఎంపీలకు కూడా స్థానం కల్పించవచ్చని సమాచారం. షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన యూబీటీ రెబల్ ఎంపీల్లో ఒకరికి క్యాబినెట్ హోదా దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపీల్లో ఒకరిద్దరికి కూడా కేబినెట్ చోటు దక్కే సూచనలున్నాయి. అయితే, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై అనర్హత వేటువేయాలని ఆయా పార్టీలు కోరుతున్నందున లోక్‌సభ స్పీకర్ తీసుకునే నిర్ణయంపై వారి మంత్రి పదవులు ఆధారపడి ఉంటాయి.అలాగే కొందరు మంత్రుల శాఖలు మారే అవకాశం ఉందని తెలుస్తోంది. 'నీట్' పేపర్ లీక్, అబాఇ డిజిటల్ మార్కింగ్ విధానంలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆయనను పూర్తిగా కేబినెట్ నుంచి తప్పిస్తారా లేక వేరే శాఖకు మారుస్తారా అనేది కొన్నిరోజుల్లో తేలే అవకాశముంది. కేంద్ర మంత్రులు హర్దీప్ పురి, ః.ఒ.వర్మ పదవీకాలం నవంబర్‌లో ముగియనుండగా వారి విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. కొన్ని నెలల్లో కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ గవర్నర్లు థావర్ చంద్ గెహ్లాట్, మంగుభాయ్ పటేల్, లెఫ్టినెంట్ జనరల్ గురుమీత్ సింగ్ పదవీకాలం ముగియనుంది. దీంతో మంత్రివర్గం నుంచి తప్పుకోనున్న కొందరిని గవర్నర్లుగా నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## నిరాధార ఆరోపణలు మానుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలి

ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఇతర దేశాలపై వేలెత్తి చూపే బదులు, పాకిస్థాన్ తన భూభాగంలో పెరిగిపోతున్న ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.మీడియా ప్రశ్నలకు స్పందించిన రణధీర్ జైస్వాల్, కరాచీ ఘటనకు సంబంధించి భారత్‌పై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు. వాటిని భారత్ పూర్తిగా తిరస్కరిస్తోందని స్పష్టం చేశారు. ఇతరులపై నిందలు వేయడం కంటే పాకిస్థాన్ తనలో తాను ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తమ భూభాగంలో ఉన్న ఉగ్రవాద స్థావరాలను నిర్మూలించేందుకు విశ్వసనీయ చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంలో భాగంగా ఉపయోగించే ధోరణిని విడనాడాలని వ్యాఖ్యానించారు.ఇదిలా ఉండగా, శనివారం రాత్రి కరాచీలోని సింధ్ రేంజర్స్ భిట్టాయ్ వింగ్ ప్రధాన కార్యాలయంపై భారీ ఉగ్రదాడి జరిగింది. రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో ఆయుధాలతో వచ్చిన ఉగ్రవాదులు వాహనాన్ని ప్రధాన గేటుకు ఢీకొట్టి బలవంతంగా లోపలికి ప్రవేశించారు. అనంతరం గ్రెనేడ్లు విసురుతూ కాల్పులకు తెగబడ్డారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉగ్రవాదుల దాడికి రేంజర్స్ సిబ్బంది వెంటనే ప్రతిదాడి ప్రారంభించారు. అనంతరం స్పెషల్ సెక్యూరిటీ యూనిట్ (ఎస్ఎస్‌యూ), యాంటీ టెర్రరిస్ట్ ఫోర్స్ (ఏటీఎఫ్) కమాండోలు రంగంలోకి దిగడంతో సుమారు 90 నిమిషాల పాటు ఎదురుకాల్పులు కొనసాగాయి. ఈ ఆపరేషన్‌లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మరో గాయపడిన ఉగ్రవాదిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి.అయితే ఈ దాడిలో సింధ్ రేంజర్స్‌కు చెందిన నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఘటన అనంతరం ఆ ప్రాంతాన్ని భద్రతా బలగాలు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. కాల్పుల సమయంలో సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. ప్రజలను ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. ఈ దాడికి నిషేధిత తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ)కి చెందిన జమాత్-ఉల్-అహ్రార్ అనే ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించినట్లు ప్రకటించింది. ఈ సంస్థ ప్రధానంగా పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తూ భద్రతా బలగాలు, ప్రభుత్వ సంస్థలు, పౌరులపై దాడులకు పాల్పడుతోంది.



- పోస్టింగ్ కోసం జిల్లా స్థాయిలో పైరవీలు
- విధులకు రాకున్నా హాజరు నమోదు చేస్తున్నారా
- లెంకలపల్లి గ్రామస్తుల ఆరోపణలు



# విధులకు డుమ్మా కొడుతున్న పంచాయతీ కార్యదర్శి

## చుట్టాన్ని ఏరి కోరి తెచ్చుకున్న అధికారి

మర్రిగూడ, జూన్ 27 (జనం సాక్షి):
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శి తరచూ డ్యూటీలకు గైర్హాజరవుతున్నా హాజరు పట్టికల్లో మాత్రం క్రమం తప్పకుండా హాజరైనట్లు నమోదు అవుతున్నారనే ఆరోపణలు గ్రామస్థుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.
గ్రామపంచాయతీ కార్యాలయానికి ప్రజలు వివిధ పనుల నిమిత్తం వచ్చినప్పుడు కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనన మరణ ధృవపత్రాలు, పన్నుల చెల్లింపులు, పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనుల పర్యవేక్షణ వంటి ముఖ్యమైన పనులు ప్రభావితమవుతున్నాయని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, సదరు కార్యదర్శిని ప్రత్యేకంగా లెంకలపల్లి గ్రామానికి నియమించేందుకు జిల్లా స్థాయిలో విస్తృతంగా పైరవీలు జరిగినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఒక మండల స్థాయి అధికారి తన సన్నిహిత బంధువైన కార్యదర్శిని ఈ గ్రామానికి తీసుకురావడానికి జిల్లా స్థాయి అధికారులను ఆశ్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఒక జిల్లా స్థాయి అధికారి కూడా కీలక పాత్ర పోషించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.
విధులకు హాజరు కాకపోయినా హాజరు నమోదు కావడం వెనుక ఉన్నతాధికారుల సహకారం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బయోమెట్రిక్ హాజరు, కార్యాలయ సందర్శన రిజిస్టర్లు, విధుల నిర్వహణ వివరాలను సమగ్రంగా పరిశీలిస్తే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, గ్రామపంచాయతీ కార్యదర్శి నియామక ప్రక్రియ, విధుల నిర్వహణ, హాజరు రికార్డులపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో అలసత్వం?

- సర్ వదిలి పల్స్ పోలియో వేసిన బిఎల్ఓలు
- ఇల్లు ఇల్లు తిరగకుండానే కార్యాలయాల్లో విధుల్లో ఫారాలను అందజేస్తున్న వైనం



ధారూర్ జూన్ 28(జనంసాక్షి) :
మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో కొందరు అధికారులు.కొంత మంది సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఇంటింటికీ వెళ్లి ఫారాలను అందజేసి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా సేకరించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కొన్ని చోట్ల నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎస్ఐఆర్ విధులను పక్కనపెట్టి పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న కొందరు బీఎల్ఓలు ఎన్యుమరేషన్ పనులకు పూర్తి సమయం కేటాయించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యే అవకాశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అలాగే ఆదివారం సర్ విధుల్లో కొందరు సిబ్బంది హాజరు కాకపోవడం వల్ల పనుల పురోగతి మందగించిందనీ సమాచారం.బాధ్యతల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాల్సిన ఎన్యుమరేషన్ ఫారాలను కొన్ని ప్రాంతాల్లో కార్యాలయాల నుంచే అందజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజల వద్దకే చేరాల్సిన సేవలను కార్యాలయాలకే పరిమితం చేయడం వల్ల వృద్ధులు. దివ్యాంగులు.దూర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాట్లు తెలుస్తుంది.ఎన్నికల సంఘం ఉద్దేశించిన పారదర్శకత. సమగ్రతకు విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫారాల పంపిణీ వివరాల సేకరణలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో కూడా లోపాలు ఉన్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా ఉంటే ఇటువంటి పరిస్థితులు తగ్గే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం ధారూర్ మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి ఇంటికి ఫారాలు చేరేలా చూడాలని ఓటరు వివరాలు నమోదు అయ్యేలా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# గ్రేటర్ ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి

**భాజపా జాతీయ అధ్యక్షులు నితిన్ నబీ**

రాజేంద్రనగర్,జూన్28(జనం సాక్షి) :
గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేసి విజయాన్ని సాధించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ పిలుపునిచ్చారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 300 డివిజన్ల బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ-2ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రేటర్‌లో విజయం సాధిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ గెలుపు ఖాయమని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘమే నిర్వహిస్తోందని, దీనికి కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎన్. రామచంద్రరావు, డాక్టర్ కె. లక్ష్మణ్, డి.కె. అరుణ పాల్గొనగా, గోల్కొండ గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి వై. శ్రీధర్ జాతీయ అధ్యక్షుడిని సన్మానించారు.

# పెద్దేముల్ రోడ్ల అభివృద్ధికి రూ.185 కోట్ల మంజూరు

- హెచ్‌ఏఎం విధానంలో నాలుగు ప్రధాన రహదారుల అభివృద్ధి
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషి ఫలితమేనన్న కాంగ్రెస్ నేత మైపాల్‌రెడ్డి
- 15 ఏళ్ల నిర్వహణ బాధ్యతతో నాణ్యమైన రోడ్ల నిర్మాణం

పెద్దేముల్, జూన్ 28 (జనం సాక్షి):
తాండూర్ నియోజకవర్గంలోని పెద్దేముల్ మండల రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.185 కోట్ల నిధులను మంజూరు చేసింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్‌ఏఎం) విధానంలో మండలంలోని నాలుగు ప్రధాన రహదారులను ఆధునీకీకరించేందుకు ఈ నిధులు కేటాయించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి. మైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నిధుల మంజూరుకు ప్రత్యేక కృషి చేసిన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి, అలాగే నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
మండలంలో ఎన్నో ఏళ్లుగా దెబ్బతిన్న రహదారులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, తాజా మంజూరుతో వాటికి శాశ్వత పరిష్కారం లభించనుందని పేర్కొన్నారు. మారేపల్లి-మదనంతాపూర్ రహదారికి రూ.35.71 కోట్లు, ఇందూర్, రుద్రారం, నాగులపల్లి, గోపాలపూర్ మీదుగా బుద్ధారం వరకు రహదారికి రూ.41.20 కోట్లు, తాండూర్-తొరమామిడి రహదారికి రూ.33.14 కోట్లు, తాండూర్-పెద్దేముల్ మీదుగా కోట్‌పల్లి వరకు రహదారికి రూ.74.71 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు.
ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మండల రహదారుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం వల్లే ఈ నిధులు మంజూరయ్యాయని మైపాల్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్ల అభివృద్ధికి ఇప్పుడు మార్గం సుగమమైందని, ఇది పెద్దేముల్ మండల ప్రజల విజయమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకున్నారని, మండల ప్రజల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో రోడ్ల నిర్మాణం పూర్తయితే మండల రూపురేఖలు మారిపోతాయని, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించగలరని, విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా వేగంగా చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.
హెచ్‌ఏఎం విధానంలో నిర్మించే ఈ రహదారుల నిర్వహణ బాధ్యతను కాంట్రాక్టర్లు 15 సంవత్సరాల పాటు చేపట్టాల్సి ఉంటుందని, దీంతో నాణ్యతలో రాజీ ఉండదని అధికారులు భావిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు మైపాల్‌రెడ్డి వెల్లడించారు.

# గ్రామీణ రవాణా అభివృద్ధికి చారిత్రక అడుగు

- రూ.289 కోట్లతో అభివృద్ధి బాటలో తాండూరు నియోజకవర్గం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కృషికి ఫలితం



తాండూరు జూన్ 28(జనంసాక్షి) : తెలంగాణ రవాణా రంగ చరిత్రలోనే సరికొత్త మైలురాయిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండలో శంకుస్థాపన చేయనున్న 13,541 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా రూ.19,300 కోట్ల భారీ ప్రాజెక్టు రూపు దిద్దుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా తాండూరు నియోజకవర్గం కూడా అభివృద్ధి బాట పట్టింది. హెచ్ఏయం మాడల్ విధానంలో వికారాబాద్ జిల్లాకు రూ.520 కోట్ల నిధులు కేటాయించగా, అందులో సింహభాగంగా రూ. 289 కోట్ల భారీ నిధులు ఒక్క తాండూరు నియోజకవర్గానికే లభించడం గర్వకారణం.ఈ రూ.289 కోట్ల నిధులతో తాండూరు-పెద్దేముల్, పెద్దేముల్-కోట్‌పల్లి, లక్ష్మీనారాయణ పూర్-దేవనూర్, కమాల్‌పూర్-రాస్తం వంటి కీలక రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరగనున్నాయి. అలాగే వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొ ంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారంగా యాలాల మండలం కోకట్ వద్ద హై లెవల్ వంతెన నిర్మాణం కూడా చేపట్టనున్నారు.ఈ అభివృద్ధి పనులతో తాండూరు నియోజకవర్గ రవాణా వ్యవస్థ పూర్తిగా మారిపోనుందని, ప్రజల కష్టాలు శాశ్వతంగా తగ్గుతా యని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తాండూరు అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

*కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బాచుపల్లిలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ బాచుపల్లి డివిజన్ అధ్యక్షుడు వంగపల్లి నవీన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ పై ఆదివారం 5కె రణ్ చేపట్టి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై5 కె రన్ ప్రారంభించారు డ్రగ్స్ అవేర్నెస్‌లో భాగంగా నిర్వహించిన డ్రగ్స్ చేపట్ట వద్దంటూ నినాదాలతో హోరెత్తించారు.*

# రహదారులకు మహర్దశ-రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

- కల్వకుర్తి అభివృద్ధికి హ్యామ్ రోడ్ల నిర్మాణంతో మరో కీలక ముందడుగు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



తలకొండపల్లి జూన్ 28(జనంసాక్షి):
కల్వకుర్తి నియోజకవర్గంలో భారీ మొత్తంలో 28 గ్రామాల అనుసంధాన బీటీ రోడ్ల పునఃర్నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.ఆదివారం తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.ప్రజల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.కల్వకుర్తి నియోజకవర్గానికి భారీ మొత్తంలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,కి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.కల్వకుర్తి నుండి ప్రతిపాదించిన మొదటి దశలోనే నియోజకవర్గానికి భారీ స్థాయిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.పంచాయతీరాజ్ మరియు రోడ్లు,భవనాల శాఖల పరిధిలో మొత్తం 28 బీటీ రోడ్ల నిర్మాణం,పునఃర్నిర్మాణ పనులకు అనుమతులు వచ్చినట్లు తెలిపారు.దాదాపు 160 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి త్వరలో శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ,వాణిజ్య,విద్య,వైద్య సేవలకు మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్,పిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్,రాష్ట్ర గిరిజన నాయకులు హన్మా నాయక్,ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత,ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి,ఏఎంసి డైరెక్టర్లు శ్యాంసుందర్ రెడ్డి, అజీమ్, కడ్తాల్ సర్పంచ్ రాయికంటి బిక్షపతి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహా,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి,నాయకులు శ్రీనివాస్ రెడ్డి,ఆవాంచ నరసింహారెడ్డి,రవీందర్ యాదవ్,శ్రీశైలం,పయ్యావుల రమేష్,బాల్ రెడ్డి,రాజు రెడ్డి,రాజేందర్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి మోసపోతే గోసపడతాం

- స్పీకర్ రాజ్యాంగ బాధ్యతలు విస్మరించారని ఆరోపణ
- కాంగ్రెస్ హామీలు అమలు కాలేదని కేటీఆర్ విమర్శ
- దామగుండం, మూసీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై ప్రశ్నలు
- 2028లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా



వికారాబాద్, జూన్ 28 (జనం సాక్షి):
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వికారాబాద్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ వాస్తవాలను విస్మరించి అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై స్పీకర్ స్పందించకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.
గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.2.80 లక్షల కోట్లేనని ఆర్‌బీఐ, కాగ్ నివేదికల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించిందని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే స్పీకర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు కూడా ఇష్టానుసారంగా అప్పుల లెక్కలు చెబుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులకు యూరియా కూడా అందించలేని పరిస్థితి నెలకొందని అన్నారు.
దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం లక్షలాది చెట్లను నరుకుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేదని, ప్రస్తుతం చెట్ల నరికివేత వల్ల భవిష్యత్తులో తీవ్ర పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అనంతగిరిలో పుట్టే మూసీ నదికి నీటి మూలాలను దెబ్బతీస్తూ నగరంలో మూసీ సుందరీకరణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు కేటాయించి పనులు ప్రారంభించిందని, కాంగ్రెస్ నాయకులే కోర్టుల్లో కేసులు వేసి ప్రాజెక్టును అడ్డుకున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఆ పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు రైతుల భూములను ఆక్రమిస్తున్నారని కూడా ఆరోపించారు.
కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్ల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో సంక్షేమ పథకాలు సమర్థంగా అమలయ్యాయని, వికారాబాద్‌కు మెడికల్ కళాశాల, కలెక్టరేట్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే వచ్చాయని అన్నారు. ప్రస్తుతం రైతుబంధు, రైతుబీమా, యూరియా సరఫరా, తాగునీరు, సాగునీరు, విద్యుత్, వైద్య సేవల్లో సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధించినా భయపడబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. 2028లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, రాజకీయ ఒత్తిళ్లకు లోనై వ్యవహరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు రాజకీయాలకు అతీతంగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, సబితా ఇంద్రారెడ్డి, మహేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రామచంద్రరావు, ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, నాగేందర్‌గౌడ్, శుభప్రద పటేల్, గోపాల్ ప్రభాకర్‌రెడ్డి తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి భారతం

- పోలియో రహిత దేశ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి భాగస్వాములు కావాలి
- పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్, కార్పొరేటర్లు,
- 0-5 సంవత్సరాల చిన్నారులందరికీ చుక్కలు వేయించాలి
- పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా నివాళులు







కరీంనగర్ బ్యూరో, జూన్ 28 (జనం సాక్షి):
జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత భారతదేశ నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రి భాగస్వాములు కావాలని కోరారు. ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధ, జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్, వైద్య అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ స్థానిక సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎన్ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సందర్శించి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. 11వ డివిజన్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న కట్టరాంపూర్ టెట్రా మోడల్ స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గౌతమ్ నగర్ ప్రైమరీ స్కూల్లో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు చుక్కలు వేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సుభాష్ నగర్ బిఆర్ఆర్ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పకుండా చుక్కలు వేయించాలని, పోలియో చుక్కలు పూర్తి సురక్షితమని, రాష్ట్ర ప్రభుత్వం పోలియో రహిత రాష్ట్రంగా కొనసాగించడానికి తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.
అదే సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పి.వి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పి.వి. నరసింహారావు బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణ కర్త అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కాంగ్రెస్ కార్యకర్తలు అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు వెన్న రాజమల్లయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఆకుల ఉదయ్, వంగల విద్యాసాగర్, శుకూర్, నాగుల సతీష్, కుంభాల రాజ్ కుమార్, మాదాసు శ్రీనివాస్, సుదర్శన్, మాలోతు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- శాంతి భద్రతలకు బంగం కలిగిస్తే సహించలేది లేదు
- బాధిత కుటుంబాలను పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్



బోడుప్పల్-జనంసాక్షి : బోడుప్పల్ అంబేద్కర్ నగర్ లో అర్ధరాత్రి జరిగిన దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని శాంతి భద్రతలకు బంగం కలిగించే వ్యక్తులెవరైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం దాడిలో నష్టపోయిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడులు చేసుకునే సంస్కృతి మంచిది కాదని ఎదైన ఇబ్బందులు ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలని సూచించారు. దాడులకు పాల్పడిన వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలిస్ శాఖకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాసాల వెంకటేష్ యాదవ్, జక్కుల రాములు, దేవరకొండ వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణలో బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ స్థాయి ఏజెంట్లే కీలకం
- అనుమానాస్పద ఓట్లపై ప్రతి ఓటరిని అప్రమత్తం చేయాలి
- తెలంగాణలో 80 లక్షల ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని ఆరోపణ
- అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు



చందుర్తి, జూన్ 28 (జనం సాక్షి): ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు మండల కేంద్రంలో నిర్వహించిన బీఎల్ఏలు, బూత్ స్థాయి ఏజెంట్ల అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఎన్నికల సంఘం అనుమానాస్పద లేదా పరిశీలన జాబితాలో చేర్చిన ఓట్లకు సంబంధించిన సమాచారాన్ని ఆయా ఓటర్లకు బీఎల్ఏలు అందించాలని, ఓటరు జాబితాలో పేరు లేకపోతే సంబంధిత దరఖాస్తు ఫారాలను నింపించి గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులకు సమర్పించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. వేములవాడ నియోజకవర్గంలో సుమారు 54 వేల ఓట్లు అనుమానాస్పద జాబితాలో ఉన్నాయని, ఎన్నికల సమయంలో పనిచేసినట్లే బీఎల్ఏలు ఇంటింటికీ తిరిగి ఓట్ల సవరణ కార్యక్రమంలో ప్రజలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో 89 శాతానికి పైగా ఓటరు మ్యాపింగ్ పూర్తయిందని, బీఎల్ఏలకు శిక్షణా శిబిరాలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఓట్ల సవరణ పేరుతో బీజేపీ ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం చేస్తోందని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, తెలంగాణలో కూడా సుమారు 80 లక్షల ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని విమర్శించారు. మండలంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తొలి విడతలో 500కు పైగా ఇళ్లు మంజూరు చేశామని, రెండో విడతలో కూడా అర్హులకు ఇళ్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముస్కు ముకుందరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, సర్పంచ్ పులి సత్యం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొట్టే ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చింతపంటి రామస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్, మాజీ జడ్పీటీసీలు నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి, పలువురు సర్పంచులు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయిద్దాం

## పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దుదాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపు
- 391 కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం
- చిన్నారుల ఆరోగ్య రక్షణకు తల్లిదండ్రులు సహకరించాలి



**రాజన్న సిరిసిల్ల, జూన్ 28 (జనం సాక్షి):** చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయాలని, పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం వేములవాడలోని ఏరియా ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నేడు 391 కేంద్రాల్లో పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలియో మహమ్మారి బారిన పడకుండా చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో చుక్కలు పూర్తిగా సురక్షితమైనవని, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత అవసరమన్నారు.

చిన్నారులు పోలియో చుక్కలకు దూరం కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలియో రహిత భారతదేశాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సంబంధిత శాఖల వారు ఇంటికి వచ్చి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి ఉపాధి కోసం వచ్చిన వారి పిల్లలకు కూడా చుక్కలు వేయడం జరుగుతుందని, హైరిస్క్ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు.

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో వైద్య ఆరోగ్య శాఖలో పెను మార్పులు తీసుకువస్తున్నామని, ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఉచిత ఆరోగ్యం అందేలా నూతన ఆసుపత్రుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రుల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తమ పరిధిలో గల ప్రాంతాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ తూము మధు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ నాయకులు, వైద్య సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# గన్నేరువరం రెవెన్యూకు మోక్షం

- సొంత భవనానికి రూ.2.25 కోట్ల మంజూరు
- పదేళ్ల నిర్లక్ష్యానికి తెర.. అద్దె కొంపకు గుడ్‌బై

**గన్నేరువరం, జూన్ 28 (జనంసాక్షి):** గన్నేరువరం మండల తహసీల్దార్ కార్యాలయానికి ఎట్టకేలకు శాశ్వత భవనం కల సాకారం కానుంది. గత పదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2.25 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. దీంతో అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం త్వరలోనే సొంత భవనంలోకి మారనుంది. తహసీల్దార్ ఇప్ప నరేందర్ మాట్లాడుతూ, నిధులు మంజూరైన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి, ఆధునిక వసతులతో కూడిన భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఇన్నాళ్లు ఇరుకు గదులు, సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ఇది ఊరటనిచ్చే నిర్ణయమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత భవనం అందుబాటులోకి వస్తే రెవెన్యూ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# విద్యా వైద్య రంగాల్లో దోపిడీ అరికట్టాలి

- ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి
- ప్రజా సమస్యలపై ఉద్యమాలు ఉధృతం చేయాలి
- సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజమే
- జూలై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు



**జగిత్యాల, జూన్ 28 (జనం సాక్షి):** విద్యా, వైద్య రంగాల్లో విచ్చలవిడి ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని సీపీఎం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం డిమాండ్ చేసింది. జూలై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చింది. ఆదివారం జగిత్యాలలో సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎంఏ చౌదరి అధ్యక్షత వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యా, వైద్య రంగాల్లో అధిక ఫీజుల దోపిడీ జరుగుతోందని, ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఉపాధ్యాయులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, మౌలిక సదుపాయాలు లోపించాయని విమర్శించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితర సిబ్బంది కొరతతో పాటు నిధుల లేమి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులు, స్కూళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, ప్రజలు భారీ ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, ఆసుపత్రుల్లో పర్యటనలు, ప్రచార ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. వి.బి.జి. రామ్ జీ చట్టం రద్దు చేయాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయడం లేదని విమర్శించారు. రేషన్ షాపుల ద్వారా ఒక్క వ్యక్తికి ఆరు కేజీలు మాత్రమే ఇస్తున్నారని, 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. ఇంటి స్థలాలు, ఇళ్లు, ఉపాధి, కూలీల పెంపు వంటి హామీలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటి చంద్రశేఖర్, ఎంఏ చౌదరి, వెలమలపల్లి వెంకటాచారి, హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు చన్నవేణి గంగారాం, పంబాల మల్లయ్య, పుల్ల బీరేందర్, శారదార రమేష్, ఎర్రోళ్ల చిన్న సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి

- సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజమే
- ప్రజల సమస్యలపై ఉద్యమాలు చేపట్టాలి
- బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలపై సీపీఎం విమర్శ



**కరీంనగర్ టౌన్, జూన్ 28 (జనం సాక్షి):**
ప్రపంచ దేశాలకు సామ్రాజ్యవాదమే ప్రధాన శత్రువని, దానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ప్రజా సమస్యలను అధ్యయనం చేసి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయం ముకుంద్‌లాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించిన కరీంనగర్ డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులకు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గుడికందుల సత్యం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై మాట్లాడిన వాసుదేవరెడ్డి, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఆ సంక్షోభం నుంచి బయటపడేందుకు అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాద దేశాలు యుద్ధాలు, ఆర్థిక ఆంక్షలు, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని పెంచుతున్నాయని విమర్శించారు. ఈ పరిణామాలు ప్రపంచ శాంతికి తీవ్ర ముప్పుగా మారాయన్నారు.

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయడం లేదని విమర్శించారు. దేశంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం జరిగిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వర్ణ వెంకట్‌రెడ్డి "పార్టీ నిర్మాణం" అంశంపై బోధించారు. బీఆర్ఎస్ పాలనపై విసిగిన ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఎన్నికల హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. స్థానిక సమస్యలను గుర్తించి ప్రజలను చైతన్యవంతం చేస్తూ దశలవారీగా ఉద్యమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు మాతంగి శంకర్, పుల్లెల మల్లయ్య, వట్టి జగదీష్, ఎండీ గోరేమియా, లక్ష్మణ్, సిద్ధిక్, ఆకాష్, దినేష్, మురళి, నవీన్, సిరి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

### తాండూరులో 581 మంది లబ్ధిదారులకు
# డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు

- కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా పారదర్శకంగా ఎంపిక
- 8,333 మంది దరఖాస్తుదారుల నుంచి ఎంపిక



**తాండూరు, జూన్ 28 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం (2-బిహెచ్ కే) ఇళ్ల కేటాయింపు ప్రక్రియ శనివారం పారదర్శకంగా ముగిసింది. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెడ్కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్‌బి) మరియు అదనపు కలెక్టర్ వెన్నుమార్పు వారి అధ్యక్షతన ఎమ్మెల్యే తాండూరు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, టౌన్ పార్టీ పర్సన్ ప్రెసిడెంట్లు, ప్రజాప్రతినిధులు, దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేపట్టారు. తాండూరు మున్సిపాలిటీ నుంచి 8,333 మంది అర్హులైన దరఖాస్తుదారులు. ఎంపికైన వారు మొదటి విడతలో 581 మంది లబ్ధిదారులను కంప్యూటర్ ర్యాండమైజేషన్ సిస్టమ్ ద్వారా ఎంపిక చేశారు. ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా, జిల్లా ఇంచార్జి మంత్రి పర్యవేక్షణలో శ్రీధర్ బాబు ఆమోదంతో ఈ ప్రక్రియ జరిగింది. జిల్లా ఉన్నతాధికారులు, ప్రత్యేక పరిశీలకుల సమక్షంలో వీడియో రికార్డింగ్‌తో పూర్తి చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సమాన అవకాశం కల్పించేందుకే కంప్యూటర్ డ్రా విధానం ఎంచుకున్నాం. 8,333 మంది సమక్షంలో, సాంకేతిక నిపుణుల నేతృత్వంలో స్వచ్ఛంగా 581 మందిని ఎంపిక చేయడం జరిగింది" అని తెలిపారు. ఎంపికైన 581 మంది వివరాలతో కూడిన జాబితాను తాండూరు మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచనున్నారు. ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, అర్హుల జాబితాను మరోసారి ర్యాండమైజేషన్ ద్వారా ఖరారు చేస్తారు. వార్డుకు కేటాయించిన ఇండ్ల భర్తీ పూర్తయ్యే వరకు ఈ ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. అత్యంత పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరగడానికి సహకరించిన తాండూరు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు జిల్లా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

# వరద కాలువ నీటి కోసం మహాధర్నా

- స్పందించకపోతే కేటీఆర్ నాయకత్వంలో కన్నెపల్లి వరకు పాదయాత్ర: గంగుల కమలాకర్



**కరీంనగర్ టౌన్, జూన్ 28, ( జనం సాక్షి) :** వరద కాలువ ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆదివారం మహాధర్నా నిర్వహించారు. నాగుల మల్యాల శివారులోని ఆచంపల్లి వరద కాలువ ఓటీ స్లూయిస్ వద్ద జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రైతులు వంటావార్పు చేపట్టి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో వరద కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయకపోతే రైతుల ప్రయోజనాల కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వారం రోజుల్లోగా ప్రభుత్వం స్పందించకపోతే భారీ మోటార్లు ఏర్పాటు చేసి వరద కాలువ నుంచి రైతులకు నీరు అందిస్తామని, అప్పటికీ స్పందన లేకుంటే కేటీఆర్ నాయకత్వంలో హరీశ్ రావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రైతులతో కలిసి కన్నెపల్లి వరకు పాదయాత్ర నిర్వహించి మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు.

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించే దిశగా గత పాలకులు పట్టించుకోలేదని గంగుల అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, రాష్ట్రానికి నీరు, విద్యుత్‌తో పాటు రైతుబంధు వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కాళేశ్వరం మోటార్లు నడిపితే కేసీఆర్‌కు పేరు వస్తుందనే రాజకీయ కారణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విడుదలను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. 2009లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కొత్తపల్లి ప్రాంత పరిస్థితిని పరిశీలించి, రోడ్లు, చెరువులు, కుంటల అభివృద్ధికి భారీగా నిధులు తీసుకొచ్చామని తెలిపారు. కొత్తపల్లి మండలంలోని ఏడు గ్రామాలకు సాగునీరు అందించేందుకు వరద కాలువ నుంచి నాగుల మల్యాల చెరువుకు నీరు చేరేలా ప్రత్యేక తూము ఏర్పాటు చేయించినట్లు గంగుల వివరించారు. ఇందుకు అధికారులతో చర్చించి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. తూము ఏర్పాటుకు తమ భూములను ఇచ్చి సహకరించిన రైతులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వారం రోజుల్లో ప్రభుత్వం స్పందించి వరద కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేసిన గంగుల కమలాకర్, లేకుంటే రైతులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో నియోజకవర్గానికి చెందిన సుమారు వెయ్యి మంది రైతులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## యూరియా యాప్‌ను తొలగించాలి

**చొప్పదండి ,జూన్ 28( జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం యూరియా యాప్‌ను తొలగించాలని బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ ఇన్చార్జి బందార అజయ్ కుమార్ గౌడ్ కోరారు. పంటల సాగు ప్రారంభమైన దశలో యూరియా ఆఫ్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఒక జిల్లాలో యాప్ ఓపెన్ అయితే, మరో జిల్లాలో క్లోజ్ అవుతుందని రాష్ట్రంలో ఉన్న యూరియా కొరతను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దొంగచాటు అడ్డదారులు తొక్కుతుందని ఆరోపించారు. అందరికీ ఒకేసారి యూరియా ఇచ్చే చేతగానితనాన్ని దాచడానికే జిల్లాకో రూలు, పూటకో మాట మాట్లాడుతున్నారని సకాలంలో ఎరువులు అందక రైతన్నలకు కష్టాలు తప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాప్ డ్రామాలు ఆపి, వెంటనే రైతులకు పూర్తి స్థాయిలో యూరియా అందించాలని డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయుల సర్దుబాటుల్లో పలుకుబడి, పైరవీలు నిరోధించాలి

- ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా బదిలీలు
- జీవో ఎంఎస్ 25 ప్రకారం సర్దుబాటు చేయాలి
- లేనిపక్షంలో ఉద్యమం చేపట్టాలి :ఉపాధ్యాయ సంఘాలు



**కథలాపూర్, జూన్ 28 (జనం సాక్షి):** జగిత్యాల జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటుల్లో పలుకుబడి, పైరవీలు, అక్రమాలు జరగకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. జీవో ఎంఎస్ నంబర్ 25 ప్రకారం సర్ప్లస్ ఉపాధ్యాయులను కాంప్లెక్స్, మండల స్థాయిలో సర్దుబాటు చేయాలని స్పష్టం చేసింది. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ అత్యవసర సమావేశం తిరుకోల శ్యాంసుందర్ అధ్యక్షతన నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం కొందరు ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో సర్దుబాటు చేసినట్లు ఆరోపించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల సర్దుబాటు ఈ నెల 30వ తేదీన ఉన్న సంఖ్య ఆధారంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రాతినిధ్యం చేశామన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీవో ఎంఎస్ 25 ప్రకారం సర్ప్లస్ ఉపాధ్యాయులను మొదట కాంప్లెక్స్ పరిధిలో, ఆ తర్వాత మండలం, మండలం తర్వాత పక్క మండలాలకు సర్దుబాటు చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం ఎలాంటి పక్షపాతం, అవినీతి, అక్రమాలు లేకుండా పారదర్శకంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని, లేనియెడల ఉద్యమ కార్యాచరణ ప్రకటించవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జగిత్యాల జిల్లా నాయకులు తిరికోల శ్యాంసుందర్, కొక్కుల రామచంద్రం, దాశెట్టి రవీందర్ రెడ్డి, అంబటి భూమేశ్వర్, ఎడ్ల గోవర్ధన్, గట్ల సంతోష్ కుమార్, ఎన్నం రామ్ రెడ్డి, బోగ రమేష్ పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి పౌరులు

- పోలియో రహిత సమాజం నిర్మాణం లక్ష్యం
- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన జువ్వాడి కృష్ణారావు



**మల్లాపూర్, జూన్ 28 (జనం సాక్షి):** నేటి బాలలే రేపటి పౌరులు అన్న దేశ ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఆలోచన విధానంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతున్నదని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండల కేంద్రంలోని మల్లాపూర్‌తో పాటు వల్గొండ, పాతదామ్ రాజుపల్లి, కొత్తదామరాజుపల్లి గ్రామాల్లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు పాల్గొని చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లలను మొదలుకొని ఐదు సంవత్సరాల పిల్లల వరకు పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని, పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, సర్పంచులు ఇల్లెందుల లింబాద్రి, పథకాల కిరణ్, కిరణ్ రొండ్ల రాజేశ్వరి, రాజారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు జలపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు నందు నర్సారెడ్డి, ఉప సర్పంచ్ ఇప్పపెల్లి గణేష్, ఆయా గ్రామ పంచాయితీల పాలకవర్గ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, వార్డు సభ్యులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు మోహన్ రెడ్డి, హనుమాన్ల రాజేందర్, హోటల్ రంజిత్, కొత్తూరి చిన్నరాజరెడ్డి, పుంద్ర లక్ష్మారెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధాన్యం అక్రమ తరలింపులో బాధ్యులపై కఠిన చర్యలు

- ఇప్పటికే పలువురిపై క్రిమినల్ కేసులు : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 28 (జనం సాక్షి);** కోనరావుపేట మండలం లో జరిగిన ప్రభుత్వ ధాన్యం అక్రమ తరలింపులో ఇప్పటికే పలువురు నిందితులపై జిల్లా యంత్రాంగం క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్ తరలించారు. మల్కపేట గ్రామంలో ఐకేపీ సెంటర్ బుక్ కీపర్‌గా పనిచేస్తున్న జంగిటి శ్రీనివాస్‌తో పాటు, సంబంధిత ఐకేపీ వీఓఏ పి.పర్శరాములును ఉద్యోగం నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఐకేపీ సీసీ ఎస్.శ్రీదేవిని సస్పెండ్ చేశారు. అదేవిధంగా రుద్రంగి గ్రామంలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు గడ్డం స్వామి, బద్దెనపల్లి గ్రామంలోని పీఏసీఎస్ నిర్వాహకుడు గాజుల నవీన్‌ను కూడా ఉద్యోగం నుండి తొలగించారు. జిల్లా పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాజశేఖర్ మరియు వేణులను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కోనరావుపేట మండల ఏపీఎం పీ. రాజేశం, సిరిసిల్ల పీఏసీఎస్ సెక్రటరీ బి. నరేష్‌ను సస్పెండ్ చేశారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పర్యవేక్షణ లోపం కారణంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, మేనేజర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మరియు జిల్లా సహకార అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆదిత్య లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌కు కూడా నోటీసులు జారీ చేసి, బ్లాక్ లిస్టులో పెట్టడం జరిగిందన్నారు. మానాల గ్రామంలోని గడ్డం స్వామి అలియాస్ గడ్డం నర్సారెడ్డి కి చెందిన అగ్రోస్ రైతు సేవా కేంద్రం యొక్క ఫెర్టిలైజర్ అండ్ సీడ్ లైసెన్సులను రద్దు చేశారు.

మల్లికార్జున రైస్ మిల్, వేములవాడ యొక్క పారిశ్రామిక లైసెన్స్ రద్దుకు సంబంధించి నోటిసులు జారీ చేసారు. రెవిన్యూ డివిజనల్ అధికారి, సిరిసిల్ల నేతృత్వం లోని కమిటి విచారణ ఆధారంగా తదుపరి చర్యల నిమిత్తం నివేదికను పౌర సరఫరాల శాఖ ఉన్నతాదికారులకు పంపించటం జరుగుతుందన్నారు. అలాగే ధాన్యం దారి మళ్లింపు అంశంపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూర్తి స్థాయి విచారణ నివేదిక అందిన వెంటనే, సంబంధిత బాధ్యులపై మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.

# డంపింగ్ యార్డును విరమించుకోవాల్సిందే

### చలో కలెక్టరేట్‌కు క్యామ మల్లేష్ యాదవ్ సంపూర్ణ మద్దతు



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 28 (జనం సాక్షి) :**
బండరావిరాల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 268లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఎకో టౌన్' (డంపింగ్ యార్డ్) ప్రాజెక్టును తక్షణమే విరమించుకోవాలని భువనగిరి పార్లమెంట్ మాజీ అభ్యర్థి క్యామ మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జూన్ 29న నిర్వహించనున్న 'చలో కలెక్టరేట్' ముట్టడి కార్యక్రమానికి ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు క్యామ మల్లేష్ యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి చలో కలెక్టరేట్ కార్యక్రమానికి మద్దతు కోరారు. వారి విజ్ఞప్తికి స్పందించిన మల్లేష్ యాదవ్, ప్రజల ఆరోగ్యం, పర్యావరణాన్ని పణంగా పెట్టి పచ్చని గ్రామాల మధ్య హైదరాబాద్ నగర వ్యర్థాలను తరలించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన చర్య అని అన్నారు. ప్రజల అభిప్రాయాన్ని తీసుకోకుండా, గ్రామాల అనుమతి లేకుండా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఈ విషయంలో ప్రజల ఆందోళనను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ సమస్యపై స్పందించకపోవడం ప్రజల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. బండరావిరాల, చిన్నరావిరాల, జగత్ పల్లి, పెద్దగూడెం, పిగ్లిపూర్, దేశ్‌ముఖి, కవాడిపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజల జీవితాలతో చెలగాటం ఆడితే సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జూన్ 29 ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న 'చలో కలెక్టరేట్' కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా ప్రజలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని క్యామ మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ న్యాయమైన ప్రజా పోరాటంలో తాను స్వయంగా పాల్గొని ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, సీనియర్ నాయకులు మొలుగు దానేశ్, కావాడి దయాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కందికంటి అనూష-ప్రవీణ్, కన్నె భరత్ యాదవ్, యువ నాయకులు ఏమ్ముల శివశంకర్, కొత్త శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
29 జూన్ 2026

# మాజీ ప్రధాని పీవీకి నివాళులు



హైదరాబాద్ (జనంసాక్షి) : ఆర్థిక సంస్కరణల పితామహుడు, దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 105వ జయంతి వేడుకలు ఆదివారం నగరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, ప్రముఖులు ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. శాసనసభ భవనంలోని లాబీ హాల్‌లో ఏర్పాటు చేసిన పీవీ నరసింహారావు చిత్రపటానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతితో పాటు పలువురు అసెంబ్లీ, శాసన మండలి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### పీవీ ఘాట్ వద్ద టీపీసీసీ చీఫ్, మంత్రుల నివాళి

హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద జరిగిన జయంతి వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పీవీ సమాధి వద్ద పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఏఐసీసీ కార్యదర్శి రుద్రరాజు తదితర నేతలు పీవీకి నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. అదేవిధంగా, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీ భవన్‌లోనూ కాంగ్రెస్ నేతలు పీవీ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

# టీటీడీకి అనంత్ అంబానీ భారీ విరాళం

- 25 ఎలక్ట్రిక్ బస్సుల అందించనున్నట్లు ప్రకటన



తిరుమల (జనంసాక్షి) : ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ నేడు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీకి భారీ విరాళం ప్రకటించారు. తిరుమల ఘాట్ రోడ్లలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా రూ.27.5 కోట్ల వ్యయంతో 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇవాళ తెల్లవారుజామున ఆలయానికి చేరుకున్న అనంత్ అంబానీ, శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులతో సమావేశమైన అనంత్ అంబానీ, తిరుమలలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీలోనే ఆయన భారీ విరాళంపై ప్రకటన చేశారు. కేవలం ఎలక్ట్రిక్ బస్సులను అందించడమే కాకుండా వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఈ బస్సులను నడిపే డ్రైవర్ల జీతభత్యాలను సైతం పూర్తిగా రిలయన్స్ సంస్థే భరిస్తుందని స్పష్టం చేశారు. అనంత్ అంబానీ తీసుకున్న ఈ నిర్ణయంపై టీటీడీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 26 గంటల సమయం పడుతోంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు సోమవారం నాటి వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు శ్రీవాణి దర్శనాలను కూడా రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది.

# ఉర్దూ బోధిస్తున్నారని ప్రిన్సిపాల్‌పై దాడి

- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందంటూ వీడియో వైరల్
- ఘటనకు నిరసనగా నేడు నిజామాబాద్ జిల్లా బంద్‌కు పిలుపు



నిజామాబాద్ (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లాలో ఓ పాఠశాలలో ఉర్దూ బోధిస్తున్నారన్న కారణంతో ప్రిన్సిపాల్‌పై కొందరు బీజేపీ నేతలు దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసుల సమక్షంలోనే ప్రిన్సిపాల్‌ను చెంపదెబ్బ కొడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయంపై రాజకీయంగా దుమారం రేగింది.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని భారత్ చంద్ర పాఠశాలలో శనివారం ఈ ఘటన జరిగింది. పాఠశాల యాజమాన్యం ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ అమెర్ ఖాన్, ఉర్దూను ద్వితీయ భాషగా బోధించేందుకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు స్థానిక బీజేపీ నేతలు పాఠశాలలోకి ప్రవేశించి, తమ పిల్లలకు ఉర్దూ పాటలు, మతపరమైన అంశాలు నేర్పుతున్నారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే వారు ప్రిన్సిపాల్ అమెర్ ఖాన్‌పై దాడి చేసి, చెంపదెబ్బ కొట్టారు. ఈ ఘటనపై కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ షమా మొహమ్మద్ తీవ్రంగా స్పందించారు. ప్రిన్సిపాల్‌పై దాడి చేస్తున్న వీడియోను ఎక్స్ లో పోస్ట్ చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. "తెలంగాణలోని ఓ పాఠశాలలోకి బీజేపీ గూండాలు చొరబడి, పోలీసుల ముందే ఉర్దూ బోధిస్తున్న ఉపాధ్యాయుడిపై దాడి చేశారు. ఈ ఘటనలో సంబంధిత పోలీసు అధికారులను సస్పెండ్ చేసి, బీజేపీ గూండాలను కఠినంగా శిక్షించాలి" అని ఆమె డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ చెప్పే 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' ఎక్కడ? అని ఆమె ప్రశ్నించారు.

మరోవైపు, విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకే ఉర్దూను రెండో భాషగా ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ అమెర్ ఖాన్ తెలిపారు. తనను, మరో ఉపాధ్యాయుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, చాలాసేపు నేలపై కూర్చోబెట్టారని, దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. ఈ ఘటనను మజ్లిస్ బచావో తెహ్రీక్ నేత అంజద్ ఉల్లా ఖాన్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ క్రమంగా ఆరెస్సెస్ ప్రయోగశాలగా మారుతోందని ఆయన ఆరోపించారు. ఈ దాడికి నిరసనగా సోమవారం నిజామాబాద్ జిల్లా బంద్‌కు పలు సంస్థలు పిలుపునిచ్చాయి. ఈ ఘటనతో జిల్లాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# జనసేన పార్టీలో కంటెంట్ రైటర్‌లకు అవకాశం!

హైదరాబాద్(జనంసాక్షి) : సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలపై పట్టు ఉండి, రచనల పట్ల ఆసక్తి ఉన్నవారికి జనసేన పార్టీ ఒక సువర్ణ అవకాశాన్ని కల్పిస్తోంది. తమ పార్టీ మీడియా, సోషల్ మీడియా విభాగాల్లో కంటెంట్ రైటర్లుగా సేవలందించేందుకు ఆసక్తి ఉన్న యువత, నైపుణ్యం ఉన్న వ్యక్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం (మంగళగిరి) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సామాజిక, రాజకీయ, పాలనా పరమైన అంశాలపై అభ్యర్థులకు మంచి అవగాహన ఉండాలి. తెలుగు లేదా ఆంగ్ల భాషల్లో అనర్గళంగా, స్పష్టంగా రాయగలిగే నైపుణ్యం ఉండాలి. కంటెంట్ రూపకల్పన పట్ల ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతోనే పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. అభ్యర్థులు తమకు ఆసక్తి, పూర్తి సాధికారత ఉన్న అంశాలను ఎంచుకుని వాటిపై కంటెంట్ అందించవచ్చని పార్టీ వెల్లడించింది. కంటెంట్ రైటర్లుగా సేవలందించాలని భావించే వారు తమ దరఖాస్తులను జులై 5వ తేదీ (05-07-2026) లోపు Centraloperations@ janasenaparty.org అనే ఈ-మెయిల్ ఐడీకి పంపించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు తమ బయోడేటాతో పాటుగా.. ఏదైనా సమకాలీన సామాజిక, రాజకీయ లేదా పాలనాపరమైన అంశంపై 200 పదాలకు మించకుండా ఒక వ్యాసాన్ని తప్పనిసరిగా రాసి మెయిల్‌కు జతచేసి పంపాలని జనసేన కేంద్ర కార్యాలయం స్పష్టం చేసింది.

# ఫీజుల మోత!





- అడ్మిషన్ల హడావుడి ముగియగానే ఫీజుల బాదుడు
- యూనిఫాం, బెల్టుల పేరుతోనూ వసూళ్లు
- పాఠశాలలోనే కొనాలంటూ నిబంధన
- తల్లిదండ్రులపై వేలల్లో అదనపు భారం

సంగారెడ్డి బ్యూరో, జూన్ 28 (జనంసాక్షి) : తల్లిదండ్రుల ఆశ...ఆశయాలే కార్పొరేట్ పెట్టుబడి...పిల్లల భవిష్యత్ కోసం వారు పడే తపన వారికి కాసులు కురిపిస్తోంది. తల్లిదండ్రులబలహీనతలపై కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలు ప్రతి ఏటా వ్యాపారం చేస్తున్నాయి. కార్పొరేట్ ముసుగులో కోట్లు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయి. నియంత్రించాల్సిన పాఠశాల విద్యాశాఖ చోద్యం చూస్తోంది. పాఠశాలలో జూన్ 15న పునః ప్రారంభం కావడంతో తల్లిదండ్రులు ఖర్చులకు భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో అడ్మిషన్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ, టీ షర్ట్ అంటూ అందినకాడికి దోచుకుంటున్నాయి. గతంలో విద్యార్థులకు కావలసిన పుస్తకాలు తమకిష్టమొచ్చిన చోట కొనుక్కునేవారు. అయితే ఇప్పుడు పాఠశాలల పంథా మారింది. పెన్సిల్ దగ్గర నుంచి పుస్తకాల వరకు, బెల్టు, టై, షూస్, యూనిఫాం అన్నీ ఆయా స్కూళ్లలోనే కొనాలి. దీంతో నర్సరీ , యూకేజీ ఎల్కేజీ ఒక్కో విద్యార్థికి సుమారు రూ.16 వేల నుండి 25 వేలు పైనే ఖర్చు కళ్ల ముందు కనిపిస్తోంది. ఇక ఏటా పెరుగుతున్న ఫీజులతో అదనంగా మరో కొంత కట్టాల్సి వస్తోంది. ఒకవైపు ఆర్థికభారం.. మరోవైపు పిల్లల భవిష్యత్ కోసం విద్యార్థుల తల్లిదండ్రులు మౌనంగానే ముందడుగు వేస్తున్నారు.

### మౌలిక వసతుల లేమి

విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేవు. తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా, ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ప్రభుత్వ అనుబంధనాల ప్రకారం నిర్ణయించిన ధరలకు అమ్మాల్సి ఉండగా ఎల్కేజీ విద్యార్థులకు రూ.2 వేల నుంచి 3 వేల వరకు ఖర్చవుతుంది. ప్రయివేటు , కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి.

### పెరుగుతున్న బరువు

ప్రైవేటు విద్యాసంస్థల మధ్య నెలకొన్న పోటీతోనే పుస్తకాల బరువు నానాటికీ పెరుగుతోందని ఓ అంచనా. పాఠ్యాంశాల బోధన, పునశ్చరణ, సాధనకు ప్రాధాన్యం పెరగడంతో పుస్తకాల బరువు పెరిగిందని మరోవాదన. గతంలో పదోతరగతి విద్యార్థి మోసినన్ని పుస్తకాలు ఇప్పుడు ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులే మోస్తున్నారు. ఇక ఇప్పుడు అప్పర్ ప్రైమరీ చదువు తున్న విద్యార్థులైతే కిలోలకు కిలోల బ్యాగులు మోస్తున్నా రంటే ఆశ్చర్యమేమీ లేదు. ప్రైవేటు విద్యాసంస్థలు తమ గుర్తింపు చాటుకోనేందుకు పుస్తకాలు కొనాలని సూచించడం, అనవసరమైన పుస్తకాలను కొనాలని చెప్ప డంతోనే ఈ పరిస్థితి దాపురించిందని చెప్పొచ్చు. విద్యా శాఖ సూచించిన సిలబస్ కన్నా రెట్టింపు సిలబస్ అమలు చేస్తూ ప్రైవేటు సంస్థలు బాల్యంపై ఒత్తిడి పెంచుతున్నాయి. మోత బరువు నియంత్రణకు విద్యాశాఖ అధి కారులు చేపడుతున్న చర్యలు మాత్రం శూన్యం.

### బాహాటంగా బుక్సు, స్కూల్ బ్యాగుల అమ్మకం

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో యజమాన్యాలు ఇష్టానుసారంగా బుక్స్, స్కూల్ బ్యాగ్స్, టై , బెల్టు , యూనిఫామ్ అమ్ముతున్నారు. కొన్ని విద్యాసంస్థలు స్కూల్లోనే అమ్మకాలు జరుపుతుండగా మరికొందరు స్కూల్ సమీపంలో షట్టర్ అద్దెకు తీసుకొని విద్యార్థులకు సంబంధించిన మెటీరియల్ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. విద్యార్థులు చదువుతున్న స్కూళ్లలో డబ్బులు చెల్లించి చీటీ తీసుకొని దుకాణానికి వెళితే స్కూల్ సిబ్బంది విద్యార్థులకు కావలసిన పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులు, టై బెల్టు తదితర వాటిని అందజేస్తున్నారు. పాఠశాల యజమాన్యాలు తాము వేసిన ధరకు ఒక్క రూపాయి కూడా తక్కువ కాకుండా ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ విద్యాల శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి ఆదర్శనగర్ కాలనీలోని స్పెక్ట్రా పాఠశాల సమీపంలోని ఓ దుకాణంలో పుస్తకాలు విక్రయిస్తున్నారు. ఇలా చాలా పాఠశాలల్లో బాహాటంగా విక్రయించడమే కాకుండా చిన్నచిన్న షాపులు అద్దెకు తీసుకొని పుస్తకాల వ్యాపారం కొనసాగిస్తున్నారు.

### తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం : సంగారెడ్డి ఎంఈఓ విద్యాసాగర్



పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు, యూనిఫామ్, నోట్ బుక్స్, స్టేషనరీ అమ్ముతున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే సంగారెడ్డి లోని 3 పాఠశాలల్లో యజమాన్యాలు విద్యార్థులకు సంబంధించిన వస్తువులు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో స్టేషనరీ ఉన్న రూమును సీజ్ చేసినట్లు తెలిపారు. సంగారెడ్డిలో ఎక్కడైనా అమ్ముతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎంఈఓ సూచించారు.

# కబ్జా చేసినోళ్లను జైళ్లో వేయండి

- పేదల ఇండ్ల జోలికొస్తే ప్రభుత్వాన్ని కూల్చుతాం
- హైడ్రాపై ఎంపీ ఈటల ఆగ్రహం



హైదరాబాద్ (జనంసాక్షి) : హైడ్రాకు భూకబ్జాదారులను శిక్షించే దమ్ములేదని, దమ్ముంటే భూమి కబ్జా చేసిన వారిని జైళ్లో పెట్టాలని ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహంవ్యక్తం చేశారు. హైడ్రా తీరుపై ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోయినపల్లి, అస్మత్‌పేటలో పేదల ఇళ్లను హైడ్రా కూల్చివేతకు వ్యతిరేకంగా ఎంపీ ఈటల రాజేందర్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. హైడ్రాకు రాజకీయ నాయకుల పేరు ఎత్తే దమ్ము లేదన్నారు. హైడ్రాకు కనికరం లేదని, పేదలు ఆర్తనాదాలు చేస్తున్నా వారి ఇళ్లను కూల్చడమే పనిగా పెట్టుకుందన్నారు. హైడ్రా దొంగచాటున కూల్చివేత్తలకు పాల్పడుతోందని నిజంగా హైడ్రాకు దమ్ముంటే ఇది ప్రభుత్వ భూమా? కాదా ఎంక్వైయిరీ చేయాలన్నారు. ఇది నిజంగానే ప్రభుత్వ భూమి అయితే ప్రభుత్వ భూమిలో లేహౌట్లు వేసింది ఎవరు? దీనికి సహకరించిన అధికారులు, రాజకీయ నాయకులు ఎవరో తేల్చి వారిని జైలుకు పంపించాలన్నారు. అది చేయకుండా నోరులేని పేదలపై ప్రతాపం చూపుతోందన్నారు. బాధితులు కోర్టుకు వెళ్లకుండా శనివారం, ఆదివారం హైడ్రా కూల్చివేతలు చేస్తున్నారన్నారు. ఇలాగే కూల్చివేతలు కొనసాగిస్తే హైదరాబాద్ లో ఏ ఒక్క బస్తీ మిగలదన్నారు. మీకు బుద్ధి జ్ఞానం ఉండాలి కదా అని ప్రశ్నించారు. పత్రాలు లేని పేదల భూములకు రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు కూల్చివేత్తలు చేయడం ఏంటని ప్రశ్నించారు. 70 ఏళ్లుగా ఇలాంటి రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రి ఉంటే నగరంలో ఇంత మంది బతికేవారా? అని నిలదీశారు. పేదల ఇండ్లు కూల్చివేస్తే ఈ ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ప్రజల వద్దకు మళ్లీ కాంగ్రెస్ రాదా? మీ నాయకులు రారా? అప్పుడు ప్రజలే మీ సంగతి తేలుస్తారన్నారు. ఈ భూములను బ్రోకర్లే అమ్మితే వారిని శిక్షించాలన్నారు. రెవెన్యూ శాఖలో అవినీతి మితిమీరిపోయిందని ఏ రెవెన్యూ అధికారి ఇంట్లో ఏసీబీ దాడి చేసినా నోట్ల కట్టలు బయటపడుతున్నాయని, ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నివాసంలో ఏసీబీ దాడులు చేస్తే కోట్లాది రూపాయలు దొరికాయని అధికారులు ఇంత లంచాలకు ఎగబడుతుంటే ఈ ప్రభుత్వానికి సిగ్గు ఉందా అని ప్రశ్నించారు.

# 'గోల్డ్ మ్యాన్' సూర్యాభాయ్ అరెస్ట్

- హైదరాబాద్ నుంచి పారిపోతుండగా షాద్‌నగర్ వద్ద అదుపులోకి



హైదరాబాద్ (జనంసాక్షి) : కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు ధరిస్తూ 'గోల్డ్ మ్యాన్'గా స్థానికంగా గుర్తింపు తెచ్చుకున్న సూర్యాభాయ్ అలియాస్ పల్లపు సురేష్ కుమార్‌ను హైదరాబాద్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. విదేశాల నుంచి నాణ్యమైన బంగారాన్ని తెచ్చి మార్కెట్ ధర కంటే తక్కువకే ఇస్తానని నమ్మబలికిన సురేష్ కుమార్.. హిమాయత్ నగర్, నిలోఫర్‌కు చెందిన పలువురి నుంచి దాదాపు రూ. 32 లక్షలు వసూలు చేశాడు. నెలలు గడుస్తున్నా బంగారం ఇవ్వకపోవడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు ఒత్తిడి చేశారు. దీంతో సెటిల్‌మెంట్ కింద కొందరికి రూ. 10 లక్షల విలువైన మూడు ఐఫోన్లు, రూ. 20 లక్షల చెక్కు ఇచ్చిన సూర్యాభాయ్.. ఆ తర్వాత మాట మార్చాడు. బాధితులే తనను బెదిరించి ఫోన్లు దొంగిలించారంటూ అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. అయితే పోలీసుల ప్రాథమిక విచారణలో సూర్యాభాయ్ చేసిన మోసం వెలుగుచూసింది. దీంతో ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కేసు నమోదైందని తెలుసుకుని హైదరాబాద్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించిన సూర్యాభాయ్‌ను పోలీసులు షాద్‌నగర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. భారీ బంగారు చైన్లు, గాజులు వేసుకుంటూ సోషల్ మీడియాలో, సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ సెలబ్రిటీలా తిరగడం సూర్యాభాయ్‌కు అలవాటు. దీంతో ఈ ఏడాది ప్రారంభంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు అతడి లైఫ్‌స్టైల్‌పై నిఘా పెట్టడంతో అతడు ధరించే నగల్లో చాలా వరకు రోల్డ్ గోల్డ్ (గిల్ట్ నగలు) అని తేలింది.

# గృహప్రవేశ వేడుకలో విషాదం

- ఇంట్లోకి చొరబడి రౌడీమూకల దాడి
- ఇల్లు అమ్మేందుకు నిరాకరించడంతోనే..



హైదరాబాద్ (జనంసాక్షి) : గృహప్రవేశ వేడుకలో ఒక రౌడీ గ్యాంగ్ ఆయుధాలతో ఇంట్లోకి చొరబడి పిల్లలు, వృద్ధులు అని తేడా లేకుండా విచక్షణారహితంగా విరుచుకుపడ్డారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ దేవేందర్‌నగర్‌లో జరిగింది.స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన బండారి అనిత శ్యామ్‌రావుకు బోడుప్పల్ దేవేందర్ నగర్ పరిధిలో ఒక ఇల్లు కొనుగోలు చేశారు. ఆ ప్రాంతంలోనే తిరిగే ఒక గంజాయి బ్యాచ్, రౌడీ మూక సదరు ఇంటిని తమకు తక్కువ ధరకు విక్రయించాలని గతంలో అనితపై ఒత్తిడి తెచ్చింది. అందుకు ఆమె నిరాకరించారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం గృహప్రవేశ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇల్లు తమకు దక్కలేదనే కక్షతో రగిలిపోయిన స్థానిక రౌడీ గ్యాంగ్, పథకం ప్రకారమే గృహప్రవేశం జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడ్డారు.

ఇంట్లోకి దూసుకువచ్చిన దుండగులు అక్కడ శుభకార్యంలో ఉన్న వారిపై బూతుపురాణంతో విరుచుకుపడుతూ, కంటికి కనిపించిన వారినల్లా చితకబాదారు. అడ్డువచ్చిన మహిళలు, చిన్నారులు, వృద్ధులని కూడా చూడకుండా విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. ఈ హఠాత్పరిణామానికి భయంతో కేకలు వేస్తూ అక్కడున్నవారు భయంతో పరుగులు తీశారు. ఈ దాడిలో పలువురికి తీవ్ర గాయాలు కాగా, బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించామని స్థానికులు వెల్లడించారు.

గృహప్రవేశ కార్యక్రమానికి హాజరవుతూ పక్కనే నివసించే ఓ వ్యక్తి ఈ దౌర్జన్యాన్ని చూసి, ఘటనకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రౌడీ మూక సదరు వ్యక్తి కారును పూర్తిగా ధ్వంసం చేసి ఆయన ఇంటిపైకి కూడా దాడికి యత్నించారు. ఆ సమయంలో మొబైల్‌లో వీడియో తీసిన మరో స్థానిక వ్యక్తిపై కూడా దుండగులు భౌతిక దాడికి దిగారు. ఒక్కసారిగా రౌడీలు సృష్టించిన ఈ బీభత్సంతో దేవేందర్ నగర్ అంతా భయాందోళనలతో వణికిపోయింది. ఈ గ్యాంగ్ స్థానికంగానే ఉంటూ నిరంతరం గంజాయి సేవిస్తూ, రౌడీయిజం చేస్తూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేస్తోందని, వీరిపై గతంలోనూ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ దాడికి పాల్పడిన వారిలో ఇప్పటికే 8 మందిని గుర్తించామని మేడిపల్లి సీఐ జలంధర్ రెడ్డి వివరించారు. వారిలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన ఆరుగురి కోసం 3 ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని వెల్లడించారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే 23 మందిపై రౌడీ షీట్లు ఉన్నాయని, ఇప్పుడు వాటిని పునఃసమీక్షిస్తున్నామని చెప్పారు. అవసరమైతే ఈ దాడికి పాల్పడిన వారందరిపై రౌడీ షీట్స్ తెరుస్తామన్నారు. శుభకార్యంలో చొరబడి ఇంతటి దారుణానికి ఒడిగట్టిన గంజాయి బ్యాచ్‌పై, రౌడీ మూకలపై పీడీ యాక్ట్ నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని దేవేందర్ నగర్ కాలనీవాసులు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370